సృజన

182

డిసెంబర్ 1990

ఆధునిక సాహిత్యవేదిక

మాసపత్రిక

నందిని సిధారెడ్డి, కూర్మారావు, బదిలి పిల్లర్

కవితలు

రుద్రజ్వాల

పాట

చంద్రుడు, శ్రీనివాసమూర్తి

కథలు

కె. వి. ఆర్.

వ్యాసం

ఆర్. ఎస్. రావు

సమీక్షా సమీక్ష

నిర్వహణ
'సాహితీమిత్రులు'

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

182 మాసపత్రిక డిసెంబర్ 19

ఈ సంచికలో....

నిర్వహణ
'సాహితీమిత్రులు'

సంవత్సర చందా రు. 40 ఈ సంచిక రు.

Edited, Printed and Published by P. Hemalatha, Flat
Block 2, MIG II, Bagh Lingampalli, Hyderabad 500 044
and Printed at Nagendra Press, Vijayawada - 520 002
Working Editor : Vara Vara Rao

అంధకార నగరంలో ఆశారేఖలు ?!

తొమ్మిది రోజులుగా హైదరాబాదు నగరం అనుభవిస్తున్నది కోతపెట్టే శీత కాలం కాదు; గుండెకోత కాలం. రాలిపోతున్నవి డిసెంబర్ పూలుకాదు మానవత్వపు విలువలు. ఏ తర్కమూ ఏ ప్రమాణమూ ఏ విశ్లేషణా వివరించలేని, ఏ భాషలోనూ మాటలు చాలని అమానుష కృత్యాలు అలవోకగా జరిగిపోతున్నాయి. వివరాల్లోకి పోతే పదాలు పదునుకోల్పోయి భావాలు అభావమయిపోయి సున్నిత మనస్కత బండబారిపోయి ఇప్పటికే అసహాయ మౌననిశ్చలమయిపోయిన మనం స్పందనలేని స్థాణువులమవుతామేమోనని భయంగా వుంది.

వందకు పైగా మనుషులు హతులయ్యారు. మనుషులు. రక్తమాంసాలున్న మనుషులు. వికసిస్తున్న పువ్వులు. వెల్లివిరుస్తున్న వయస్సులు. పండు ముదుసళ్ళు. మతాలన్నీ దూరంగా వుంచిన మహిళలు. పనియే మతంగా బతుకుతున్న పలువురు. వాళ్ళు హిందువులో ముస్లిములో కావడం మనుషులు కావడమంత ముఖ్యమైన విషయంకాదు. వాళ్ళల్లో అత్యధికులు పేదవాళ్ళు. రెక్కాడితే తప్ప డొక్కాడని వాళ్ళు. పాతబస్తీలో బతుకు భయం భయంగా ప్రాణాలు ఉగ్గబట్టినవాళ్ళు. ఇవాళ సైన్యం తిరగడానికి ఇరుకయిపోయిన, ఈ గల్లీలే వాళ్ళను రోజూ నిత్యావసరాలకు అయిదేళ్ళకోసారి, మూడేళ్ళకోసారి పోలింగు బూతులకు తీసుకపోతున్నాయి. సూర్యకిరణాలు దూరని సందులు, రాజకీయ నాయకులు చూడని గొందులు అక్కడ వుండవచ్చు గానీ దారిద్ర్యాన్ని చవిచూడని వాడలు లేవు. ఇప్పుడు గృహదహనాలు, విధ్వంసనాలు పొగలు రేగని, గుబులు రగుల్కొనని ఇళ్ళులేవు. ఈ హత్యా విధ్వంసనాలకు ఏం పేరు పెడదాం.

ఇవి మతవిశ్వాసాలే అయితే అయోధ్యలో 'కరసేవ' 'సత్యాగ్రహ' నిగ్రహాన్ని ప్రదర్శించగలిగినప్పుడు పాతబస్తీలో అది ఎందుకు హత్యాకాండగా మారింది ? అప్పుడు 'కరసేవ'కు వెళ్ళిన వీరులందరూ ఇపుడు నగరంలో వున్నందుకేనా ? మళ్ళా డిసెంబర్ 6న కరసేవకు చేసిన తయారీలన్నీ అయోధ్యకు అనవసరమయి ఇంకేం చేయాలో తోచనందుకేనా ? హైదరాబాదు పురపాలక సంఘానికి మళ్ళీ ఎన్నికలు జరిగే తరుణం వచ్చింది గనుక బి. జె. పి., ఎం. ఐ. ఎం, పార్టీలు తమ బలాబలాలు తేల్చుకోదలుచుకున్నాయా ? ఓట్లు మాత్రమేకాదు మన పార్లమెంటరీ ప్రభుత్వాలను 'కరసేవ'లు కూడ మార్చగలవని ఒకసారి అయోధ్య రుజువు చేసింది

గనుక కాగడాలకు, తల్వార్లకు ఉద్రేకం వచ్చిందా ? ఇవేవీ అబద్ధాలు కాకపోయినా ఇవన్నీ పాక్షిక సత్యాలే. ఈసారి 'మతకలహాల్లోని' రాజకీయార్థిక సూత్రాలను సామాన్యులు చదవగలుగుతున్నారు.

ఒకప్పుడు హైదరాబాదులో ఓట్ల రిగ్గింగు పాతబస్తీలో మజ్లిస్, మిగతా ప్రాంతాల్లోంచి బి. జె. పి. గుత్తాధికారంగా సాగేది. గుండాగిరీ అంతే. భూమికబ్జాలూ అంతే. మూసీకి ఆవలవున్న భూములన్నీ ఇవ్వాళ పట్టణ ఆస్తులయి వేల లక్షల రూపాయల విలువ చేస్తున్నాయి. అవి ఈవలి నగరం వలె ఇప్పటికే బయటినుంచి వచ్చినవాళ్ళ ఆక్రమణలో, పోనీ, అనుభవంలో లేవు. అవి ఎక్కువగా అక్కడ పుట్టిపెరిగిన తరతరాల వారసులవి. అవి పూరి గుడిసెలయినా, కూలిన గోడలయినా అవి నేలమట్టమయితే వేల విలువ చేసే పట్టణ ఆస్తులవుతాయి. టర్కమన్ గేటును సంజయ్‌గాంధీ ఎందుకు బుల్‌డోజర్లతో ధ్వంసం చేయించాడో గుర్తుచేసుకుంటే ఇవ్వాళ పాతబస్తీ నుంచి ప్రజలు వేల సంఖ్యలో ఎందుకు ప్రవాసులవుతున్నారో అర్థమవుతుంది. ఇప్పుడీ పాతబస్తీ భూముల ఆక్రమణ పోటీలో కాంగ్రెస్‌వాళ్ళు దిగారు. ఈసారి ఎన్నికల్లో, ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ యువనాయకులు ఓట్ల రిగ్గింగులోగానీ, గూండాయిజంలో గానీ ఇటు బి.జె.పి. వాళ్ళను అటు మజ్లిస్ వాళ్ళను మట్టికరిపించారు. మజ్లిస్‌తో ఎప్పుడూ వాళ్ళకొక అలిఖిత అవగాహన వుంటుంది గనుక వాళ్ళు బతికి బయటపడ్డారు. ఇప్పుడు భూమికబ్జాల కోసం దిగిన ఈ దంగల్‌లో విధ్వంసకాండలో గానీ, హత్యల్లోగానీ ఇన్నాళ్ళూ తయారీ చేసుకుంటున్న బి. జె. పి., ఎం.ఐ.ఎం.ల కన్నా వీళ్ళు బకాసురులనిపించుకున్నారు. దీనికి తక్షణ కారణం భూమిదాహంతో పాటు వీళ్ళకు అధికార అవకాశం వున్నది. 'అసమ్మతివాదులు' అనే మర్యాదకరమైన పార్లమెంటరీ పదప్రయోగంతో పిలవబడుతున్న వీళ్ళు అసెంబ్లీలో ఒకే పార్టీ వాళ్ళు గనుక అసమ్మతి ఎలాగూ తెలపలేరు. ఫిర్యాదుల రూపంలో, విజ్ఞప్తుల రూపంలో అధిష్టానవర్గానికి 'నక్సలైటు' బూచిని చూసి కూడ చెప్పారు. మతం అధికారాన్ని మార్చే తురుపు ముక్క అవుతుందని అయోధ్య మరోమారు రుజువు చేసింది గనుక నలుగురు నమ్మడానికి వీలయిన మత వైషమ్యాల సాకు పాత నగరంలో ఎంచుకున్నారు. ముస్లిములు ఉన్నచోటనే మత కలహాలు అవుతాయి చూడండి అని చెప్పడానికి ఈసారి బి.జె.పి. పథకం ప్రకారం హైదరాబాదు, అలీఘడ్, కాన్పూరు, మీరట్, ఆగ్రా, అహ్మదాబాదులలో ఈ చిచ్చును

రగిల్చింది. 'మతకలహాలకు కాంగ్రెస్ కన్నతల్లి' అని వాజపేయి పదేళ్ళ కిందనే తన పుట్టిల్లు ఏదో కూడ సరిగానే పోల్చుకున్నాడు.

మనుషుల మధ్య విశ్వాసాలు విచ్ఛిన్నమైపోతే సమాజంలోని ప్రజాస్వామిక మైన విలువలన్నీ క్రమంగా క్షీణించిపోతాయి. ఇవి మత విశ్వాసాలకు సంబంధించిన భావోద్రేకాలు కాదు. కనుక ఇవి అంత తొందరగా సమసిపోగలవని కూడ చెప్పలేం. ఇవి కేవలం ఆస్తులు, అధికారానికి సంబంధించిన అమానుషమైన దమనకాండలు, దహనకాండలు. నిన్నటి దాకా సెక్యులర్‌గా జీవించి ఆ భావాలను పోషించడానికి కృషి చేసినవాళ్ళు కూడా హత్యలను లెక్కవేసో, ప్రవాసాలను లెక్కవేసో కని పించే గణాంకాలతో కనిపించని గుణాన్ని అంచనా వేస్తుచూస్తారు. ఉదాహరణకు మూసీ ఈవలకు హిందువులే వలస వస్తున్నారు. గనుక ఈసారి హిందువులమీద ఎక్కువ దాడి జరిగింది అంటారు. అంతేగానీ రెండు ప్రపంచాలుగా రాజకీయ పెత్తం దార్లు విడగొట్టిన హైదరాబాదులో పాతబస్తీలోని ముస్లిములు తమకు అక్కడే రక్షణ లేనప్పుడు ఇంకెక్కడా లేదన్నంతభద్రతా రాహిత్యానికి గురయ్యారని గ్రహించలేదు. పోలీసులమీద రాజకీయ నాయకుల ఒత్తిడి విపరీతంగా వున్నమాట నిజమే గానీ పోలీసు అధికారులలో కూడ భూబకాసురులతో, అధికార దాహంతో మిలాఖతయి వున్నారని, సామాన్యులకు లేని కులమత విషాలో నిండామునిగి వున్నా రని మనం ఇటువంటి విషమ సమయంలో మరచిపోయి పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరుకుంటాం. హైదరాబాదులో మొదటిసారిగా సైన్యం అధీనంలోకి పాత నగరం వచ్చింది. ఇన్ని బెటాలియన్ల సి.ఆర్.పి.ఎఫ్. గానీ, ఇరుగుపొరుగు రాష్ట్రాల స్పెషల్ పోలీసులు గానీ కేవలం పాతబస్తీ కోసమే రాలేదని, ఇవి ఆంధ్ర ప్రదేశ్‌లో మరీ ముఖ్యంగా విప్లవోద్యమ ప్రభావంగల ప్రాంతాల్లో ఇంకా చాలకాలం వుండబోతున్నాయని డి.జి.పి. అన్యాపదేశంగా సూచించనే సూచించాడు. ఎన్నికల్లో విశ్వాసమున్న పార్టీలన్నీ ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన కోరుతున్నాయి. అధి కారం వున్న పార్టీ తప్ప-రేపు చెన్నారెడ్డి రాష్ట్రపతి పాలన కోరినా ఆశ్చర్యంలేదు) అంటే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం తన ప్రచ్ఛన్న వేషాన్నికూడ తీసేసి రాష్ట్రపతి పాలన (అస్సాం, పంజాబ్‌లలో మిలటరీ పాలన కావాలని కోరుతున్నది బి.జె.పి.) సైనిక నియంత్రణ, కర్ఫ్యూ, టాడా తన నిజరూపమని చెప్తున్నది. మత విద్వే షాల రూపంలో ప్రచారమవుతున్న ఈ భూదాహాన్ని, అధికార దాహాన్ని ఆత్మరక్షణ. ప్రతిఘటన ద్వారా ఎదుర్కొనే మార్గాన్ని కూడ ప్రజలే మనకు చూపుతున్నారు. అదొక్కటే అంధకారంలో ఆశారేఖ.

నర్మెట సంఘటనలు

పిడికెడు గూండాలను కర్ఫ్యూలో పెట్టి, సైన్యాలను దించికూడ ఎలా అదుపు చేయాలో తెలియని ప్రభుత్వానికి వేలాదిమంది ప్రజల్ని ఎట్లా వేధించాలో ఎట్లా చెదరగొట్టి బెదరగొట్టాలో మాత్రం బాగానే తెలుసు. ఆ పని పోలీసులు ఆనాడు ఇంద్రవెల్లిలో చేసారు. ఇవ్వాళ నర్మెటలో చేశారు. అంతకుముందూ ఈ మధ్య కాలంలో చేయలేదనికాదు. న్యాయమైన హక్కులకోసం గిరిజన రైతుకూలి సంఘం సభ పెట్టుకుంటే ఆనాడు నిరాయుధులైన ఆదివాసుల్ని అరవై మందిని పొట్టన బెట్టుకున్నారు. ఈనాడు అరెస్టయిన తమ నాయకుణ్ణి 'ఎన్‌కౌంటర్' చేస్తారేమోనన్న ఆందోళనతో ప్రదర్శన జరిపిన నిరాయుధులైన ప్రజలమీద కాల్పులు జరిపి పది మందికి పైగానే చంపివేశారు.

డిసెంబర్ 3వ తేదీరోజు వరంగల్ జిల్లా రాడికల్ యువజన సంఘం అధ్యక్షుడు చంద్రమౌళిని నర్మెట సబ్ ఇన్‌స్పెక్టర్ వెంటబడి తరిమి తరిమి అరెస్టు చేసాడు. కొడపటి సుదర్శన్‌ను కాజీపేట ఎస్.ఐ. చేసినట్లే. ఆనాడు సుదర్శన్ అయినా, ఈనాడు చంద్రమౌళి అయినా రహస్య కార్యకర్తలు కాదు. ఈ చంద్రమౌళి నాయకత్వంలోనే నర్మెట, పరిసర గ్రామాల ప్రజలు ఇదే పోలీసు స్టేషన్ ముందు ఇదివరకు కొన్ని డిమాండులతో ప్రదర్శన చేసారు. ఆయా గ్రామాల్లో రాడికల్ జెండాలు కట్టిన గద్దెలుకూల్చి, జెండా కర్రలు విరిచేసి జెండాలు చింపేస్తే ధర్నాచేసి ఆయన నాయకత్వంలోనే ఇదే ఎస్.ఐ.తో క్షమాపణ చెప్పించారు. ఆ కక్షతో ఎస్.ఐ చంద్రమౌళిని ఏమైనా చేయవచ్చుననే భయం ఆ ప్రజల కుండడం సహజమే. నర్మెటకు వస్తూనే తాను నక్సలైట్లకు తడాఖా చూపిస్తానని ప్రగల్భాలు పలికి సర్పంచ్‌లను కూడ అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టిన చరిత్ర అతనికున్నది. ఆయన తూటాలమీద మాత్రమే భరోసా పెట్టుకున్న అధికారి కనుక మొదటిరోజు వందల సంఖ్యలో రెండోరోజు వేల సంఖ్యలో ప్రజలు పోలీసు స్టేషన్ ముందు ప్రదర్శనలు జరిపారు. ఒక విధంగా పోలీసు స్టేషన్‌లో వున్న తమ నాయకుణ్ని అరెస్టయిన దగ్గర్నించీ 'ఎన్‌కౌంటర్' కాకుండా కంటికి రెప్పలా కాపాడుకున్నారు కాని వాళ్ళ చేతుల్లో రాళ్ళుగానీ, కర్రలుగానీ లేవు. ఆయుధాలున్నాయనడం అతిశయోక్తివంటి అలంకారం కాదు. బదనామీ చేసే అబద్ధం. వాళ్లు రోజంతా పాటలు పాడుతూ

(తరువాయి 77 వ పేజీలో)

తుపాకులు బొగ్గు తోడయ్
సెమ్మాసులు అగ్గి తోడ్తయ్

—బదిలి ఫిల్లర్

1

మేం
పైకుజేత్తే
కరంటు కరువైతందని,
సిమిటి కంపెన్లు మూతవడ్డయని
ఊర్య ఫాక్టిరి బందైందని -
దేసమంత అల్లకల్లం అయితందని
పేపర్ల పెద్దచ్చరాల్తోని ఏయింస్తిరి....
మాయ మాటలుజెప్పి రాయింస్తిరి....
మరి మీం గాదన్నమా !
మారవుతం సెప్పైతెనె
అవన్ని నడ్తన్నయంటన్నం.

2

మోకాల్ మంటి బుర్దనీల్లల్ల - బొగ్గుపెల్లల్ల
బువ్వమెతుకులు దేవులాడుకుంటన్నం
మీ తీర్గ బీరు బిర్యాన్లకు మర్గికోల్లంగాదు.
అయ్యా బాంచనంటిమి ....
జరమా కట్టం జూడుండ్రి దొరాంటిమి ....
అర్జీలు పెడితిమి, అల్గితిమి, కోపానికత్తిమి ....
గింతనన్న మా మాటల్ పట్టిచ్చుకున్నరా !
గిప్పుడు మీం పైకులవోంగనే
గీ రాజ్యమేలే దొరల్ జెప్పినట్టు
దొంగమాటల్ జెప్పవట్టిరి
కోట్లకొద్ది కద్పుల్ జూపియ్యవట్టిరి

లక్షటొంభై కథల్ జెప్తిరి
నోట్లె శెక్కరవోసిన తీర్గ బెల్లంబూసినట్టు మాట్లాడవత్తిరి ....

3

మీ ఆఫీసులయ్ ఏసీలడిగెనమా
మీ ఇంట్లయ్ ఫ్రిడ్జులడిగినమా
పనిజాగల పానంగాపాడుకోను -
గింత గాలడిగినం ....
ఎన్టిపీసిల ఎల్గులోగ్లె మీ ఇండ్లుమెర్తె
మాకేం కండ్లమంటలేదు.
సీకటిదొనల్ల మొసెల్లక .... పెయ్యంత ఉడ్కంగ
పెల్లకుపెల్ల జమ్సి లాడీసులకెత్తుతన్నం
తొక్కలన్ని మగ్గుమగ్గుగాంగ
వాగిన్లకొద్ది బొగ్గు జారగొడ్తన్నం ....
మా గుడిసెకో కరంటు బుగ్గ కావాల్నంటె తప్పా!
ఇరువయేండ్ల పట్టి
నరాలన్ని ఈడ్సుకపోంగ, తోలంత మాడిపోంగ
పన్జేత్తన్నం
గింత కొంప జాడసూపకపోతిరి
ఎట్లుంటన్నవ్, ఏడవంటన్నవ్ అనడిగినోడెలేకపాయె
నిన్నగాక మొన్నచ్చినోనికె ....
మా బాగజితివిండని
బాయిలడిగకముందె బంగ్లాలు బందవస్తుజేస్తిరి
అదె, వాడేమనిసిగని మేం గాదా ?
మీ బిడ్డలు
పెయ్యంత బంగారంబూసుక్కని పుట్టినోల్లుగాదు
బడ్కిబోయినా, బజార్లకుబోయినా
బంగ్లాలల్ల ఇంగ్లీసు సదువుకోను సీట్లత్తయ్
కాళ్ల కిందవెట్టకుంట కంపని కార్లత్తయ్

మాపోరగాండ్లు అట్టి బొగ్గుమనుసులాయె
పనులకొట్టంలసడివినా, పందుల్తోని బల్కినా
మల్ల నాలెక్క తట్టమోసెటోడేనాయె ....

4

ఎన్కటోల్లె మాతీర్గ
ఎవ్వడేదటోతె మాకేందనేటోల్లుగాదు .... మా
ఉసురుదాకి పోతవని ఊకునెటోల్లుగాదు ....
ఇయ్యాల్రేపు పోరగాండ్లు తెల్విమీరిపోయింన్రు
దొరా !
జర ఎన్కముందు జూసిమెదులుకోంన్రి బాంచెన్

5

అద్దుమ్మనాత్రి తన్నిలేపి
ఛల్ నడువని జీపులేస్కపోంగనె
అంగవడి పన్జేత్తమనుకుంటంన్రా ! ?
తుపాకులు, తూటాలు పట్కతిర్గంగనే
బాయిలబొగ్గు బైటికత్తదా !
ఏదీ .... సెరోటివట్టుకొని
'అండర్ గౌండ్ల'కు పోదాం పాంన్రి ....

ఉషోదయానికి ముందు

నందినీ సిధారెడ్డి కవితలు రెండు

ఉషోదయానికి ముందు
తలుపులు తెరవాలా వొద్దా అని అనుమానం
తెరవకపోతే....
అరలో తిమిర తిమిరాల తీక్షణ క్రకచాల దాడిలో
తట్టుకోలేమని బోధపడింది

తెరుద్దామా...
రాజభక్తుల రక్త సముదాయంలోంచి
విరజిమ్మిన మృత్యు శైత్యం తరుముతుంది
వర్షానంతర రాత్రి
విశాల విహ్వలమైన ఏకపత్రాల దోనెల్ని
వొంపుదామా వొద్దా అని సందేహం
వొంపకపోతే
నాజూకైన శరీరం అంతంత బరువుకి
ఆత్మహత్య చేసుకోదా అని జాలి
వొంపుదామా
దోనెలమించి హిమపర్వతాలు జారి
మీదపడి కుప్పకూలిపోతామని భయం
ఏమయినా సరే
వాళ్ళు ఉషోదయానికి ముందే
తలుపు తెరవడానికి నిర్ణయించుకున్నారు

*

మట్టికున్నంత ఓపిక
మనిషి కెక్కడిది ?
మనిషి కున్నంత దుఃఖం
మట్టి గర్భం చీల్చుకు పుట్టిన
చెట్టు కెక్కడిది ?
యుగాల బీభత్స భీతావహాన్ని వడబోసిన
భూమి
తన లోహ శృంఖలాల్ని చూపెడుతూ తల్లడిల్లింది
"బిడ్డలారా
దమ్ము తీసుకోలేక చచ్చిపోతున్నాను
మీరన్నా నా చెర యిడిపించరా" అని ప్రాధేయపడింది
భూమి గురించి మాట్లాడాలా వొద్దా అని సంశయం

మాట్లాడకపోతే
తల్లి తమ కళ్ళముందే
దుఃఖంలో కాలి పోతుంది
మాట్లాడుదామా....
ఏలినవారి కారాగారాల కర్కశ స్పర్శకు
మూగదేహాలు ముకుళిస్తాయి
అయినా సరే
వాళ్ల గొలుసులు తెగ్గొట్టటానికే నిర్ణయించుకున్నారు

* *

చీకటి తీగలు
నల్దిక్కులా అల్లుకున్న తర్వాత
అలికిడి సద్దు మణిగిన సమయాన
చెట్టుకీ చెట్టుకీ నడుమ ఆకులు కదిలినట్లవుతుంది
అడుగు చప్పుడు కాకుండా
రహస్య నేత్రాలు పాడిన రైఫిల్ రాగాలు విన్పిస్తాయి
మనిషినీ మట్టినీ
అమృత హస్తాలతో స్పృశించటానికి అంకితమైన
త్యాగకుసుమాలు భయం తలుపులు తెరచి రమ్మంటాయి
తలుపులు తెరవాలా వొద్దా భయం
పూలబాట కోసం
చివరకు ముళ్ళు యేరివేయాలనే
వాళ్ళు సిద్ధమైనారు

* * *

ఒక పావురం ఇన్‌ఫార్మర్ అవుతుంది

* * * * *

ఉషోదయానికి రెండు గంటల ముందే
ఊరు వణుకుతుంది

వ్యాన్‌లు జీపులు బస్సులు ఆపుకుని
వందలాది రాజభక్తులు ఊరుని చుట్టుముడతారు
ఇండ్లూ గుడిసెలూ కొట్టాలూ దొడ్లూ
గాజెలూ గడ్డివాములూ గాలిస్తారు
రాజభక్తుల విశృంఖల విధ్వంస హింసాచరణకి
దొడ్లో పశువులు
పనుగడ దూకి పరుగులు తీస్తాయి
మనుషులకైతే ఆ ఒక్క అవకాశమూ ఉండదు
'అంబా' 'అమ్మా' అనే శబ్దాలే
అంతటా అల్లుకుని
ఆకాశం దద్దరిల్లుతుంది
నోరువిప్పాలా వొద్దా భయం
కిటికీల్లోంచైనా కళ్లుతెరచి చూడాలా వొద్దా వణుకు
ఏమయినా సరే
'మీరు మనుషులేనా' అని అడగడానికే
వాళ్ళు తెగించారు

* * * * *

ఉషోదయం తర్వాత కొన్ని క్షణాలకి
నలుగురి శవాలు మార్మోగాయి
నడిబజార్లో శవాలు పడుకోబెట్టి
హృదయాలమీద బూట్ల కవాతు చేస్తారు
బిడ్డలమీద పడి మొత్తుకుందామన్నా తల్లులకు వీల్లేదు
కండ్లనీరు కండ్లల్లోనే వొత్తుకోవటం
"వినండి
ఎవరు నోరువిప్పినా ఇదే గతి"
మైకులు గర్జించినాకొద్దీ మనస్తరంగం ఎగిసి పడుతుంది
ఏమయినా సరే
శవాల్ని చూపించి భయపెట్టినా సరే

"ఇవి అమానుష హత్యలనీ
రాజభక్తుల కట్టుకథలనీ"
లోకం ముందు ఎలుగెత్తటానికే
ఊరిజనం ఏకమైంది/బదులుకుంది

*   *   *   *   *   *

పతాక దృశ్యం

రావిచెట్టు మెడలు సాచి వినగలదా
రెండు నమ్మకాలు కత్తులు దూసుకుంటున్న సన్నివేశం !
ఒక్క కత్తిపోటే కావొచ్చు
దగడు తిన్న గుండెలో ప్రమాద సూచిని
ఏ బరామీటర్ అంచనా వేస్తుంది
రక్తధార ఎండి యెండి మరకలయేదాక
మనుషులెవరూ స్పర్శించని మాయకాలం మాయజాలం
ఎవరికన్నో ఎవరి చెయ్యో ఎవరి పేగో
ఎగిరిపడితే ఎవరు గుర్తించేది ?
దొర్లిదొర్లి పొర్లిపొర్లి తల్లడిల్లి
కేకలేస్తే ఎవరు లాలించేది ?
రెండు శిలలు గొంతువిప్పిన మృత్యు సంగీతసభ
తెగింది ఒక్కతలే కావొచ్చు
దెబ్బతిన్న జాతిలో మరణవేగాన్ని
ఏ పరికరం అందుకుంటుంది ?
శరీరం గాజుకుప్పెలో ప్రాణదీపం విలవిల్లాడుతున్న
విపరీత దృశ్యాలెవరికక్కసబడతాయి
భద్రతలేని నగరంలో
చిరునామా దొరకని అవయవాలు కుప్పలు పడతాయి
మూసుకుపోయిన దారుల్ని
పాదాలమీద మోసుకెళుతున్న ప్రయాణీకుడి ప్రపంచంలో
ఎంతాందోళన ?

రాతి బొమ్మకి గుడికట్టడానికి
దేశవాసుల గుండెల మీంచి నడిచిపోవటమేనా ?
జాతీయ నాయకుడి బొమ్మ రెండడుగులువేసి చివరి సందులోకి చూడగలదా
"అయ్యా దొరా
నేను యిరిగిపోయిన రిక్షని
తెగిపడ్డ మొండాన్ని
నేనెవరి జోలికీ వెళ్ళిన వాణ్ణికాదు
రెక్కాడకపోతే ఒక పూటైనా డొక్కాడనివాణ్ణి
నా కష్టం నా కన్నీళ్లు నా గాడిద చాకిరీ
తప్ప ఎవరి దిక్కూ చూసిన వాణ్ణికాను
ఎవరిజోలికీ వెళ్ళిన వాణ్ణికాను
నన్నెందుకు చంపారు బాబూ
నాదీ ప్రాణమే కదా"
తలమీద కుర్చీని ధరించిన జాతీయ నాయకుడి బొమ్మ నోరు విప్పదు
రౌడీ డేరాలకి
రథయాత్ర లాగవు
శాంతియాత్రలకు
స్వర్ణ కంకణాలు విరిగిపోవుసుమా
ముఠా సంస్కృతిని వెదజల్లుతూ
సద్భావన టోపీలెవరి నెత్తిలో పెడతారు ?
మొండాలకి మానవహారాలేసి ఇప్పుడెవరిని తృప్తి పరుస్తారు ?
ఆకర్షణీయమైన సంతాపవాక్యాల పాడెమీద ఇప్పుడెవరిని ఊరేగిస్తారు
రంగులద్దిన రాజకీయ కపోతం
ఎవరి భుజంమీద వాలటం కోసం
ఎగిరిందో ఎవరికి తెలియదూ
జాతీయ నాయకుడి విగ్రహమ్మీద
రెట్టవేసిన కాకిపిల్ల కూడా కనుక్కోగలదు
రత్న సింహాసనాన్ని మోసే
సింహం మాత్రం కళ్ళు విప్పి చూడగలదా
రెండు విశ్వాసాల మీదుగా
ఒక ఆశయం ఉదయించే మహా సన్నివేశం !

కవన అశ్వం

కూర్మారావు

భయపడుతున్నా -
గుర్రాల చప్పుడు వినేందుకు ఓ చెవి అటు పెడతాను
గుర్రాల పరుగు కళ్ళలో కదలాడుతూ వుంటుంది
నేత్రాలు మూసుకొని
నుదుటి భూమిని సుతారంగా మీటినపుడు
గజ్జల జలపాతం గుండెలపై దూకుతుంటుంది
అంతా అలుముకున్న యుద్ధ వాతావరణంలో
చెలరేగిన
గుర్రపు డెక్కల చప్పుడు విని
గెంతు గెంతుకూ
పరుగు పరుగుకూ
భయంలో కూడా పరవశించి పోతుంటాను
నేను పారవశ్యుడనై నందుకు
భయం మేఘాలు నా చుట్టు ముడతాయి
భయం లాఠీయై తలుపు తడుతుంది
భయం సెన్సారై ఉత్తరాల్లో అదృశ్యంగా పడగవిప్పుతుంది
భయం ఆఫీసరై
బదిలీల బాణాలు గురిపెడుతూ వుంటుంది
భయం భార్యై, తల్లై, పిల్లై
గుండెల చుట్టూ చుట్టేస్తుంది
భయం
శత్రువు సంధించిన ఆరోపణల అస్త్రమై వెంటాడుతుంది
భయంలో వూహించిన భవిష్యత్తులో -
లిప్తకాలం పాటు గుర్రాల శబ్దం వినిపించదు
గుర్రాల పరుగు కనిపించదు
నిర్లిప్త నరాలే మెదడుకు రక్తప్రసారం చేస్తుంటాయి

అప్పుడు
భయానికీ ఆరాటానికీ మధ్య సంఘర్షణ
చైతన్య రాహిత్యానికీ చైతన్యానికీ మధ్య సంఘర్షణ
అనుబంధాలకీ అమరత్వాలకీ మధ్య సంఘర్షణ
సంఘర్షణల్లోంచి
శ్రీకాకుళం మనసునిండా ముసురుకున్నపుడు
పుస్తకాల షెల్ఫులోని పాణిగ్రాహి పటం,
ముక్తకంఠ సంగీతం మరింత ఆరాటాన్నిస్తాయి
నన్ను నేను తెలుసుకుంటాను -
కళ్ళలో సూర్యగోళాలు నింపుకోనివాడు
భయం మేఘాల్లోంచి
ఘర్జనై, ఉరుమై బయట పడలేడు -
మనసులో యుద్ధాన్ని అవిష్కరించుకోనివాడు
కవన అశ్వం కూడా అధిరోహించలేడు
కనీసం గుర్రాల డెక్కల చప్పుడైనా వినలేడు -

గుట్టు

రుద్రజ్వాల

రాండిరో బడుగన్నా....మంథిని లేపుదాము
మతం గుట్టు చెండుదాము ॥ రాండి ॥
రామజపం పేరా....రగడాలు రేపుతోంది ॥ రామ ॥
రామ, జన్మభూమి పేరా....రక్తాలు తాగుతోంది ॥ రామ ॥
కూడు లేక ప్రజలూ కుప్పగూలి పోతువుంటే ॥ కూడు ॥
గుడ్డలేక జనులూ....గడగడవణకుతుంటే ॥ గుడ్డ ॥
గూడు లేక పేదా గోడు గోడు మనుచువుంటే ॥ గూడు ॥
అప్పల్లో దేశమాత దిక్కులేక అడలుతుంటె....
అయోధ్యా మహిమతోటి అందల మెక్కుస్తదంట ॥ రాండి ॥
మనిషి మనిషి చీల్చి మనుగడను తెంచుతోంది ॥ మని ॥
హిందు, హిందువంటూ హింసాను పెంచుతోంది ॥ హిం ॥

అంటరానితనమూ అడుగడుగు మరుగుతుంటే || అంట ||
అన్యాయం, అక్రమం అన్నిచోట్ల మరుగుతుంటె || అన్యా ||
అధిక ధరల రక్కసీ అదింపట్టి మింగుతుంటె || అది ||
బతకలేని కోట్లమంది భంగపడీ చస్తుంటే....
బాబ్రీ మసీదు కూల్చి భద్రం పుట్టి స్తదంట || రాండి ||
కరసేవల పేరిటా కర్రసాముచేస్తుండి || కర ||
భక్తిలీల పేరిటా బాకులు పట్టిస్తోంది || భక్తి ||
కలిసిమెలగినోళ్లూ కత్తులెత్తి పొడుచుకుంటుంటే || కలి ||
కలహాలూ, పెరిగి పెరిగి కర్ఫ్యూలై కరుస్తుంటే || కల ||
గృహదహనం మంటలేమో గగనాన్నే కూల్చుతుంటే || గృహ ||
రాష్ట్రాలకి రాష్ట్రాల్నే రణభూమిగ మార్చేస్తూ....
రాజకీయ కుతంత్రంతో రాజ్యానికి పొంచివుంది || రాండి ||
సన్యాసుల పేరుతో సాయుధులను నడుపుతోంది || సన్యా ||
జాగరణం పేరుతో చీకటినే నింపుతోంది || జా ||
సరయూనది తీరమంత చావుకేకలవుతుంటే || సర ||
మూసీనది ముచ్చటంత బిక్కు బిక్కుమంటుంటే || మూసీ ||
ఉత్తరాన జనం శాంతి మంటల్లో మాడుతుంటె || ఉత్త ||
కాషాయం పడగలెత్తి గతం తవ్వి కాటేస్తూ....
గద్దెమీది కెక్కాలని గారడీలు తిగిస్తోంది || రాండి ||

మట్టిని దున్నినోడ ముందునడచిరారా !
మగ్గం నడిపినోడ మబ్బువిడచి రారా !
కుండలు జేసినోడ కళ్లుతెరచి రారా !
కొలిమిని వూదినోడ కొరతదీర రారా !
క్షవరం జేసేటోడ కదుకెక్కి రారా !
కూలిగ మిగిలినోడ కొడవలెత్తి రారా !
బాధలు తెల్సినోడ బందూకై రారా !
బానలు తప్పనోడ బార్లు గట్టి రారా !

మతం, కులం ముళ్లకంప
ముందుదారి మూస్తున్నది
దండు గట్టి పోరితేనే
దగాబతుకు పోవునంట || రాండి ||

చవుురు దొంగలు

చంద్రుడు

ఆ రోజు దీపావళి - అదొక పారిశ్రామిక పట్టణం. సాయంత్రం తొమ్మిది గంటలౌతోంది. దుకాణదారులంతా తమ తమ దుకాణాలను సీరిస్ బల్బులతో అలంకరించారు. దుకాణాల ముందు కర్రలు పాతి వేలాది మట్టి ప్రమిదలను అలంకరించారు. ఆ ప్రమిదల చుట్టూ అడవిలోంచి తెచ్చిన పాలపొరుక కట్టారు. వాడలన్నీ పచ్చటి పాలపొరుకతో - దేదీప్యమానంగా వెలిగే దీపాల వరుసతో పట్టపగలులా తోస్తోంది.

చిన్న దుకాణదారులు టపాసులు, చిచ్చుబుడ్లు కాలుస్తున్నారు. పటాకుల మోత చెవులు చిల్లులు పడేవిధంగా విన్పిస్తోంది. తారాజువ్వలు పైకి దూసుకపోతున్నాయి. చిచ్చుబుడ్లు వెలుతురు చిమ్ముతున్నాయి.

చుట్టు ప్రక్క పారిశ్రామిక ప్రాంతాలనుండి, పల్లెలనుండి జనం ఈ సంరంభం చూడడానికి వచ్చారు. స్వీట్ హౌజ్‌ల్లో, పటాకాలు అమ్మే దుకాణాలల్లో జనం తోసుకుంటున్నారు. బ్రాంది షాపులు, బారులు కిటకిట లాడుతున్నాయి. పోలీసులు ట్రాఫిక్ కంట్రోల్ చేస్తూ, జనాన్ని కసురుతూ, తిడుతూ తిరుగుతున్నారు. ఈ జన సందోహంలో స్కూటర్ల, జీపుల హారన్ల చప్పుడు హోరెత్తుతోంది.

వాతావరణం మొత్తం గంధకం వాసనతో నిండిపోయింది. ఉండీ ఉండీ పెద్ద పెద్ద చప్పుళ్ళతో నగరం ధణధణ లాడిపోతోంది. వీధులనిండా పటాకాల కాగితాలు చెల్లాచెదురుగా పడుతున్నాయి.

జనం తమ దరిద్రపుగొట్టు బతుకులను కాసేపు మరిచిపోయి ఆ సంరంభమంతా తమదే అన్నట్లుగా తిరుగుతున్నారు. సిగల్లో, జడల్లో పువ్వులు తురుముకున్న పడుచు స్త్రీలు కిలకిల నవ్వుతున్నారు. తమ ప్రక్కనే పేలుతున్న బాంబులకు అదిరి పడుతున్నారు. వోరచూపులు చూస్తూ యువకులు పల్లె స్త్రీల వెంట పరాచికాలాడుతూ తిరుగుతున్నారు. కొత్త బట్టల పరపర - మొహాల మీద పులుముకున్న నవ్వులు నగరం సింగారించుకున్న యువతిలా ఉన్నది.

ఈ శబ్ద ప్రపంచంలో, ఈ జిలుగు వెలుగుల ప్రపంచంలో చౌరస్తా మీద ఓం ప్రకాశ్ అగర్వాల్ బిల్డింగ్ చుక్కల్లో చంద్రునిలా అలంకరించుకున్నది. ఆ

బంగ్లా కింద అన్ని రకాల షాపులున్నాయి. స్పేర్ పార్ట్స్ మొదలుకొని బట్టలు, జనరల్, బ్రాందీషాప్, ఎలక్ట్రానిక్స్, స్వీట్ హౌజ్ ఇట్లాగా ఆ కాంప్లెక్స్ మొత్తం ఒక కామధేనువు. అక్కడ అన్ని వస్తువులు దొరుకుతాయి. రెండవ అంతస్తుకు దాని వెనుక వేపు నుండి దారి ఉంది. అది ఒక పెద్ద అధునాతనమైన లాడ్జింగ్. దాని నానుకొని కింది భాగంలో పెద్ద నర్సింగ్ హోం. నర్సింగ్ హోమ్ ప్రక్క నుండి మూడో అంతస్తుకు దారి. మూడో అంతస్తు ఓం ప్రకాశ్ నివాసం.

ఓం ప్రకాశ్‌కు ఎన్ని రకాల వ్యాపారాలున్నాయో తెలియదు. అతనికి ఆరుగురు కొడుకులు. ఆరుగురు తలా ఇరువై రకాల వ్యాపారాలు చూస్తారు. హైద్రాబాద్‌లో హౌజింగ్ కాంప్లెక్స్ కట్టించి అమ్మడం దగ్గరి నుండి బీర్ బ్రేవరీస్ దాకా పెద్ద కొడుకు చూస్తాడు. ఈ బిల్డింగ్‌లోని దుకాణాలే కాక మట్కా జూదంతో సహా వడ్డీ వ్యాపారం అందరికన్నా చిన్నవాడు చూస్తాడు.

నిజానికి ఈ వ్యవహారాలన్నింటిలో ఓం ప్రకాశ్‌కు ఏ విధమైన పేచీలు లేవు. కాని ఓం ప్రకాశ్ స్వయంగా చూసుకునే వ్యవహారాలే ఈ మధ్య చిక్కుల్లో పడ్డాయి. అందులో ముఖ్యమైంది పేపరు మిల్లుకు వెదురు కలప సప్లయి చేయడం. ఈ వ్యవహారంలో యాభయి లారీలు నిర్విరామంగా తిరుగుతుంటాయి. ఆ యాభయి లారీలను చూడడానికి ఒక గ్యారేజీ అవసరమైంది. గ్యారేజీ తన లారీలకే అయితే సిబ్బందికి చేతినిండా పని ఉండదని జర్మనీ నుండి ఆధునిక యంత్రాలు దిగుమతి చేసుకుని అత్యంత ఆధునికమైన లారీ రిపేరింగ్ సెంటర్ నెలకొల్పాడు. దానితో పాటు పెట్రోలు బంకు వచ్చింది. ఎట్లాగూ అడవితో పని కనుక కర్రబొగ్గు తయారీ-కలప వ్యాపారం-వగైరా వగైరా చాలా వచ్చాయి. వెరసి ఈ తతంగ మంతటిలో కనీసం ఆరువందల మంది ఉద్యోగులొచ్చారు. వాళ్ళకు యూనియన్లు వచ్చాయి. గత ముప్పయి సంవత్సరాలుగా అసలు సిసలు సంస్థలను, ఆ సంస్థల యూనియన్లను మేనేజ్ చేస్తున్నాడు ఓం ప్రకాశ్ అగర్వాల్. ఓం ప్రకాశ్ సలహా సంప్రదింపుల మూలకంగానే అడవి ప్రాంతంలో అనేక పరిశ్రమలొచ్చాయనేది చాలా మందికి తెలియదు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసే మిష మీద వచ్చాయన్నాయి.

ఈ చరిత్రంతా ఒకదాని కొకటి అంకె వేసుకొని పెరిగింది. ఇప్పుడా ప్రాంతంలో సిమెంటు, బొగ్గు, కాగితం, బట్టలు, పైపులు, గూన కంపెనీలనేకం వచ్చాయి.... ఈ పరిశ్రమలన్నింటికి అగర్వాల్ అత్యంత ఆప్తుడు. అక్కడి నేల గురించి, దాని మట్టి గురించి, ముఖ్యంగా ఆ ప్రాంతంలో జనం గురించి అగర్వాల్ కు చాలా విషయాలు తెలుసు.

ఇన్ని వ్యవహారాలు, పరిశ్రమల చరిత్ర సంక్షిప్తమైంది కాదు, సరళమైంది కాదు. ఎక్కడో గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల సరిహద్దులు కలిపే చోటునుంచి ఓం ప్రకాశ్ అగర్వాల్ చిన్న ట్రంకు పెట్టెతో, పదివేల రూపాయలతో, ఇంకా సిగ్గు మొగ్గలు విడని భార్యతో మూడు రాత్రులు, మూడు పగళ్ళు ప్రయాణం చేసి వచ్చాడు. గుజరాత్ దాటుతూ ఉంటే భార్య ఏడ్చింది. భుసావల్ స్టేషన్లో రైలు పెట్టె దిగిపోయి తనింక దేశంకాని దేశం రానన్నది. అక్కడి నుంచి వార్ధా మీదుగా ఈ చిన్న పల్లెకు చేరుకునే సరికి ఓం ప్రకాశ్ కు మొత్తం అడవిలాగే తోచింది. ఈ ఊరు ఢిల్లీ, మద్రాసును కలిపే బ్రాడ్ గేజ్ రైల్వే లైను మీదుండడం ఓం ప్రకాశ్ కు నచ్చింది. కిరాణ వర్తకుడుగా, వడ్డీ వ్యాపారస్తుడుగా జీవితం ప్రారంభించిన ఓం ప్రకాశ్ దారి తెన్నులేని అడివి గూడాలను కలెతిరిగాడు.... అట్లా తన వూరి వాళ్ళు, బంధువులు రావడం ఒక ధారలాగా ప్రారంభమయ్యింది. బట్టల మిల్లు వచ్చింది.... ఆ మిల్లు కోసం పత్తి పంట వచ్చింది. ఆ తరువాత దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం రావడంతో అనేక పరిశ్రమలొచ్చాయి.

ఈ ప్రాంతంలో గిరిజనులు తిరగబడడం-జమీందారులకు, భూస్వాములకు, రైతులకు తగాదాలు జరగడం, ఒకరినొకరు చంపుకోవడాలు అనేకం అగర్వాల్ చూశాడు.... వాళ్ళట్లా తగువులాడటమే అగర్వాల్ కు లాభించింది.... ప్రభుత్వాలు జోక్యం చేసుకొన్న ప్రతిసారి వందలు వేలమంది కొంపగోడు పోగొట్టుకొని పారిశ్రామిక ప్రాంతాలకు వలస వచ్చేవారు. దానితో అతనికి పనివాళ్ళు అతి చౌకగా దొరికేవారు. పైగా ఈ ఘర్షణల్లో అగర్వాల్ అనుకున్న వాడికింద లెక్క.

సోఫాలో నుండి ఉలిక్కిపడి లేచాడు అగర్వాల్- కుదిమట్టంగా, పొట్టిగా, ఎర్రగా ఉంటాడు అగర్వాల్- మూడో అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్ అందంగా అలంకరించి నిర్మానుష్యంగా ఉన్నది- వీధుల్లో టపాసుల మోత అదేపనిగా విన్పి

స్తోంది. ఆతని ఒంటిమీద పట్టులాల్చీ, ఆతని వేళ్ళకున్న వజ్రాలు పొదిగిన ఉంగరం ధగధగ లాడుతున్నాయి.... కాన్ఫరెన్స్ హాల్లో ఒంటరిగా నిలబడి మెత్తగా ఉన్న కార్పెటు మీద పచారు చేశాడు. అతని నుదురు ముడుతలు పడి ఉన్నది. అట్లా పచారుచేస్తూనే మూడో అంతస్తు బాల్కనీ గుండా వీధిలోకి చూశాడు. జనం గుంపులు గుంపులుగా తిరుగుతున్నారు. మధ్యలో సర్కిల్ ఇన్స్పెక్టరు జీపులో- పోలీసులు జనాన్ని తరుముతున్నారు తమ దుకాణంముందు లెక్కకుమించి దీపాల వరుసలు దీపాలల్లో దాదాపు ఇరువైమంది దాకా స్టీల్ బకెట్లల్లో నుండి నూనెతీసి పోస్తున్నారు- చిన్నవాడు శ్యామ్ బస్తాలకు బస్తాలు టపాసులు కుమ్మరించి, ఆ కుప్పలకు నిప్పు పెడుతున్నాడు....

ప్రపంచంలో ఉన్న శబ్దాలు, వెలుగు, సంపద, సంతోషం తన ఇంటి ముంగిటే ఉన్నా ఓం ప్రకాశ్ నుదురు ముడుతలు పడటానికి కారణమేమిటి ? తన వెనుక మెత్తటి అడుగుల చప్పుడు.

ఓం ప్రకాశ్ వెనుతిరిగి చూశాడు. పెద్ద కొడుకు నుదుటికి పెద్ద కుంకుం బొట్టుతో నిలుచున్నాడు....

"పితాజీ.... పూజ ప్రారంభమయ్యింది" అన్నాడు.

"కానియ్యమను, నాకు అర్జంటు పనున్నది" ఓం ప్రకాశ్.

పెద్ద కొడుకు వెనుకకు తిరిగాడు.

"చూడు రతన్ - అందరికీ ఫోన్లు చేశావా?"

"చేశాను ...." అన్నాడు కొడుకు ....

కొడుకు వెళ్ళిపోయాడు.... "వీడిని ఇటుకేసి లాగాలి....కొత్త సిమెంటు కంపెనీ కన్‌స్ట్రిక్షన్‌లో పెట్టాలి" అనుకున్నాడు. ఎందుకో మళ్ళీ మనసు ఎక్కడో కలుక్కుమన్నది....ఆ 'కలుక్కుమన్న' విషయాన్ని మరిచిపోవడానికి మళ్ళీ కిందికి చూడ సాగాడు.

జనం పల్చబడుతున్నారు. హఠాత్తుగా ఓంప్రకాశ్ కళ్ళు నిలబడిపోయాయి. దీపాలకై నీడల్లో నలుగురైదుగురు మనుషులు దొంగల్లా తచ్చాడుతుండటం చూశాయి....ఓంప్రకాశ్ అన్నీ మరిచి దృష్టి కేంద్రీకరించి వాళ్ళనే చూస్తున్నాడు.

వాళ్లు....వాళ్లకై నీడకుండి ఆరిపోయిన దీపపు ప్రమిదల నుండి మిగిలిన నూనెను ఎడంచేతుల్లో గల గిలేటు టిఫిన్లల్లో ఒంపుకుంటున్నారు.

ఓంప్రకాశ్ దిమ్మెరపోయారు. ఎవరూ వాళ్ళను చూడడంలేదు....బియ్యపు మిల్లులో హామాలి రాములు ఆ వరుస దీపాలలో నూనె పోస్తున్నాడు. వాడు వాళ్ళను గమనించాడా? ఆ అయిదుగురు దూరంగా పోయి వెలుతురులో ఏమీ ఎరుగనట్లు నిలుచున్నారు. ఆ అయిదుగురిలో పడుచు స్త్రీ స్పష్టంగా కన్పిస్తోంది. వయస్సు దాదాపు 18 సంవత్సరాల కన్నా ఎక్కువుండదు. మాసిన వంకాయ రంగు చీర నడి కట్టేసి కట్టుకున్నది. ముఖం చూస్తే పచ్చి బాలింత లాగున్నది- ఆ బెదురు చూపులు ఎక్కడో చూసినట్లున్నది. ఎక్కడ ఎక్కడ? ఓంప్రకాశ్‌కు గుర్తుకు రావడంలేదు. ఖబ్బాల బనీనేసుకొని రాములు నూనె ప్రమిదల్లో నూనె పోసి వెనుదిరిగాడు. ఓంప్రకాశ్‌కు రాములును చూడగానే గుర్తొచ్చింది. సరిగ్గా పదిరోజులకింద రైసు మిల్లులో బియ్యం బస్తాల కిందపడి భీంగాడు చనిపోయాడు. వాడిది తిర్యాని దగ్గర ఏదో వూరు అని చెప్పి రాములుగాడే పనిలోకి తెచ్చాడు. భీంకు మొదట్లో 'గోండీ' తప్ప ఏదీరాదు. జంగ్లాతువాళ్ళు, పోలీసులు వాళ్ళ ఊరుమీద దాడిచేస్తే భయపడి ఇక్కడికొచ్చాడని చెప్పాడు రాములుగాడు.

అయితే చచ్చిన వాణ్ని పంచనామా చేయించి ఖననం చేయించాడు- దాన్ని వెంటబెట్టుకొచ్చి తన కాళ్ళమీద పడేశారు హమాలీలు. దాని అర్థం తనకు తెలుసు. భీంగానికి కాంపెన్ సేషన్ కావాలి ... ఆ గొడవ సర్దడానికి తన పీకల మీది కొచ్చింది. మొదట ఏడుస్తూ తన కాళ్ళ మీద పడ్డ ఆపోరి, తను ఒక బియ్యం బస్తా ఇస్తా ననగానే చివ్వున లేచింది. "నీ మిల్లులు సత్తెనాశిడం అయిపోతయి". అని పోయింది. ఆ ముఖం- ఓంప్రకాశ్ కింకా గుర్తున్నది.

మళ్ళీ నూనె దొంగలు కదిలారు. అందులో ఇద్దరు పోరగాండ్లు చీమిడి ముక్కులు- బాలింత ఆదర బాదరగా మట్టి ప్రమిదల్లోని వొత్తిని నొక్కి దీపాలు గిలేటు టిపిన్లో వొంపుకుంటోంది....

ఓంప్రకాశ్ తన యావదాస్తి దోచుకపోతున్నట్లుగా గింజుకున్నాడు.

అరె రాములుగాడు చూడనే చూశాడు....

"ఒరే రాములా! ఆ లం....ను తన్ను, మొత్తం నూనెగుంజుకో" ఓంప్రకాశ్ అనాలనుకున్నాడు, అరవాలనుకున్నాడు, గొంతు పెగలలేదు.

రాములుగాడు చడీచప్పుడు కాకుండా వచ్చాడు. అది బెదిరి కెవ్వున అరిచిందా? లేదు. తలవంచుకొని నిలుచున్నది, రాములుగాడు ఝాడిచ్చి దవడ మీద గుద్దడేం-

వాడు దొంగలం....కొడుకు కడుపు దేవినట్లుగా నిలుచున్నాడు. దొంగలాగా చూశాడు. బకెట్లోని నూనె దాని గిలేటు టిఫిన్ వొంచి చేతికిచ్చాడు మిగతా వాళ్ళు వాని దగ్గరకు పరుగెత్తుకొచ్చారు. రాములుగాడు గబగబా అందరి టిఫిన్లల్లో నూనె వొంపి ఏమీ ఎరుగట్లు - దీపాలు సరిచేస్తున్నాడు. నూనె దొంగలు జనంలో కలిసి పోయారు. సర్కిల్ ఇన్‌స్పెక్టరు పోలీసులు, నౌఖర్లు, శ్యామ్‌గాడు చూస్తూండగానే నూనె దొంగలు వెళ్ళిపోయారు.

లాభంలేదు. ఈ పోలీసులు, తన కొడుకులు తన వ్యాపారాన్ని నిలబెట్టలేరు.

ఓంప్రకాశ్ మొత్తం యావదాస్తి పేకాటలో పోగొట్టుకున్నవాడిలాగా డీలా పడిపోయాడు. అడుగుల కింద మెత్తటి కార్పెటు గుచ్చుకుంటున్నట్లుగా ఉన్నది.

దాదాపుగా గత రెండు రోజులుగా అతని మెదడులో సుళ్ళు తిరుగుతున్న సమస్యకు లింకు ఎక్కడో బోధపడింది.

రెండు రోజుల క్రితం ఊళ్ళు పెంచాలని అడవిలో వెదురు నింపిన తన అయిదు లారీలను కాలబెట్టిన వైనం గుర్తొచ్చింది. తన అయిదు లారీలు కాలి బూడిదైపోతుంటే డ్రైవర్లు, క్లీనర్లు ఏమి చేశారో అర్థమయ్యింది.

గత యాభై సంవత్సరాలుగా జంషెడ్‌పూర్ స్టీల్ కంపెనీలో సమ్మెలెందుకు జరుగలేదో? ఆ కీలకం నల్లమందు వర్తకం చేసిన రక్తం అనుభవంలోనిదనుకు న్నాడు. ప్లాసీ యుద్ధంలో పూల్ చందు ఇంగ్లీషు వాళ్ళకు ఎందుకు సపోర్టిచ్చాడో? భారతదేశంలోని పరిశ్రమల కీళ్ళు, పట్లు అన్నీ తెలిసిన ఓంప్రకాశ్‌కు చిరుచెమటలు పట్టాయి. ఈ జిల్లాలోనే ఓంప్రకాశ్ సలహా సంప్రదింపుల మీద అతని రక్త సంబంధీకులు అయిదు వందల కోట్ల పెట్టుబడులు పెట్టారు. అనేక ఘర్షణలు సునాయాసంగా పరిష్కరించుకున్నారు. ఓంప్రకాశ్ సలహా సంప్రదింపులతోనే ఆ పరిష్కారాలు జరిగాయి.

కాని....ఓంప్రకాశ్ తల తిరిగిపోతోంది. గుండెలో అయాసంగా తోచింది. శక్తి విహీనమైన చేతితో ఫోనెత్తి ఇంటర్‌కమ్‌లో పెద్దకొడుకును పిలిచాడు- నర్సింగ్ హోంలోని ఇద్దరు డాక్టర్లు అరుగురు కొడుకులు, కోడండ్లు, భార్యపైకి పరుగెత్తు కొచ్చారు.

డాక్టర్ బ్లడ్ ప్రెషర్ చూసి "ఫర్వాలేదు" అన్నాడు.

ఓంప్రకాశ్ కళ్ళు మూసుకున్నాడు. అతనికి ఆకుపచ్చ యూనిఫాంలేసుకున్న గిరిజనులు. వాళ్ళ చేతుల్లో తుపాకులు కనిపిస్తున్నాయి అ తుపాకులు తనకేసే గురి పెట్టబడి ఉన్నట్లుగా ఓంప్రకాశ్ గజగజలాడిపోయాడు.

ఓంప్రకాశ్‌కు దేశం నిండా అల్లుకున్న తనలాంటి బడా పెట్టుబడిదారుల అండ దండలున్నాయి. కావాలంటే అటన్నిని రక్షించడానికి ప్రభుత్వాలున్నాయి. దేశ విదేశాలతో లావాదేవీలున్నాయి....రాముడుకు భయపడ్డాడా? చనిపోయిన భీంభార్య బాలింత రాలుకు భయపడ్డాడా?.

ఓంప్రకాశ్ పదినిమిషాల తరువాత కళ్ళు విప్పాడు. తన ఎదురుగా ఆందోళనతో తనవాళ్ళు, బయటివాళ్ళు నిలుచున్నారు. వెనుకనుండి ఎ. యస్. పి ఒగర్చుకుంటూ మెట్లెక్కి వచ్చాడు. అతని వెనుకనే అదే వూరివాడైన పార్లమెంటు మెంబర్ వచ్చాడు.

వీధిలో పటాకాల చప్పుళ్ళు ఆగిపోయాయి.

ఓంప్రకాశ్ తాజా చిరునవ్వు ముఖం మీద పులుముకొని అందరికి సర్దిచెప్పి పంపేసరికి పదైంది.

తనొక్కడే సోఫాలో కూర్చుండి ఇందాకా తను చూసిన ఘటన జ్ఞాపకం తెచ్చుకున్నాడు. "అయితే మనుషులు ఒకరికొకరి దగ్గరౌతున్నారు. అది లెక్కలోకి తీసుకోవాలి.—" అనుకున్నాడు....

ఫోన్ ఎత్తబోతుండగానే సిమెంటు కంపెనీ ప్రసిడెంటు (జనరల్ మేనేజరు) గుప్తా వచ్చాడు....ఇంటిముందు కార్లు ఆగుతున్న ధ్వని....

"మిస్టర్ గుప్తా, చున్నీలాల్‌ను, కపాడియాను, రాజును కంటాక్టు చెయ్యి" అన్నాడు.

"దీపావళి కదా! కొంచెం లేటయ్యింది" అన్నాడు క్షమాపణలు చెప్పుకుంటున్నట్లుగా గుప్తా.

"ఇటీజ్ ఓకె - నౌ యుకెన్ ప్రొసీడ్-" ఓంప్రకాశ్.

గుప్తా ఫోనెత్తేలోగానే కపాడియా వచ్చాడు.

కపాడియా కాగితపు మిల్లు మేనేజర్.

కపాడియాను తన దగ్గరికి రమ్మన్నట్లు కళ్ళతోనే సైగచేశాడు ఓంప్రకాశ్.

గుప్తా ఫోనులో మాట్లాడుతుండగా....

"మొత్తం ఎంత నష్టం?" అడిగాడు.

"యాభయి లక్షలుండాలి" కపాడియా.

"ప్రెస్ మూడుకోట్లు రిపోర్టు చేసిందే?"

కపాడియా నవ్వాడు....ఆ నవ్వులోనే కపాడియా తన తెలివి ప్రదర్శించు కున్నాడు.

ఓంప్రకాశ్ చిరాకుగా చూశాడు....కపాడియా తెలివితేటలు ఓంప్రకాశ్‌కు తెలియనివి కాదు. ఆ ప్రదర్శన సహించరానిది.

"నా ఉద్దేశ్యంలో ఏదో వొక విధంగా సెటిల్ చేసుకుంటే" కపాడియా మాట పూర్తి కాకముందే ఏదో ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్న ఓంప్రకాశ్ కళ్ళు తెరిచి.... "యూబాస్టర్డ్" అన్న చూపు చూశాడు.

ఆ వెనుకే సోఫాలోనుంచి లేస్తూ....ఏదో గొణిగాడు....

ఆ ప్రాంతంలోని పరిశ్రమాధిపతులంతా వచ్చి కూర్చుంటున్నారు. షేక్ హాండులు, చిరునవ్వులు.

ఓంప్రకాశ్ మూడో అంతస్తు బాల్కనీలో నిలుచున్నాడు. నగరం పొగ గొట్టాలతో పొగ చూరినట్లుగా ఉన్నది- వీధిలో జన సంచారం బొత్తిగా పల్చబడ్డది.

"వాళ్ళ దొంగతనంగానైనా నూనె సంపాదించి దీపాలు వెలిగించుకుంటు న్నారు....వాళ్ళు ఒకరి నుండి ఒకరు ఏ రూపంలోనైనా నూనె అందించుకుంటుం టారు....ఇక్కడ వ్యవహారం "సెటిలైతే" ఏడుకోట్ల నుండి గిరిజనులు డిమాండు చేస్తారు....డబ్బు, తిండిగింజలు అవే అనుకుంటున్నాడు కపాడియా? కాని వాళ్ళ డిమాండు చేస్తున్నది అది కాదు ఆయుధాలు....అవి ఎక్కు పెట్టేదెవడి మీదికి"?

ఓంప్రకాశ్ నిశబ్దంగా, నిశ్చలంగా నిలుచున్నాడు....ఒంటరిగా....

అతని సహచరులు ఇంగ్లీషులో కేరింతలు కొడుతున్నారు.... "పెట్టుబడి పుట్టినది ఆదిగా అది అనేక యుద్ధాలు చేసింది. అనేక మార్లు అది తన రూపాన్ని మార్చుకున్నది. బహుశా ఈసారి జరుగబోయే యుద్ధం అత్యంత సంక్లిష్టమైంది. తీవ్రమైందికూడా" మనసులో అనుకుంటూ ఓంప్రకాశ్ దీర్ఘంగా నిట్టూర్చి తన సహచరుల మధ్యకు నడిచాడు.

సేద్యం

శ్రీనివాసమూర్తి

పొద్దున్నే కుళాయి దగ్గర బిందెల చప్పుడుతో మెళకువొచ్చింది. ఆదివారం కాబట్టి రెండు పుస్తకాలు ముందేసుకుంటే ఈ రోజంతా వాటిల్లో మునిగితేలొచ్చు అనుకొని ముందు టీ తాగొద్దామని బైటికొచ్చినాను. రోడ్డు దిగి శ్మశానం పక్కనే వున్న హోటల్లో దూరినాను.

టీ తాగి బైటికొస్తుంటే సుబ్బయ్య కనిపిచ్చినాడు. యింత పొద్దున్నే సన్నెతుక్కుంటూ సుబ్బయ్య ఎందుకొచ్చినాడో? దగ్గరికి రాగానే "ఏం సుబ్బయ్యా బాగున్నావా? రాములు బాగున్నాడా?" అని అడిగినా.

సుబ్బయ్య "ఊ" అన్నాడు.

యింటర్మీడియట్లో సుబ్బయ్య కొడుకు రాములు నాకు క్లాస్‌మేటు. చదువుకునే టప్పుడు నేనూ, రాములూ కలిసి స్టూడెంట్స్ యూనియన్లో పనిచేసినాము. యింటర్ రెండో సంవత్సరంలో రాములు పార్టీలోకి పోయినాడు. నాకు మాత్రం ఆ ధైర్యం లేకపోయింది. యం.ఎస్సీ చేసి ప్రైవేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నాను.

నా ప్రశ్నకు సమాధానంగా సుబ్బయ్య ఏమీ మాట్లాడలేదు. నా ఎంటే వొచ్చినాడు. రూముకు పోయినాక సుబ్బయ్య మంచంమీద కూర్చొని, మాట్లాడటం మొదలుపెట్టాడు. "నాల్నెల్ల ముందు మా వోడు జైలునుంచి ఇంటికొచ్చినాడు గదా? వాన్ని బైటికి తానీక బెయిల్లకోసం ఎంత తిప్పలు పడినాసామీ! నీకు తెలవందిగాదు, ఇంటికొచ్చి నెల్రోజులు బాగున్నాడు. మళ్ళీ యిప్పుడు వూర్లో వొయసు పిలగాళ్ళం దర్నీ ఎంటేసుక్కోని తిరుగుతా వున్నాడు. బిడికి బోదగడ్డి కప్పిస్తానని మొన్న డబ్బులు జమచేసినాడు. రేత్రి సత్రంకాడ మాలోల్లకి సదువులు జెప్తావున్నాడు. ఇవన్నీ ఈనికెందుకొచ్చిన పన్లు, వూల్లో అందురు ఈనిమాదిరే జేస్తావున్నారా?" సుబ్బయ్య మాటలను సగంలోనే ఆపేసినాడు. మధ్యలో నా వైపుచూసి "ఇంతెందుకు నువ్వుగూడా మావోనితోపాటి పార్టీలో తిరిగినోడివేగద, నువ్వు సదువుకోలా? ఏదో నాలుగురాళ్ళు సంపాయిస్తా వుండావు". సుబ్బయ్య మాటలకు నాకు కలుక్కుమని డిగబడింది. ఏం మాట్లాడాలనో తోచలేదు.

మొన్నేమో ఎంగటాద్రినాయుడు యింటికాడికి ఇనిస్పెక్టరొచ్చినాడు. దార్లో

కనిపిచ్చి ఏంరా! సుబ్బయ్యా, మీవోడు మళ్ళీ తిరగతా వున్నాడంటనే అన్నాడు, నాకైతే కాళ్ళు సల్లగయిపోయినాయి, లేదు సామీ, సర్కారు బడికి బోదకప్పిచ్చనీక తిరగతా వున్నాడంతే, అన్నాను. నా మాటలు ఇనిపిచ్చుకుంటేనా,

"అవద్దాలు చెప్పొద్దు పెద్దాయనా! డబ్బులొసూలుచేసి ఇస్కూలు సక్కదిద్దాలని మీ వోనికే ఏంటికి బట్టింది. లెక్కలు వొసూలు జేసోక్కని డబ్బులన్నా మిగిలిచ్చు కోవాల, లేకుంటే మళ్ళీ పార్టీ కోసమన్నా పనిజెయ్యాల. అయినా లెక్కలు ఎగేసేంత మంచోడుగాదు మీవోడు. కొబట్టి కొంచెం జాగ్రత్తగ చూసోక్క, ఈ సారి పైనుంచి అర్డరొస్తే మేం చేసేది ఏంలేదు". అన్నాడు పక్కనున్న హెడ్ కానిస్టేబులు.

"నాకైతే జీవం బొయినట్లనిపించి సామీ"—

"వొక్కటే నలుసు, వాన్ని సదివిద్దామని కాలేజీల జేరిపిస్తి, సదువా సట్టు బండలయ్యింది, పార్టీ, పార్టీ అనిజెప్పి దానికోసం, ముసిలోల్లనిగూడ జూడకుండ మమ్ములనిడిసిపోయినాడు. జైల్లోబడితే ఏమైంది, మంచికాళ్ళు బట్టుకోని నేనే యిడి పిచ్చుకొస్తి, మళ్ళీ యింటికి దెచ్చుకుంటి. ఇంతకొడుంటే నాల్గెకరాలూ దున్నుకోని యింత తినొచ్చునని జెప్తే ఈడు యినడు. ముసలితనంల, సచ్చేదనక నేనే కష్టం జెయ్యాల్నా. వాడొచ్చినకాణ్ణుంచి, సేనికాడ వాడే వుంటున్నాడు. నాల్నెల్లనుంచి పానానికి సుకంగుంది పిల్లనుదెచ్చి పెత్తాల అమాశలోపు మూర్తంగూడ పెడ్దామను కుంటున్నా. యిప్పుడు మళ్ళీ యివన్నీ బెట్నాడు. ఈసారి గనక వాణ్ణి పట్కపోతే నేం సచ్చిపోతా సామీ?" సుబ్బయ్య గొంతు పీలగా అయ్యింది. మీదిపంచెతో కండ్లు తుడుచుకున్నాడు.

అయన్ను ఎలా వోదార్చాలో అర్థంకాలేదు. ఈ విషయంలో సలహా యివ్వ గలిగిన అర్హత నాకు లేదు. అందుకనే మాట్లాడకుండా కూర్చున్నాను.

కొద్దిసేపటికి సుబ్బయ్య తేరుకున్నాడు. "ఆ వూర్లవుంటే వాడు యిట్నే తిర గతా వుంటాడు. అందుకని యాడికి తోలుకోనొచ్చి మన మల్లారెడ్డి సారుకాడ యిడుస్తా మనుకుంటావున్నా. యాడుంటేనన్నా మెదలకుండా వుంటాడు. రెండు సంవత్సరా లుంటే నాల్గెకరాలూ అమ్ముకోని నేనూ, ముసిల్ది యిద్దరం యాడికే వస్తాం. వైద్యం

జేసి మేం మాత్రం ఏం బావుకున్నాం. రైతు బతికే కాలంగాదు-కలికాలం కనాకష్టమై యిఖ్యంది".

ఈ చివరి మాటలతో సుబ్బయ్య వచ్చిన పనేమో నాకర్థమైయ్యింది. "వుద్యోగాలు ఎక్కడ దొరుకుతాయి సుబ్బయ్యా, రాములుకు యిచ్చినా మూడు, నాలుగు వందలిస్తారు. దాంతో ఎట్లా బతుకుతాడు" సర్దిచెప్పాలని ప్రయత్నించాను.

"అదిగాదు సామీ! మల్లారెడ్డిగారు మీకు తెలిసినాయనేకదా? మా సుట్టుపక్కల వూళ్ళల్లో రోడ్డుపన్లు, మిద్దెలు కాంటాక్టు జేస్తావుండాడు. మొదట్నుంచి మీరూ, మీరు కల్సి తిరిగినోళ్ళేకదా? నువ్వు అడిగితే కాదనడు. ఆ సామికాడ యిడిస్తే మేస్త్రి పనైనా యిస్తాడు-ఏదో పిలగాడు బతుక్కుంటాడు". వొచ్చే ఆదివారం మా వోణ్ణి తోలుకొస్తా, మల్లారెడ్డిగారు కాడికి తీస్కబోయ్యి నువ్వే జేప్పాల-" అంటూ నాకు మాట్లాడటానికి అవకాశం యివ్వకుండానే మెట్లు దిగిపోయినాడు.

× × × ×

సుబ్బయ్య రావడంతో పొద్దున నేను అనుకున్న పన్లన్నీ ఎనకముందులైనాయి. రాములు గురించీ, మల్లారెడ్డి గురించే ఆలోచనలు అన్నీ.

నేనూ, రాములూ ఇంటర్ చదివేటప్పుడు మల్లారెడ్డి మాకు సీనియర్. మాకు పుస్తకాల దగ్గర్నుంచి, రాజకీయాల వరకు పరిచయం చేసింది మల్లారెడ్డే. డిగ్రీ అయ్యేంతవరకు మల్లారెడ్డి చాలా చురుగ్గా వుండేవాడు. కాలేజీలో ఏ ఫంక్షన్ జరిగినా మల్లారెడ్డి ఉపన్యాసంకోసం స్టూడెంట్స్ అందరూ ఎదురుచూసేవాళ్లు. గౌరవంగా 'సార్' అని పిలిచేవాళ్ళు. డిగ్రీ పూర్తయ్యేలోపు మల్లారెడ్డిమీద పోలీసులు రెండు కేసులు పెట్టారు. మొదటిసారి వాళ్ళ నాయన పట్టిచ్చుకోలేదు. ఆ తరువాత ఎం.ఎల్.ఏ.ను పట్టుకోని ఒక కేసునుంచి తప్పిచ్చినాడు. రెండో కేసునుకూడా ఈ మధ్యనే కొట్టేసినారంట. ఈ మధ్య మల్లారెడ్డికీ నాకూ ఒకసారి కొట్లాట జరిగింది. అదెట్లయ్యిందంటే.

నేను మహాసభలకోసం చందాలు వసూలుచేస్తూ మల్లారెడ్డి దగ్గరికి పోయినాను. ఇంటి బైటవున్న పెద్దాయన ఎందుకొచ్చినానో తనుక్కోని కూర్చోమన్నాడు.

కొంసేపు కూర్చున్నాక లోపలికి రమ్మని పిలిచినాడు.

లోపల మల్లారెడ్డితోపాటు ముగ్గురు వున్నారు. అందులో వొకరు ఎం. ఎల్. ఏ.

తమ్ముడు, సారా కాంట్రాక్టరు కూడా. లోపలికి పోంగానే కరపత్రం తీసి మల్లారెడ్డి కిచ్చి, చందాపుస్తకం బైటికి తీసినా.

"ఏం మల్లారెడ్డి, ఇంగా నీ కొడికి చందాల కొస్తున్నారా ?" ఎం. ఎల్. ఎ. తమ్ముడన్నాడు.

"అ! ఏదో పాత పరిచయాలు కదా" అంటూ చందా పుస్తకం తీస్కోని యాభై రూపాయలు రాసినాడు మల్లారెడ్డి.

ఆ యింతసేపూ నేను యిల్లంతా జూసినాను. ఇంట్లో మూడు నాలుగు సోఫాలు ఏసి పెట్నాడు. కింద తివాచీ పరిచివుంది. గొడలకేమో బ్రాందీ షాపుల కాలెండర్లు వేలాడుతున్నాయి. వాటిని చూడగానే మల్లారెడ్డిలో వచ్చిన మార్పు అర్థమైంది. ఒకసారి కాలేజీలో అందాల పోటీలను విమర్శిస్తూ, మల్లారెడ్డి ఇచ్చిన ఉపన్యాసంకూడా గుర్తుకొచ్చింది. ఇవన్నీ ఆలోచిస్తున్న నాకు మల్లారెడ్డి మాటలు అడ్డం వొచ్చాయి.

"అవునూ ? ఏమిటీ మధ్య కిడ్నాపులు ఎక్కువగా చేస్తున్నారే, యిలాంటి టెర్రరిస్టు చర్యలన్నీ నచ్చటం లేదు. పార్టీలో ఎవరిష్టమొచ్చింది వాళ్ళు చేస్తున్నట్టున్నారు" అన్నాడు. ఈ అనవసర మాటలతో నాకు కోపమొచ్చింది.

"గ్రామాల్లో యువకుల్నందర్నీ పోలీసులు కిడ్నాపుచేసి చంపేస్తున్నప్పుడు మీరేం మాట్లాడలేదే" గట్టిగా అన్నాను.

"వాటి గురించి గొడవ చేయటానికి పౌరహక్కుల సంఘాలు వున్నాయి కదా ?" చాలా తేలిగ్గా తీసిపారేశాడు.

"అవునుమరి, మీకది గొడవలాగానే కనిపిస్తుంది. వందలాదిమంది యువకులను శవాలుచేసి, తల్లిదండ్రులకు కూడా తెలియకుండా దహనం చేస్తున్నప్పుడు నీలాంటి ప్రజాస్వామిక వాదులు ఏమీ మాట్లాడరు. గవర్నమెంటుకు ఏదైనా యిబ్బంది కలిగితే మాత్రం పూసుకోనొస్తారు".

"అయినా నాకెందుకొచ్చిన గొడవలే, బైట క్లర్కుదగ్గర యాభై తీసుకో" అన్నాడు.

యింతలోనే "యిగో ఒక విషయం" అంటూ నాతోపాటూ బైటికొచ్చినాడు.

“మన రెడ్డి సారాలీజు వున్న ప్రాంతంలో మనోళ్ళు రేటు తగ్గించాలని డిమాండు పెట్నారంటె. మన ఏరియాలో ఇంకా అది అమలు చేసేంత బలం లేదు కదా ? కాబట్టి ఆ పనొద్దు. పార్టీకి నేను ఇరవై వేలు చందాయిప్పిస్తా. రెండేండ్లు వాయిదా ఎయ్యమని మనోళ్ళతో చెప్పు. అయినా పార్టీతో మాలాంటి వాళ్ళకు శతృత్వం ఏముంటుంది. ఒకప్పుడు సింపతైజర్స్ కూడా” మల్లారెడ్డి క్షణంలో రంగు మార్చి నవ్వుతూ మాట్లాడుతున్నాడు. అసలు స్వరూపం తెలిసింది. అసహ్యం కలిగింది. ఆయన రాసిన యాభై రూపాయలు రసీదు చించి అక్కణ్ణేపడేసి, బైటి కొచ్చినా. ఆ తరువాత మల్లారెడ్డిని ఎక్కడా కలవలేదు.

అట్లాంటి మల్లారెడ్డి దగ్గర రాములు ఉద్యోగంకోసం ఎట్లా పొయ్యేది ?! ఒకవేళ మల్లారెడ్డి దగ్గర వుద్యోగం వొచ్చినా, చేయటం రాములుకు చాతకాదు. తిరకాసొచ్చిందంటే కొట్నాకొస్తాడు. అందుకని ఆ పని వాయిదా వెయ్యటమే మేలు అనుకొని, సుబ్బయ్య వొస్తానన్నరోజు రూములో వుండకుండా సినిమాకు బోయినా, నా కోసం సుబ్బయ్య వొచ్చి వెనక్కి పొయ్యుంటాడేమో ?

దీపావళి సెలవులు కాబట్టి వూరికి పోదామని, స్కూలు కాంగానే బస్టాండు కొచ్చినాను. ఆరయినా, మా వూరిబస్సు రాలేదు. బస్టాండులో అటూ ఇటూ తిరుగుతూ వున్నాను. ఒకచోట చిన్న యూరియాసంచి చేత్తోపట్కొని సుబ్బయ్య వొస్తున్నాడు. సుబ్బయ్యకు కనిపించకుండా మొగం చాటెయ్యటం మేలని ఎదురుగా వున్న పుస్తకాల అంగడిముందు నిలబడుకున్నా. సుబ్బయ్య నన్ను చూసుంటాడేమో? చూసీ పలకరించకుంటే ఏమనుకుంటాడో, పలకరిస్తే మళ్ళీ మల్లారెడ్డి దగ్గరకు పోదామంటాడేమో ? లక్ష అనుమానాలతో, ఇష్టం లేకపోయినా దిక్కుమాలిన సినిమా పత్రికలన్నీ చూస్తూ నిలబడినాను.

“ఏం సామీ, వూరికి పోతావుండావా ?” సుబ్బయ్య భుజంమీద చెయ్యేసి పలకరించినాడు సుబ్బయ్య అంత దగ్గరగా నన్నెప్పుడూ పలకరించలేదు.

“అవును సుబ్బయ్యా. రెండ్రోజులు సెలవులు. గంటసేపయ్యింది వొచ్చి, వొక్క బస్సూ రాలేదు, చీకటి పట్తా వుంది. ఆ రోజు ఆదివారం వొస్తానంటివి రాలేదే” తేలికగానే అబద్ధం ఆడేసినా.

“వొద్దులేసామీ, మా వోడికి వుద్యోగం వొద్దు, ఇంటికాణ్ణే వుంటాడు” నిబ్బరంగా మాట్లాడినాడు.

చేతిలో సంచీజూసి "ఎక్కడ్నుంచి వస్తావున్నావు" అని అడిగినాను.

"పిలగాణ్ణి జూడను పట్నం బొయ్యొంటిసామీ"

"ఏం రాములు వూర్లో లేడా"

"లేడు" అని ఇష్టం లేనట్టుగా జవాబు చెప్పినాడు సుబ్బయ్య.

"సరే, రూముకు పోదాంరా, రాత్రికి యిప్పుడు నీకు మాత్రం బస్సు యాడ దొరుకుతుంది. పొద్దుణ్నే పోదువుగాని", అని సుబ్బయ్యను వెంటబెట్టుకొని రూముకు బయలుదేరాను.

ఇద్దరం దార్లోనే తిండి తిన్నాం. దారెంట సుబ్బయ్య ఏమీ మాట్లాడలేదు తిండి తినేటప్పుడు కూడా ఏమీ మాట్లాడాలా. మొన్నొచ్చినప్పటి మాదిరి లేదు. మనిషి కొంచెం నిబ్బరంగున్నాడు. రాములుకు పట్నంల వుద్యోగం వొచ్చిందేమో అనుకున్నా.

× × ×

"మల్లారెడ్డి సారు మొన్న యాలం పాటల్లో మా సుట్టుపక్కల వూళ్ళ కౌంటాక్టు తీసుకున్నాడు సామీ?" మెట్లు ఎక్కుతూ సుబ్బయ్య అన్నాడు.

నాకు ఈ విషయం యింతవరకూ తెలియదు. ఆ రోజు మల్లారెడ్డి రేటు తగ్గించే విషయం యిందుకోసమే మాట్లాడాడని అర్థమైంది.

ఎలాగూ మల్లారెడ్డి విషయం మాటల్లోకి వచ్చింది గదా, విషయం మొత్తం సుబ్బయ్యకు చెప్దామనుకున్నా. కానీ ఆయన, సంపాదన ఆస్తి చూసి వోర్వలేక ఇట్లా ప్రచారం చేస్తున్నాననుకుంటే బాగుండదు. అందుకని 'ఊ' అని ఊరుకున్నా.

రూము తాళం తీసి, సుబ్బయ్యకు వొక చాపా, దుప్పటీ యిచ్చి నేనొకటి తీసోక్కొని రూముబైట పంచలో కొచ్చినాం. సుబ్బయ్య మళ్ళీ ఏం మాట్లాడలేదు, నేను చాప ఏస్కొని, లైటు ఆర్పేసి బైటకొచ్చినా.

సుబ్బయ్య నా పైపు తిరిగి కూర్చున్నాడు. చిమ్మచీకట్లో సుబ్బయ్య మొహం కనిపించటం లేదు. బైటనుంచి పడుతున్న వెలుగుకు కళ్ళు మాత్రం కనిపిస్తున్నాయి. చూపులన్నీ నా పైపే వున్నట్టు అనిపించింది. ఏదో చెప్పటానికి ప్రయత్నిస్తునట్టుంది.

"పిలగాణ్ణి పోలీసులు పట్కబొయినారు" మెల్లగా గొణుగుతున్నట్టు అన్నాడు. సుబ్బయ్య ఈ విషయాన్ని యింత సేపటికి చెప్పటం ఆశ్చర్యాన్ని కలిగించింది.

"ఏంది సుబ్బయ్యా నువ్వు చెప్పింది, వూర్లో ఏమైనా కొట్లాటలైనాయా ?

"అవున్సామీ ? పోయిన పున్నం పక్క రోజు తీస్కబోయినారు. పట్నం జైల్లో బెట్నారు. తుక్కు తుక్కుగా కొట్నారు లంజకొడుకులు. పిలగాడు ఎట్ల తట్కున్నడో ఏమో ? యిాళ్ళింట్లో పీనిగెళ్ళా !"

"ఇంతకూ ఏమైందీ వూర్లో"

"మనూర్లో సీలిసికారోళ్ళు మొదట్నుంచి సారాయివోళ్ళే కాచుకుంటారు గదా, నువ్వు సూసినోడివే - మొన్న కొత్త కాంటాక్టులు యిచ్చినంక, సికారోళ్ళు గూడ సారాయి కాచుకోరాదనీ, అందరూ అంగట్లోనే కొనుక్కోవాల్ననీ దండోర ఏసిచ్చినారు. యింతకు ముందుమాదిరే లెమ్మని, సికారోళ్ళు యినిపిచ్చుకోలా. పున్నంరోజు, మునాషకి ఏమైందంటే............

× × ×

నాలుగు సారాయి జీపులు వూర్లోకొచ్చి ఆగినాయి. ముందు జీపులో ఒక ఎక్సైజు యినిస్పెక్టరు, ఇద్దరు కానిస్టేబుల్లు వున్నారు. మిగతా మూడు జీపుల్లో సారా కాంట్రాక్టరు మనుషులు వున్నారు. అందరి చేతుల్లో కర్రలు వున్నాయి. ఒకరి చేతిలో మాత్రం తుపాకీ వుంది. జీపులు ఆగుతూనే సారాయి కాంట్రాక్టరు మనుషులు గబ, గబా దిగినారు. సారాయి పోలీసులు జీపు దగ్గరనే వున్నారు.

కాంట్రాక్టరు మనుషుల్ని చూడగానే ముందుకొట్టం దగ్గరున్న ఆడామె లబలబ, గట్టిగా అరిచింది. అంతే, ఇండ్లల్లోంచి ఆడోళ్ళందరూ బైటికొచ్చినారు. అందరూ నోటిని చేత్తో కొట్టుకుంటూ ఒకటే అరుపులు, ఒక్క నిముషంలో వాతావరణమంతా బీభత్సంగా తయారైంది. ఆడవాళ్ళ అరుపులు వింటూనే ఇండ్లల్లో మొగోళ్ళందరూ వీధిలోనుంచి కాలువ గట్టు పైపుకు పరుగులు తీశారు. వాళ్ళవెంట కాంట్రాక్టరు మనుషులు. దొరికినోణ్ణి, దొరికినట్టు కుల్లబొడుస్తావున్నారు. కొంతమంది యిండ్లల్లోకి దూరారు. లోపలున్న ప్రతివస్తువునూ బైటికి ఇసిరేస్తున్నారు. కుండలన్నింటినీ పగలగొట్టారు. ఆఖరుకు అన్నం మూకుట్లు కూడా వదిలిపెట్టలేదు. చిన్నా పెద్దా అని గూడ చూడకుండా కనిపిచ్చినోణ్ణి, కనిపిచ్చినట్టు సావగొట్టి జీపుల్లో ఏస్తావున్నారు. పోలీసులు మాత్రం నిమ్మళంగా జీపుదగ్గర బీడీలు కాల్చుకుంటూ వున్నారు. జీపులో యినిస్పెక్టరు కూర్చున్నాడు. యింతలో కాంట్రాక్టరు మనుషులకు ముసిలి

అడ్డపడింది. "నాకొడుకును యిడిసి పెట్టండ్రో, కుండలన్నీ పగలగొట్నారు గదరో, మీ కండ్లు సల్లగై నాయిగదరో, నా కొడుకును యిడిసి పెట్టండ్రో", అని ఏడుస్తూ వుంది. తుపాకీ వున్న మనిషి ఆమెను ఈడ్చి పక్కకు పారేశాడు. అయినా ముసిల్ది ఏడుపు ఆపలేదు - "మీకు దూము తగల, మీ పెండ్లాల పుస్తెలు తెగిపోనూ, నా కొడుకును సంపేసినారుగదరో", ఏడుస్తూనే వుంది.

సుమారు 60 మందిని తీసుకోని జీపులు పట్నంవైపు పోయినాయి.

రాత్రి తొమ్మిదిగంటలపుడు, తిండితిని కొట్టంబైట నులకమంచంలో కూర్చున్నాడు సుబ్బయ్య. బీడీ ముట్టిచ్చుకోడానికి అగ్గిపెట్టెతీసి పుల్లగీసినాడు. కొట్టం ముందు గూనోడు కనిపిచ్చినాడు.

"ఏరా ! గూనోడా బువ్వతిన్నావా ?" అన్నాడు సుబ్బయ్య.

"తిన్నామామా ? రాములుగాడు సేనికాన్నుంచి వొచ్చినాడా" గూనోడు గునిసినాడు. "పిలగాడు తింటావున్నాడు. ఏందిరా ! మళ్ళీ ఏమైనా యవ్వారమా ?"

"అవును మామా ? పొద్దున్న సికారోల్లను పట్కబోయినారు గదా ! మాట్లాడదామని" - అంటూ సగంలో ఆపి సుబ్బయ్య మొగంలోకి జూసినాడు గూనోడు.

"నియ్యవ్వ, మీకేం పంగులేందిరా! పొద్దుగూకులా వూల్లో ఏదొచ్చినా ఈడికి వురుక్కోనొస్తారు" విసుక్కున్నాడు సుబ్బయ్య.

ఇంతలో రాములు చెయ్యితుడుచుకుంటూ బైటకొచ్చినాడు. సుబ్బయ్య మాటలు పట్టిచ్చుకోకుండా "రారా ! గూనోడా" అంటూ ముందుకుబొయినాడు.

రాములా, గూనోడు సత్రంకాడికి బొయ్యేటప్పటికి, సికారి ఆడోల్లు, మాలోల్లు జమయినారు. రాములుకు సంగతంతా జెప్పినారు. పొద్దున్నే అందర్నీ తీస్కోని మండలాఫీసుకాడికి వూరేగింపు తియ్యాలని రాములు చెప్పినాడు.

ఈ సంగతి తెలిసి ఎంగటాద్రినాయుడు రాత్రికిరాత్రి కంట్రాక్టరు ఇంటికి మనిషిని పంపిచ్చినాడు. అంతే మునిమాపున్నే, పోలీసోళ్ళు వూరిమీదబడి రాములును, గూనోణ్ణీ, సిన్నెంగటి కొడుకు మల్లన్ననీ, ఎంగటాద్రినాయుడు గాసగాడు మున్రామున్ణీ పట్కబొయినారు.

× × ×

సుబ్బయ్య చెప్పిన ఈ కథ వినేసరికి నాకు నిరాశముంచుకొచ్చింది.

"పొద్దున్నే లేచి ఎంగటాద్రినాయుడు యింటికాడికి బొయ్యి నా కొడుకును యిడిపియ్యమని కాల్లు బట్టుకున్నా. రెండొందలు తీసోని, కాంట్రాక్టరు కాడికి పట్కబోయినారు. అప్పుడు చూసిన సామీ! మళ్ళీ మల్లారెడ్డి సారును "పిల్లగాన్ని యిడిపియ్యమనీ, యింగ సక్కంగ వుండకపోతే వూరిడిసి పోతామనీ వొట్టు బెట్టు కున్నా. "మల్లారెడ్డిసారు" సరే పోలీసోల్లతో మాట్లాడతా పొమ్మన్నాడు : పొద్దున్న పిల్లగాన్ని చూస్తే తెలిసింది మల్లారెడ్డి సారు ఏం జేసినాడో, జైలుకు తోలిచ్చేటట్టు సూడమని పోలీసోల్లకు జెప్పినాడంట. రెండు తుపాకుల్తో దొరికినట్టు కేసు బెట్నారు. ఏందైతదో ఏమో ?"

ఏదో వొక ఊరడింపు మాటలు చెప్పటం నాకు చేతకాలేదు.

"మల్లారెడ్డి విషయం నీకు ముందే చెప్పాలనుకున్నా సుబ్బయ్యా ! మల్లారెడ్డి లాండివాళ్ళు వూరికి వొక్కడున్నా చాలు. ఇట్లాటోళ్ళుంటే, రాములులాంటివాళ్ళు ఎన్ని సంవత్సరాలు కష్టపడినా ఏమైతుంది". నాకు ఎక్కడలేని దిగులు ముంచు కొచ్చింది. నాకు మాటలు రాలేదు. నా బాధ సుబ్బయ్యకు అర్థమైందో లేదో !

కిందనున్న దుప్పటితీసి సుబ్బయ్య తలకింద పెట్టుకోని పండుకున్నాడు. పైన చుక్కల్లోకి చూస్తూ మాట్లాడినాడు.

"నేను మొదట్లో మానాయనతోపాటు సేద్యం మొదులుబెట్నా. ఒక సంవత్స రం వానలే లేవు. ఏసిన యిత్తనాలు పోను, సద్దలు మాత్రం మిగిల్నాయి. రెండో ఏడు కనాకష్టం యిత్తనం కర్సుగూడారాలా ! మూడోఏడు మళ్ళీ యిత్తినా. పంట జూసి పండగ జేసుకున్నాం. తీరా కోతలొచ్చేటయానికి తుపానొచ్చింది. తిండిగింజ లకు గూడ లేకపోతే ఎంగటాద్రినాయుడుకాడ నాగులు తెచ్చుకున్నాం. సేద్యం మానుకున్నానా ? ఏస్తానేవున్నా - వొంట్లో సత్తువుండేంతవరకు ఏస్తానేవుంటా. మావోడు జైల్నుంచి బైటికొచ్చినాక మళ్ళీ పార్టీలోకిబొయినా బయంలేదు. సేద్య గాని కేందిసామీ. చేతుల్లో సెత్తువున్నంతవరకు కష్టపడతాను. నాకింతకంటే కష్టాలు యింగేమొస్తాయి. పిలగాడేం నీతిమాలిన పన్లుజెయ్యలా. నేను సేద్యం జేసినట్టు, వోడూ చేస్తానే వుండాడు. నా సేద్యం నా కష్టాల్ని పోగొట్టలేకపోయినా, వాని సేద్యం మాత్రం పోగొడ్తాది". సుబ్బయ్య మాటల్లో యాభైయేళ్ళ సేద్యం చేసిన రైతు పదును కనిపించింది.

వ్యాసం :

అనుభూతి వాదం

కె.వి.ఆర్.

ఏది సత్యం ? బాహిరంగా వున్న ప్రకృతా, లేక దాని నుంచి కలిగే అనుభూతా ? లేక, ప్రకృతీ, అనుభూతీ రెండూనా ? అయితే ఈ రెండింటిలో ఏది ఆధారం, ఏది ఆదేయం ? ఏది ముఖ్యం, ఏది కాదు ? తత్వ శాస్త్రానికి చెందిన మౌలికమైన ప్రశ్నలేగాని, ఇవేవీ యక్షప్రశ్నలు కావు. భౌతికవాదమూ, భావవాదమూ కుస్తీ పట్టేది ఈ ప్రశ్నల గోదాలోనే.

మనమంతా గుర్తించక తప్పని భౌతిక వాస్తవం ప్రకృతి. మనం గుర్తిస్తేనే అది ఉన్నదనుకోవడం కేవలం భ్రమ. మన గుర్తింపుతో నిమిత్తం లేకుండానే స్వతంత్రంగా అది ఉంది. అయితే మన బుద్ధిమీద పడే ప్రకృతి ముద్ర ఫలితంగా మనకు అనుభూతులు కలుగుతున్నాయి. అనుభూతి మన చైతన్యంలో ప్రకృతి ప్రతి ఫలనమేగాని, ప్రకృతిని కిందికినెట్టి దానితో సంబంధం లేకుండా మన చైతన్యంలో స్వతంత్రంగానే రూపొందేది మాత్రం కాదు. అలా ఉండడం అసంభవం. పదార్థ మయమైన బాహిర ప్రకృతి ఉండి, అది మన బుద్ధి మీద తన ముద్రవేసి, మన చైతన్యంలో ప్రతిఫలనం పొందినప్పుడే, మనకు అనుభూతి కలుగుతుంది తప్ప, తనంత తానై, తోసుకుని ముందుకు వచ్చినట్టు కలగదు.

అనుభూతి తనగా ఉండదు. పదార్థం అనుభూతికి మూలం. మనిషి జ్ఞానేంద్రియాలు ఆ అనుభూతిని మెదటికి చేరవేస్తాయి. మెదడు జటిల పదార్థం. దానిలో కళలకు సంబంధించి ఒక పార్శ్వం, శాస్త్రాలకు సంబంధించి మరో పార్శ్వం ఉన్నాయని అంటున్నారు. అయితే ఏ ఒకటీ దేనికది స్వతంత్రమైనది కాదు. మెదడనేది నాడీ కేంద్రమైనందువల్ల, ఆ ఉభయ పార్శ్వాల సందేశాలను అది అవయవాలకు అందించినప్పుడు భావప్రేరణలు కలిగి, కార్యాచరణకు పూనుస్తాయి. చైతన్యమనేది పదార్థ ధర్మం. సదరు పదార్థం మెదడు. అదీ పాదార్థికమే- అత్యున్నత అభివృద్ధి పొందిన పదార్థం. చైతన్యం బాహిర ప్రపంచ ప్రతిఫలనంతో ఆగదు- దాన్ని సృష్టించేదాకా సాగుతుంది. వస్తు స్వరూప జ్ఞానం (Perceptual knowledge)

బాహిర పదార్థ జ్ఞానం. ఆలోచన ఫలితంగా హేతుబద్ధ జ్ఞానం నుంచి విప్లవాత్మకమైన ఆచరణ వరకు ఈ బాహిర సంబంధాల జ్ఞానం కొనసాగినప్పుడు, వస్తు స్వభావ జ్ఞానం (conceptual knowledge) ఏర్పడుతుంది. ఇది ఒక గెంతులాంటిది (leap).

తెలుసుకోవడం జ్ఞానం. దేన్ని తెలుసుకోవడం? తననా? కాదు. జ్ఞానం అంటే బాహిర ప్రకృతిని తెలుసుకోవడమే. పదార్థాల ఆంతర సంబంధాలను గుర్తెరగడమే జ్ఞానం అంటే. పదార్థమయమైన బాహిర ప్రకృతిని తెలుసుకోలేము బొమ్మనేవాళ్ళు 'అగ్నాస్టిక్'లు (Agnostics). తెలుసుకోగలగడమే కాదు, దాని ప్రతిఫలనాల మూలంగా బుద్ధి సంపన్నమై పటుతరమై మరింత పరిజ్ఞానానికి దారి తీస్తుంది. జ్ఞానం అవగాహనకు మూలం. ఒక వస్తువును అవగాహన చేసుకోవడమంటే దాన్ని మార్చే శక్తిని సమకూర్చుకోవడమే. పదార్థ సంబంధి కాకుండా ముందుగానే జ్ఞానం ఏర్పడదు. పదార్థ సంబంధాల వల్లనూ ప్రకృతి ప్రతిఫలనం వల్లనూ జ్ఞానం ఏర్పడుతుంది. అలాగే బుద్ధి కూడా. జ్ఞానంగానీ అవగాహనగానీ అప్పటి సామాజికాభివృద్ధి దశను బట్టే ఉంటాయి. చారిత్రక అవశ్యకత వీటిని నిర్ణయిస్తుంది. ఆచరణ నుంచి జ్ఞానం, జ్ఞానం నుంచి ఆచరణ, పునరప ఆచరణ, పునఃపి జ్ఞానం- అభివృద్ధికి సోపాన పంక్తి. పదార్థ ప్రాధమ్యాన్నే భౌతికవాదంగా వ్యవహరిస్తున్నాం. అనుభూతి పదార్థాశ్రితమే గాని, దానికి "అనన్య పరతంత్రత" ఉండదు. అనుభూతికి ఆధారభూతమైన సారం (content) ప్రకృతి తప్ప మరేదీ కాదు. దీని ఫలితమే అది. ఈ రెండింటినే వేరుజేస్తే పదార్థాలనూ దృగ్విషయాలనూ నిరాకరించవలసి వస్తుంది. అవి అవాస్తవాలు అనవలసి వస్తుంది. అసలుకే మోసమంటే ఇదే.

తెలుసుకునేవాడు ఏ వ్యక్తికి కా వ్యక్తేగాని, 'మనిషి' అనబడే నిరూప, సాధారణ వస్తువు కాదు. తెలుసుకునేది ప్రకృతినీ, సమాజాన్నీ. వాడు కర్త స్థానంలో ఉంటే, అవి కర్మ స్థానంలో ఉంటాయి. తెలుసుకోవడం మార్చడానికే. ఇది క్రియ, క్రియ సమాజ నిష్ఠం. బాహిర ప్రకృతిలో వ్యక్తుల సంపర్కా, సంపర్కాలన్నిటి వల్లనే జ్ఞానం కలుగుతుంది. తమలో తమ సంపర్కా, సంసర్గాలా జ్ఞానాన్నిచ్చేవే. సామాజికమైంది వైయక్తికంగా భాసిస్తుంది, అంతే. తెలిసి తెలిసీ ప్రకృతినీ, సమాజాన్నీ తెలుసుకోవడం, తెలియకనే తెలుసుకోవడం కంటె ఎంతో మిన్న. 'జననాంతర' వాసన వల్లనో, మతోదాని వల్లనో స్వతంత్రంగా స్వచ్ఛందంగా

అనుభూతి ఏర్పడుతుందని భావించేవాడు విధివాది (Fatalist). వస్తు జ్ఞానమే అసంభవ మనుకునేవాడు అజ్ఞేయతావాది ప్రకృతి ఉనికినే శంకించేవాడు సంశయవాది (Sceptic). ప్రకృతిని 'మాయ' అనుకొనేవాడు అద్వైతవాది. పదార్థం సత్యం, నిత్యం, పరిణామం శీలం, అవినాశం, వైరుధ్య బంధురం, అయినా వైరుధ్యాల సంఘర్షణ ఫలితంగానే పురోభివృద్ధి శీలం అనేవాడు గతితార్కిక భౌతికవాది. అలా అనుకోక, భావానికే ప్రాధాన్యం ఉన్నదనేవాడు భావవాది (Idealist).

మన తెలుగు కవులకు ఇవేవీ పట్టవు. 'పట్టవు' అనడం పెద్ద మాటే. 'తెలియవు' అనడమే సరైంది కనీసం 'అనుభూతి వాదుల' మనుకుంటున్న వారికి తెలియవనడం నిజం. వాళ్ళ ప్రకృతిని గాక తమ చైతన్యాన్నే తెలుసుకోగోరుతారు, లేదా 'సెన్సేషన్' (వస్తు స్పృహ) అనే దానికీ, 'ఫీలింగ్' (భావ ప్రకోపం) అనే దానికీ నడుమ తేడా ఎంచుతున్నారేమో! ఏ పేరున పిలిచినా, రెండూ వ్యక్తి మనోభావాలే గనక, పెద్ద తంటా ఏమీలేదు. అలాగని వాటి ప్రాముఖ్యమూ తీసివేయదగింది కాదు. ఇది లేనివాడు జడుడు. నిజానికి మనిషి క్రియాపరుడు. అయినప్పుడే జీవి. ప్రాణానికి ప్రయోజనమల్లా ఆచరణ మాత్రమే. కార్యాచరణ సామాజిక వస్తూత్పాదనకు చెందిందే. అది పెరిగేకొద్దీ బుద్ధీ పెరుగుతుంది. దీని తర్వాతనే ఇతరేతరాలైన పనులు. అది మౌలికం. ఇవి గౌణాలు.

మనిషి పనులలో సంస్కృతిపరమైన కార్యాచరణ ఒకానొకటి. రాజకీయ కార్యాచరణ మరొకటి. వర్గపోరాటం దీని లక్షణం. తక్కినవాటిని ఇది బలవత్తరంగా తాకుతుంది. మనకు తెలియకుండానే ఇది జరగవచ్చు గాని జరిగి తీరుతుంది. తెలిసి జరగడం మరెంతో మేలు. వర్గ సమాజంలో ఉంటూ వర్గపోరాటానికి అతీతంగానో తటస్థంగానో ఉన్నాననుకునేవాడు అమాయకుడైనా కావాలి, మాయావైనా కావాలి. ఆచరణ జ్ఞానానికి పై మెట్టు. ఆచరణలేని జ్ఞానం నిరర్థకం. సామాజికం గాని ఆచరణ దుర్బలం. తత్కాలావసరాల వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించడానికే జ్ఞానం పనికి వస్తుంది. ఉన్నదాన్ని తెలియపరచడమే గాక, ముందు ముందు ఉండబోయేదాన్ని సూచిస్తుంది కూడా. బుద్ధి పిచ్చిదేమీ కాదు. దానికో క్రమం ఉంది. అది హేతుబద్ధం హేతుబుద్ధితో వస్తువుల ఆంతర సంబంధాలనూ ముఖ్య లక్షణాలనూ మనం తెలుసుకోవచ్చు. పైకి కనిపించేది (appearence) వస్తు సారం (essence) కాదు.

కళలకు 'సబ్జెక్టివ్ ఎలిమెంట్' ప్రాణం కాదనడం తప్పు. అలాగని 'ఆబ్జెక్టివ్ రియాలిటీ'కి అది విడాకులిస్తుందనుకోవడమూ పొసగని మాట. వస్తువనేది ఉంటేనే భావం గానీ, అనుభూతి గానీ. లేకుంటే నేల విడిచిన సాము చందమే. అంచేత ఆత్మాశ్రయతను అతకరించకుండానే, ఆత్మాశ్రయతకి గూడా వస్తుపరమైన మూలం తప్పనిసరి అవాలి. 'సబ్జెక్టివ్ ఎలిమెంట్' 'సబ్జెక్టివిజం' గా ముదరగూడదు.

'ఆత్మాశ్రయ' కవిత్వాన్ని 'భావ' కవిత్వానికి పర్యాయపదంగా వాడుతున్నాం. ఒక నిర్దిష్ట చారిత్రక సన్నివేశంలో అది ఒక కవితా ధోరణిగా ప్రసిద్ధికి వచ్చింది. వ్యక్తి స్వేచ్ఛ దాని ప్రాణశ్వాస. సామాజిక వ్యవస్థలోని దుర్నయాలా, నిర్బంధాలా తనకు సంకెళ్ళు. స్వేచ్ఛ మంచిదే. మితిమీరితే మాత్రం అది ఇష్టారాజ్యమే. ముదిరితే తొండ ఊసరవెల్లి. దాంపత్యం, కుటుంబం, సమాజం- ఇవేవీ వుఫ్ఫుమంటే ఎగిరిపోయేవి కావు. వాటికో చరిత్ర వుంది. స్థిరతా ఏర్పడింది. అవి వికృతమై దుర్భరమైన మాట మాత్రం నిజం. వాటిని సమూల విచ్ఛేదం చెయ్యడం, అభిలషణీయమే అనుకున్నా, అసాధ్యం. సాధ్యమేననుకున్నా అది దీర్ఘకాలిక పోరాట ఫలితమేగాని, గారడివాని మామిడిపండు కాదు. అయితే వాటిని ధిక్కరించడం, ఉల్లంఘించడం అవశ్యం అవసరం, ఆరోగ్య లక్షణం కూడా. ఈ ధిక్కారమూ, ఉల్లంఘనమూ ఉగ్రమై, పగ్గాల పీరులాగై శివమెత్తి పూనకం వస్తే, ఉన్మత్తతే, వికటమే. అప్పుడిక ఆరోగ్య లక్షణమల్లా వ్యాధి లక్షణంగా, అవలక్షణంగా పరిణమించే ప్రమాదం ఉంది.

మరో విషయం. ఆనాటి స్థితీ గతీ నేడూ ఉండవచ్చుగాని, వెనకటిరూపంలో అప్పటంత మొరటుగా మొండికి పడినట్లుగా మాత్రం లేవు. సరికొత్త దురాచారాలూ, అక్రమాలూ వచ్చి దూరినమాట నిజమేగాని, వర్ణాంతర వివాహాలేమి, మతాంతర, జాత్యంతర వివాహాలేమి, ప్రేమను ఆశ్రయించుకుని ఎక్కువయ్యాయనడమూ నిజమే. మారిన ఈ పరిస్థితిలోగూడా వెనకటి ఆత్మాశ్రయ ధోరణినే కొనసాగించడం శవాన్ని ఊరేగించడమే. పంటలో 'నాము పంట' అని ఒకటి ఉంది. గట్టి గింజల పంట కాలం గడవగా పొలంలో నీరసంగా నిలిచిన మొక్కలు కాచే తాలూ తరకా పంటను ఈ పేరుతో పిలుస్తారు. నేటి ఆత్మాశ్రయ కవిత ఇలాంటి నాము పంటే. చరిత్రలో మొదట మొదట ఉదాత్తంగా కనిపించేదే తదనంతర కాలాన అదేరూపంలో హాస్యాస్పదమవుతుంది. 'భావ' కవిత్వం అరటి పిలక ఖా

'అనుభూతి కవిత'. కుక్కమూతి పిందె గనక ఇది గిడసబారిపోవలసిందే తప్ప, పరిపక్వమైన ఫలం కాలేదు. కాజాలదన్న మాట. అంచేత, పుట్టుకతోనే ఇది గొడ్డుపోయింది. అయినా ఇదేదో అపూర్వ విశేషమనే భ్రమ గొలుపుతున్నారు. నేటి కవులలో కొందరు, చింత చచ్చినా పులుపు చావలేదు లాగుంది. ఒకోమారు పడి పోయాక గూడా వేళ్ళు నేలలో తన్నుకునివున్న మాను ఇక్కడో చిగురూ అక్కడో చిగురు వేయవచ్చుగాని, దాన్ని చెట్టు అనలేము. అది పనికి వచ్చేదల్లా పొయ్యిలో వంట చెరుకుగానే.

'అనుభూతి కవితా'తత్వానికి ఇటీవల కాలంలో బాలగంగాధర తిలక్ ఆద్యుడు. వస్తు ప్రధాన కవితను కుందుర్తి అభిమానించి, కథా కావ్యాలవల్ల ఆత్మా శ్రయంత తగ్గిపోతుందంటే, తిలక్ పోను పోనూ వైయక్తికానుభూతి ప్రధానమైన కవితను "అందం-ఆనందం" తత్వంతోటి ఆకర్షవంతం చేశాడు. ఆయనది 'నార్సిసిస్టిర్ కాంప్లెక్స్'—స్వీయప్రేమ భావజాడ్యం.

'భావ' కవుల్లాగా 'అనుభూతి' కవులు కోరుకునే 'స్వేచ్ఛ'కూ అసలైన సేచ్ఛకూ తేడా ఉంది. వీరి స్వేచ్ఛకు మూలం భూస్వామిక ఆస్తి సంబంధాల నెదు ర్కొన్న బూర్జువా ఆస్తి సంబంధాలే. ఆ చారిత్రక క్రమంలోనే వ్యక్తి స్వేచ్ఛ, వ్యాపార స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, వివాహసంబంధమైన స్వేచ్ఛ మొదలయ్యాయి. అప్పటికి ఇది ప్రగతిశీలమైందే. కాని, పోను పోను వ్యక్తి ఆస్తి స్వేచ్ఛ పేరిట పారిశ్రామిక విప్లవానంతరం సమాజంలోని దుర్బలవర్గాల సుఖసంతోషాలకు ఇది సంకటమై కంటకమై కూచుంది. సమిష్టి వాదాన్ని [Collectivism] పూర్తిగా తోసేసి Laissez-Faire (Let Alove) తత్వంతో వ్యక్తి వాదానికి [Individualism] దారి తీసింది. వ్యాపార స్వేచ్ఛ వలస వాదాన్ని బలపరిచింది, సామ్రాజ్యాన్ని సమర్థించింది. "సర్వతంత్ర స్వతంత్రత"గా విరాట్ వికట రూపం ధరించింది. అప్పుడిది గట్టులేని వరదే, ఉపద్రవమైంది, యుద్ధాలు సృష్టించింది, చెలియలి కట్టను దాటి ఉప్పెనలా ఉత్పాతమైంది. అంతే కాదు, కళలలో సమిష్టి జీవితచిత్ర స్థానాన్ని కమ్మివేసేటంతగా వ్యక్తి జీవిత చిత్రణగా పర్యవసించింది. బాహిర జీవి తానికి యెడమైపోయి ఆంతర జీవితాన్ని ఆశ్రయించింది. ఆదిలో శ్రమా, బుద్ధీ జమిలిగా వుండేవి, పోను పోను చరిత్ర క్రమంలో అవి విడిపోయాయి. భౌతిక జీవి తాన్ని తన్నేసి మనోభావం తన కాలిపట్టు పోగొట్టుకుంది. అప్పుడు 'భావాంబరవీధి'

లోని శూన్యత చైతన్యంలో దానికి శరణ్యమైంది. శ్రమకీ బుద్ధికీ ఒద్దిక కలిగించడమే కర్తవ్యం కాగా, కళల్లో వ్యక్తివాదం వాటి మధ్య గల భేదాన్ని అగాధంగా విస్తరించి వేసింది. చివరికి, శిథిల వ్యక్తిత్వాన్ని గద్దెనెక్కించింది.

వ్యక్తి ఆంతర జీవితం అనివార్యంగా సంకుచితం. మీదుమిక్కిలి అల్పం. ఇంకా తన రోమ కూపాలలో తానే చిరుకప్పగా అంతరాంతరాల్లోకి ఈది, వ్యక్తావ్యక్తాల మధ్యగల భేదాన్ని తుడిచేసే విధంగా ముదిరిపోయింది. వ్యక్తం హేతుబద్ధం. కాగా, అవ్యక్తం అనబడే 'సుప్త చైతన్యం' నిర్హేతుమయం (Irrational) ఇది జంతుకోటికి చెందిన సహజాతాలతో (Instincts), ఉద్రేకాలతో (Impulses) గూడిన చిట్టడివి వ్యక్త చైతన్యం (Conscious) ఎప్పటికప్పుడు తీరుతెన్నులు చూసుకుంటూ బుద్ధిబలంతోటి ఉద్యానవనం అవుతుంది. తమ చర్మాల వెనక్కి, నరాల వెనక్కి, అనుభవాల వెనక్కి, వెళ్ళివెళ్ళి వెళ్ళి, చివరికి వ్యక్తి కృశించి నిరసిస్తాడు. కళల్లో వ్యక్తిత్వ విచ్ఛిత్తి జరుగుతూందంటే ఇదే కారణం. బూర్జువా స్వేచ్ఛ స్వేచ్ఛకే విరోధి. బూర్జువా వ్యక్తిత్వం వ్యక్తిత్వానికే ధ్వంసకారి 'అనుభూతి' జీవితవాస్తవాన్నే నిరాకరించింది, పోనీ, తృణీకరించింది. వెర్రి మొర్రి కోరికలా తలాతోకా లేని కలలా, క్రమాన్ని పాటించని ఊహలూ, ఇవే ఎక్కువగా 'అనుభూతి'ని నిర్ణయించే విషయాలయ్యాయి. తక్కిన మనుషులంతా కీత సరుకనిపిస్తుంది. మానవీయ మహాప్రమేయాలన్నీ నిరర్థకమనిపిస్తాయి. వ్యక్తి తనలో తానే బందీ అవుతాడు. నాతిని చెయ్యబోయి కోతినిచేసేది అనుభూతికాదు, 'అనుభూతివాదమే'. అప్పుడిక కారుచీకటే పండువెన్నెల, పరమ 'పాపమే' మాచెడ్డ పావనం. శిథిలమే ఆలయం. ఏవంతికతే, లేదా ఒంటరితనమే సమస్త లోకం. అణువే అజాండం. వ్యక్తే మహాశక్తి. ఇదంతా పగటికల.

ఇంగ్లాండు కళాచరిత్రలో 19వ శతాబ్ది చివరి భాగాన్ని హాల్ బ్రూక్ జాక్సన్ లాంటి విమర్శకులు 'ఫిన్ డు సెయికిల్' అనే ఫ్రెంచి మాటతో వర్ణించారు. 'యుగాంతం' అని అర్థం కావచ్చు. అప్పటి కవులూ కళాకారులూ సౌందర్యానుభవాన్ని దాహంగా పెంచుకుని దానికోసం పరితపించిపోయారు. అనుభూతిని దోసిళ్ళతో జుర్రుకోవాలనే ఆబ చూపెట్టారు. వెనక్కి తప్పుకుని గతంగా మారుతున్న ప్రతీ ఒక క్షణం నుంచీ యీ 'రసానందాన్ని' క్రోలాలనుకున్నారు. సెన్సేషన్‌ని 'సెన్సేషనలిజం' [అనుభవదాహవాదం]గా మార్చారు. కవితల్లో చిత్ర లేఖనంలో

నవలల్లో తమ వ్యక్తిత్వాలను చైతన్యం అగాధాలపైపు తిప్పారు. అంతటితో ఆగక, నిత్యజీవితంలోనూ, తమ ప్రవర్తనను తదితరుల ప్రవర్తనకు భిన్నంగానూ వింత గాలిపేట్టుగానూ భయంకర ఆకర్షణ కలిగేట్టుగానూ ఉలిపికట్టై తనంతోటి వికటంగా రూపొందించుకోసాగారు. ఉదా : [ఆస్కార్ వైల్డ్] ఫ్రాన్సులో అప్పటికే జరిగి పోయి, "పాప పంకం నుండి పద్మాలు పుట్టించి" [Flowers of Sin] చెడు పూవులు పూయించిన బాడ్‌లేర్ లాంటి కవుల ప్రభావం ఫలితమే ఇంగ్లీషు కళాకారుల అకటావికటం 'కళకోసమే కళ' అనేది పైకి వచ్చిందప్పుడే.

తెలుగులో ఇప్పుడు సోకుతూన్న ఈ తెగులు కృత్రిమం కావచ్చు, కాకపో వచ్చు. కాని ఇది మోజుగా మారుతూంది. దీని అంతిమ ఫలితాలు స్వాదు ఫలాలు మాత్రం కాబోవు. భూస్వామ్య + 'పాండిత్య' వాసనలు పూర్తిగా వదలకుండానే 'ఆధునికులు'గా నవీనులుగా నాగరీకులుగా శిష్టులుగా చలామణి కాజూచే కవులు కొందరు, ఎక్కడో న్యూయార్కు వద్ద కేటాగా ఒక వలస నెలకొలుపుకుని అక్కడ యథేచ్ఛగా జీవించే కళాకారుల నకళ్ళు దించే కవులు కొందరు, కోతికొమ్మచ్చిలో, కొమ్మకు తల్లకిందులుగా వుండి అదేదో విచిత్రమనిపించి అనులోమానికి విరుద్ధమైన పనిచేస్తూ, మహాకవులమని తాము భ్రమపడి ఇతరులను భ్రమపెట్టే కవులు కొందరు, పరస్పరాభినందనలతో ఒకరి వీపు నింకొకరు గీరుకుంటూ తృప్తిపడే కూటమిగా తయారై కూడున్నారు. అయితే వీరిదంతా ఏకతార సంగీతం మట్టుకు కాదు. ఒక్కొక్కరిది ఒక్కోతీరు, అంతా కలిసి తీస్తారు.

ఇది, ఈ 'అనుభూతివాదం' ఇప్పుడే ఎందుకు పుట్టగొడుగులా పుట్టుకొచ్చి నట్టు ? మనసులో మాట పైకి అనకపోవచ్చుగాని, విప్లవ సాహిత్య వివర్ధనాన్ని పరోక్షంగానైనా దెబ్బదీయడం వీరందరి పరమార్థం, రాజకీయమంతా కశ్మలమనే మనిషి ఎవరైనా పౌరుడు కానట్టుగానే, కవిత్వమంతా కశ్మలమైపోతూన్న దనుకునే కవి ఎవరైనా సహజ విరోధే. అయితే ఏ ఆధారమూ లేకుండా ఏ ఉపాధీ లేకుండా అతగాడు జీవించగలుగుతున్నాడా? రాబిన్సన్ క్రూసో ఎంతకాలం దీవిగడ్డ మీద ఏకాంత జీవితం గడపగలిగాడు? సమాజం తనకంతా ప్రసాదించాలి, తాను మాత్రం సమాజానికి ఏమీ విదల్చగూడదు. ఇంతకంటే ఘోరమైన దురన్యాయం మరొకటి ఉంటుందా? నిజానికి, ఇది అతగాని భావశైథిల్యమేగాక, ఆత్మవధ, తన ఉనికికీ మనికికీ బుద్ధికీ

కళకీ నైపుణ్యానికీ కౌశలానికీ మూలకారణమైన ప్రకృతినీ, సమాజాన్నీ నిరాకరించడమంటే, తనకు ఒక అమ్మా అయ్యా లేరనడమే.

అనుభూతివాది 'శుద్ధ' కవిత్వం కావాలంటున్నాడు. 'శుద్ధం' బ్రహ్మాండమైన అబద్ధం. ఎంచేతంటే అది ఈ లోకంలో దొరికే దినుసుకాదు. ఊహకే అది అందుతుంది కావచ్చు. అయితే ఊహకే అందేది చేతికందనట్టే లెక్క. ఏది ఉంటే అశుద్ధం, ఏది లేకుంటే శుద్ధం? లౌకికమైన ప్రమేయాలన్నీ నిషిద్ధాలన్నట్టా? జీవిత వాస్తవాలకు తావే లేనట్టా? తనవి తప్ప తక్కిన మనుషుల వ్యవహారాలు ఉండదగవా? తన అనుభూతి మాత్రమే ఇచ్ఛానువర్తిగా ఉండాలా? ఇవన్నీ కాదు, రాజకీయం రంగూ రుచీ వాసనా పనికిరావు. పోనీ, తాను తనగా 'ఐకాంతికత' (Privacy)లో జీవించి భావించి రచించి వచించగలుగుతున్నాడా? తన ఇష్టాయిష్టాలను రచనలో చూపడం లేదా? తనకు సరిపడని రాజకీయం మాత్రం ఉండగూడదన్నమాట! తనకు ఏదిన్నీ ఉండగూడదు. "చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష". పైగా, మనుషులంతా మలినమైపోయారనీ, కళ కళంకితమైపోయిందనీ, ఏడుపొకటి. ఎందుకట? తనలా వాళ్ళు సన్యాసులై, కళా అప్రమేయం కాలేదు, పాపం! తాను లేకుండానే లోకం సుశ్లోకం కాగలదు. దాన్ని తాను స్వాధీనం చేసుకోవడం వల్లమాలినపని, అలాంటప్పుడు తనకు అరకులోయో, హంపీశిథిలమో, స్మృతులపొదో, చెరువుగట్టో, యూకలిప్టస్ చెట్టో, తనకు తోడుబోయిన మరో కవో, అతని గురించిన కలో, సొంతసొదో, టీ కప్పులనందించే భార్యామణో, నవ్వితే బుగ్గ సొట్టపడే 'డాలీ'యో లేక, వీధిలో పొల్లాడే గాడిదో, కవిత్వ వస్తువౌతుంది. అల్పిష్టిది అమోఘం. అప్రయోజకమైంది ఆత్మానందకరం. అనిష్టం అరిష్టమే.

[ఐదారేళ్ళ క్రితం రాసిన ఈ వ్యాసం ప్రస్తుత సందర్భానికి పనికిరాగలదని భావించినందువల్ల, దీన్ని ఇప్పుడు ప్రకటించడం జరుగుతూంది.—రచయిత]

అభివృద్ధి - కొలతలు, ప్రమాణాలు

ఆర్. ఎస్. రావు

పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ - అభివృద్ధి, వెలుగునీడలు - మీద నాకు తెలిసినంత వరకు ఐదు సమీక్షలు వచ్చాయి. ఒక చిన్న వ్యాసానికి పుస్తకమనే రూపమిచ్చిన పర్‌స్పెక్టివ్స్‌కు, సమీక్ష చేసినందుకు ఆయా వ్యక్తులకూ, అవి ప్రచురించిన పత్రికలకూ కృతజ్ఞతలు. సమీక్షలని సమీకరించే సాంప్రదాయముందో లేదో తెలియదుకాని, సామాజిక అవసరాల దృష్ట్యా, అభివృద్ధిని అర్థం చేసుకోవలసి వచ్చిన, అర్థం చేసుకోవటానికి అవసరమైన చర్చ ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ సమీకరణ. ఈ సమీకరణ మూడు భాగాలలో చేయడం జరిగింది. మొదటిది ప్రమాణాలకు సంబంధించినది. రెండవది ప్రశ్నలకు సంబంధించినది. మూడవది సందర్భానికి సంబంధించినది.

ఒక మిత్రుడు వ్యాసం చదివినమీదట, "ప్రజల గురించి ఆలోచించే చాలా మంది మేధావులకు తమ చదువు, సంస్కారపు సాంప్రదాయక అధ్యయన విధానం ఇంకా బలంగానే ఉంది. అటునుంచి దృష్టి మళ్ళించి పూర్తిగా చీకటిమయంగా ఉన్న ప్రజల చరిత్రను అధ్యయనం చెయ్యాల్సిన అవసరం ఉన్నది. ఈ క్రమంలోనే ప్రమాణాలు మారుతాయి." అన్నాడు. ఆ క్రమంలో ప్రమాణాలు మారతాయో లేదో తెలియదు కాని ప్రమాణాలు మారాలన్న అంశం బాగానే చెప్పాడు మిత్రుడు. వెలుగులో నిలబడి చీకటిలోకి చూస్తే అదంతా ఒక విడదీయరాని ముద్దగా ఉంటుంది. దాని లోపల ఏముందో ఏం జరుగుతోందో తెలియదు. అదే చీకటిలోంచి వెలుగుని చూస్తే ఆ వెలుగులో ఉన్న వ్యత్యాసాలు కనబడతాయి. అంతేకాకుండా చీకటిలో ఉండే కదలికలు కూడా కనిపిస్తాయి. కొత్త ప్రమాణాలు దొరుకుతాయి. చీకటిని చూడ్డానికి, వెలుగుని పట్టుకోటానికి.

ఆంధ్రభూమిలో సమీక్షిస్తూ, "సాధారణమైన అభివృద్ధి, నిర్దిష్టమైన అభివృద్ధి అన్నది తేడాకాదు, అభివృద్ధి అనేది ఒకేలాగా ఉంటుంది, సాధారణమని నిర్దిష్టమనీ కాదు" అని ఒక అమూర్తమైన సలహాచెప్పారు. సమీక్షలోని అవగాహన లోపాలు పక్కన పెట్టడం న్యాయం, ఎందుకంటే చర్చ అనేది ఎప్పుడు అవగాహనకి సంబం

ధించినదే - జరుగుతున్న అభివృద్ధిని ఎలా అవగాహన చేసుకుంటాం అన్నది. అమూర్తమైన అభివృద్ధి అంటే అభివృద్ధి ఒకేలా ఉంటుంది అనే చూస్తామా లేక అభివృద్ధిని ఒక సామాజిక చారిత్రక చట్రంలోంచి - అంటే నిర్దిష్టంగా - చూస్తామా అన్నది గమనించవలసిన విషయం. స్టీలు ఫ్యాక్టరీ పెడితే ఎలాంటి అభివృద్ధి వస్తుంది అని అమూర్తంగా చూస్తామా లేక విశాఖపట్టణంలో స్టీలు ఫ్యాక్టరీ పెడితే ఏమవుతుందని చర్చిస్తామా? అలాగే డాము కడితే అమెరికాలో అలాంటి డాము కట్టినప్పుడు ఎలాంటి లాభాలు వచ్చాయి, అలాగే మనకి వస్తాయి అని అమూర్తంగా చూస్తామా లేక గడ్చిరోలీలో డాము కడితే ఏమవుతుందని ఆలోచిస్తామా? గడ్చిరోలీలో డాము అయినా, విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ అయినా అక్కడ ఉండే సాంఘిక సంబంధాలు, వాటిలో వచ్చే/రాబోయే మార్పులను చూసి ఆ డాముమీద కాని ఆ ఫ్యాక్టరీమీద కాని అభివృద్ధి పథకంగా ఒక అవగాహన ఏర్పరచుకుంటాం. అంటే ఏ విషయమైనా అర్థం చేసుకునేందుకు ఒక నిర్దిష్టం నుంచి మొదలుపెట్టి ఒక అమూర్తానికి వెళ్ళి మళ్ళీ తిరిగి నిర్దిష్టానికి వస్తాము. నిర్దిష్టం లేకుండా అమూర్తం లేదు. కాని అమూర్తం లేకుండా నిర్దిష్టం ఉండగలదు. సామాన్యంగా చర్చ ఎప్పుడూ అమూర్త సాధారణ చర్చగానే చేస్తూ ఉంటాం. అందువలననే ఆ చర్చలు అసంపూర్ణంగా ఉండిపోతాయి. చర్విత చర్వణంగా సాగుతూ వుంటాయి. ఉదాహరణకి, వ్యవసాయ క్షేత్రానికి సంబంధించిన రెండు విషయాలు తీసుకుందాం: మొదటిది భూ సంస్కరణలు. దున్నేవాడిదేభూమి అనే ప్రాతిపదికమీద మొదలయిన భూసంస్కరణలు ఒక రకమైన భూస్వామ్య వ్యతిరేక చర్య. సమాజాన్ని పునర్నిర్మాణం చేసే రాజకీయ చర్య. '47-'50ల మధ్యకాలంలో అన్ని రాజకీయ పార్టీలు ఏదో విధంగా రాజకీయంగా వాటిని వాడుకున్నవే. ఎప్పుడు ఒక సాంఘిక, ఆర్థిక సంక్షోభం వచ్చినా, మళ్ళీ భూ సంస్కరణలమీద చర్చ జరుగుతూనే ఉంది. అది ఇందిరాగాంధీ చేసింది. ఈ మధ్య వి.పి. సింగ్ చేసాడు. కాని దున్నేవాడికి భూమి ఇవ్వటానికి భూమి ఎక్కడ ఉంది. అంతభూమి పంచితే తలసరి వచ్చే భూమి గిట్టుబాటుకాదు కదా అని సందేహం. '50లలోనూ ఆ సందేహమే. 90'ల లోనూ అ సందేహమే. అదే చర్చ. '90లలో జనాభా పెరుగుదలకూడ ఆ చర్చకి ఇంకొక అంశాన్ని కలిపింది. దీనికితోడు ఈ మధ్య వచ్చిన ట్రాక్టర్లు-హార్వెస్టర్లు, పంప్‌సెట్స్ చిన్న కమతాల కంటే పెద్ద కమతాలే అభివృద్ధికి లాభదాయకం అనే చర్చ కూడా వచ్చింది.

చాలాకాలం క్రితం పూనాలో ఉన్నపుడు గోదావరీ పరూలేకర్ ఒకసారి భూకమతాల మీద చర్చకి పిలిచారు. ఒక కుటుంబానికి అవసరాల రీత్యా భూకమతాలు ఎంత ఉండాలి, చెరకు అయితే ఎంత ఉండాలి, వరి పండిస్తే ఎంత ఉండాలి, ప్రత్తి అయితే ఎంత అని మనం లెక్కలు కట్టాలన్నారు. ఇలాగా పంటల వారీగా కమతాల పరిమితిని ఒక సాంకేతిక విజ్ఞానంగా పరిమాణాలను లెక్క చూడటం భూ సంస్కరణల మీద చర్చలో ఒక భాగమయినది. రాజకీయ ప్రమాణంగా ఉన్న భూ సంస్కరణలు సాంకేతిక ప్రమాణాలకి చేరుకున్నాయి. ఇకపోతే సంక్షోభం దృష్ట్యా చేసిన భూ సంస్కరణ ఒక తప్పనిసరి బెడదగా, ఒక అర ఎకరం ఒక హరిజనుడికి మరో అర ఎకరం మరో గిరిజనుడికి ఇస్తుంది. భూ సంస్కరణ భూస్వామ్య వ్యతిరేక చర్య. చేపట్టిన (వ్రాతలోనే ఉండే అమూర్త సాధారణ అభివృద్ధి పరంగా) రాజకీయ పార్టీలు కూడా ఫ్యూడలిజం ఎక్కడుంది, అది ఉన్నా కూడా అవశేషాలుగానే అక్కడా ఇక్కడా ఉన్నవి కదా అని అమూర్తంగానే తేల్చిపెట్టారు. కాని అదే భూ-సంస్కరణలు మళ్ళీ తెలంగాణా జిల్లాలలో తిరిగి రాజకీయ ప్రాతిపదికగా మన ముందుకు వచ్చినపుడు భూ సంస్కరణలమీద ప్రమాణాలు మారుతాయి. గ్రామాలలో అత్యధికంగా ఉండే పేద రైతాంగం వ్యవసాయ కూలి కుటుంబాలు రాజ్యాధికారాన్ని భూ సంస్కరణలద్వారా అందచేయమంటాయి. ఒక ఏడాది వరకు "ఎక్కడ ఉన్నాయి భూములు పంచటానికి?" అని అన్నవాళ్ళు కూడా "చూడండి. భూములు ఉంటనే ఉంటాయి." అంటారు. "ఎక్కడ ఉన్నాయి సీలింగు భూములు?" అన్న వాళ్ళు కూడా ఆ సీలింగ్ చట్టాలని విధించటానికి (అమలు చెయ్యటానికి) ఉపక్రమిస్తారు. ఒకవేళ ప్రజాకోర్టులద్వారా ఆ భూములు పంచితే దాన్ని చెన్నారెడ్డిగారన్నట్లు రిజిస్ట్రేషన్ చెయ్యమంటారు. ఈ సమయంలో అట్టడుగున పడి కన్పించని భూములన్నీ కనిపిస్తాయి. ఈ ప్రమాణాలు మారటమన్నది నిర్దిష్టంగానే జరుగుతుంది. నిర్దిష్టంగా భూసంస్కరణలను చూడకపోతే ఒక గ్రామంలో ఎంతభూమి ఉంది ఎంతమంది పేదరైతులు, రైతుకూలీలు భూమిలేక ఆకలితో ఉన్నారు అనేది నిర్దిష్టంగా చూడకపోతే, అమూర్తంగా మళ్ళీ ఎక్కడుంది భూమి భూ కమతాలు చిన్నవై పోవుకదా అనేటటువంటి చర్చ కొత్త ప్రమాణాలని పెట్టలేదు. ఒకవేళ ఎవరైనా పెట్టినా అదేదో మినహాయింపు. నక్సలైట్లు చేసివుంటారు అని చర్చలోంచి నిర్దిష్టాన్ని తీసేసి అమూర్తంగా అలా చర్చించుకుంటూ పోతుంటారు.

ఇంకొక విషయం తీసుకుందాం. అది డాములు కట్టడం. 1950లలో హీరాకుడ్ డాము కట్టినపుడు ప్రజలు ఆందోళన చేసారు. అప్పుడు డామంటే ప్రగతి, అభివృద్ధి అన్నారు. నిర్వాసితులంటారు తప్పదు, ప్రగతిపథంలో అటువంటివి జరగటం తప్పదన్నారు. నిర్వాసితుల బాధలు తీరుస్తామన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకూ అదే, అది నర్మదా అవవచ్చును, టెహరీ అవవచ్చు. డాములని కొలిచే ప్రమాణాలు అవి అధికం చేసే ఉత్పత్తి మాత్రమే. కాని డాముల వలన నష్టపోయేది నిర్వాసితులు, వాళ్ళ భూములు. డాము అధికం చేసే ఉత్పత్తి ఎక్కువా? నష్టపోయే నిర్వాసితుల నష్టం ఎక్కువా? ఇదే డాముల మీద జరిగే చర్చ. కాలక్రమంలో పర్యావరణానికి కలిగే నష్టం నష్టాల జాబితాలో చేరింది. ఇకపోతే అభివృద్ధి కోసం డాము అన్నపుడు డాము లేకుండా అదిలేని పరిస్థితిలో అభివృద్ధిని కోరుకునే ప్రజలు, డాము లేకుండా అభివృద్ధి జరుగుతుందని అనుకొన్న ప్రజలు వారి కోరికలు ముందుంచితే అభివృద్ధికి ప్రమాణాలు మారిపోతాయి కదా! కొన్నాళ్ళ క్రితం చంద్రాపూర్‌లో ఓ సెమినారు పెడుతున్నాము రమ్మని పిలిచారు. దానికి పిలుస్తూ మిత్రుడు డాము మీద అంతవరకూ జరుగుతున్న చర్చను వ్రాసి మనం దాని మీద కూలంకషంగా చర్చిద్దాం రమ్మని ఆహ్వానం. అక్కడికి వెళ్ళి వచ్చిన మరో మిత్రుడు చెప్పిన సంగతులు ఎంతో ముఖ్యమైనవి. ఆ సెమినారుకి కొన్ని వేలమంది గిరిజనులు వచ్చారనీ ఆ సెమినారుని ఆపటానికి పోలీసులు కొంత ప్రయత్నించారనీ కొంత పండిత చర్చ మినహా ముఖ్యమైన విషయమేమిటంటే ఎజెండా మారిపోయిందని. నీటి సమస్య కంటె భూమి సమస్య ముందుకు వచ్చిందనీ, భూమి సమస్యతో ముడిపడిన రాజకీయ సమస్య ముందుకు వచ్చినదనీ, డాములమీద చర్చ అభివృద్ధి మీద చర్చగా మారటంతోపాటు అభివృద్ధికి కొలతలు, ప్రమాణాలు మారిపోయాయనీ, పాలకవర్గ ఎజెండా మారి పాలిత (ప్రజ) ఎజెండా తీసుకొని రావటం గడ్చిరోలీ చేసిన పని అని ఆ సెమినారు మీద విశేషాలు చెప్పారు. ఆ ప్రమాణాలు మార్చక పోతే నర్మదాసాగర్ మీద వచ్చిన చర్చలాగా ఈ కొత్త విషయాలు మన ముందుకు వచ్చేవి కావు. ఈ ప్రమాణాలు మారటం అనే విషయాన్ని 1990 జూన్/జూలై సృజనలో వరంగల్లు సభలను సమీక్షిస్తూ వ్రాసిన సంపాదకీయం బాగా చెప్పింది. [భూస్వామ్యం ఎదుర్కొంటున్న సంక్షోభంలో భూమి తలయెత్తి తన సంతానాన్ని తన ప్రక్కన చేర్చుకుని నిలబడే వరకు నిన్నటిదాకా చెరపట్టిన వాళ్ళ అహంకారం

అణిగిపోయింది. స్వామ్య స్వభావాన్ని సాధ్యంకాని సౌమ్య స్వభావంలో దాచుకో చూస్తున్నారు. "అది బద్మాష్ ఊరు, అని నోరుజారి ఇప్పటి భాషలో చెప్పాలంటే మిలిటెంటు గ్రామం" అని నాలుక కరుచుకుంటున్నారు. 'మాదిగోడు' 'చాకలోడు' అని అలవాటైన నోట 'అయన'ను చేర్చటానికి 'విద్యావంతులు' కొత్త ఓనమాలు, ఉచ్చారణ నేర్చుకుంటున్నారు.]

× × × ×

ప్రమాణాలు మారుతున్న కాలంలో ప్రశ్నలు కొత్తవి వస్తాయి. కొత్త విషయాలు మన ముందుకు వస్తాయి. పాత విషయాల మీద కొత్త భావాలు ముందుకు వస్తాయి. ఇది 1990 సంగతి. ఈ పరిస్థితి 1970లో లేదు. '67-'69 మధ్య కాలంలో కొంతమంది మార్క్సిస్టు మేధావులు తమ ఆచరణకి తమ పార్టీ కార్యక్రమానికి ఉన్న వైరుధ్యాన్ని గ్రహించి ఆచరణకి బద్ధంగా ఉండే పార్టీ కార్యక్రమాన్ని రూపొందించుకొని ఒక కమ్యూనిస్టు పార్టీని స్థాపించుకోవటమైంది. ఆ పార్టీ దృక్పథంలో దేశాన్ని అర్ధవలస, అర్ధ భూస్వామ్యంగా గుర్తించి ఫ్యూడలిజాన్ని ఒక ప్రధానమైన వైరుధ్యంగా తీసుకుని ఫ్యూడలిజాన్ని వ్యతిరేకిస్తూ, ఫ్యూడలిజానికి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకమైన శక్తులు చరిత్ర నిర్మించే శక్తులుగా, చోదక శక్తులుగా బీద రైతులు, వ్యవసాయ కూలీలుగా గ్రహించి కొంత కార్యక్రమాన్ని రూపొందించడం జరిగినది. ఆ దృక్పథంతో ఆర్థిక సంబంధాలలో మార్పును ప్రధానంగా సామ్రాజ్యవాద సహాయంతో దళారి బూర్జువా వర్గం చేపట్టుతుందని, అటువంటి మార్పులకు ఫ్యూడలిజం ఒక సామాజిక మూలం ఇస్తుందని ఒక అవగాహన. ఈ అవగాహనతో మనకు అప్పటివరకు చరిత్ర మీద, చరిత్రలో జరిగిన సాంఘిక సంస్కరణ ఉద్యమాలమీద ఎన్నో ప్రశ్నలు వచ్చాయి. అలాగే శ్రామిక వర్గం మీద, దానిమీద ఆధిపత్యం వహించిన ట్రేడ్ యూనియన్ మీద ఎన్నో ప్రశ్నలు వచ్చాయి. భాష, సాహిత్యం మీద వచ్చాయి. కళ, ప్రజాకళల మీద వచ్చాయి. రాజ్యాధికారం, దాన్ని ఎదుర్కొనే పద్ధతులు, రూపాలమీద వచ్చాయి. కులం మీద వచ్చాయి. మతం మీద వచ్చాయి.

ఈ ప్రశ్నలకి సమాధానం సైద్ధాంతికంగా చూడాలని కొంతమంది అకడమిక్ పండితులే కాకుండా మిగిలిన మేధావులు కూడా చూడటానికి ప్రయత్నించారు. ఒక

రకంగా చూస్తే ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ, ఫ్రాంటియర్ లాంటి ఇంగ్లీషు పత్రికలలో ఇటువంటి సైద్ధాంతిక చర్చ బాగానే జరిగింది. అది ఉత్పత్తి విధానంపై చర్చ లాగా దళారీ బూర్జువా మీద, జాతి మీద, కులం మీద ఇలా ఎన్నో చర్చలు జరిగాయి, జరుగుతూనే ఉన్నాయి. కాని సైద్ధాంతిక చర్చల ద్వారానే నిజానిజాలు సమాజం మీదే కాదు కదా, ప్రకృతి మీద కూడా తెలుసుకోవటం జరుగదు గదా! సిద్ధాంత జ్ఞానం పెరగాలంటే ఒక ఆచరణ కావాలి. ఆచరణలోనే సిద్ధాంతంలోని లోతుపాతులు తెలుస్తాయి. ఇది గ్రహించటానికి మహానుభావులు మార్క్సుని, మావోని బోసు ఎక్కించనక్కరలేదు సాక్ష్యం చెప్పమని.

ఇది గ్రహించిన మేధావులు గ్రామాలకి తరలివెళ్ళారు. గ్రామాలను, గ్రామాలలోని వైరుధ్యాలను అధ్యయనం చేసి ప్రజాబాణీలో ఓ పాట వ్రాసారు. ఒక కథ వ్రాసారు. ఒక నవల వ్రాసారు. అది వ్రాయటానికి కావలసిన స్థానిక చరిత్రని ప్రజలపరంగా అర్థం చేసుకున్నారు. పారంపర్యంగా బానిసలుగా బ్రతుకుతున్న ప్రజల వెట్టిచాకిరి పరిస్థితులని అర్థం చేసుకుని, ఆ పరిస్థితులని ఎదిరించే కొత్త పరిస్థితులని కల్పించారు. ఆ గ్రామాల మధ్యలో ఉండే గనులు, గని కార్మికులను కూడా అర్థం చేసుకుని తమలో కలుపుకోవటానికి కూడా ప్రయత్నం చేసారు. అక్కడా ఇక్కడా కూలీరేట్లు పెంచారు. దానికి కావలసిన ప్రజలను సంఘటితం చేసారు. బంజరు భూములు, ప్రభుత్వ భూములు ఉంటే వాటిని పేద ప్రజలు పంట భూములుగా మార్చుకోవచ్చుననే పరిస్థితులు-కల్పించారు. ఆ క్రమంలో కరువు వస్తే కరువు నెదుర్కొనే పరిస్థితులు కల్పించారు. ఇలా ఇంకెన్నో ఆచరణలో సాధిస్తూ, సైద్ధాంతికంగా కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పారు. సిద్ధాంతపరంగా ఫ్యూడలిజమే ఉందా లేదా, ఫ్యూడలిజం ఉంటే అది ఒక అవశేషమా అన్న ప్రశ్నలకు సమాధానం మనం ఆచరణలో చెప్పగలం కాని చర్చల ద్వారా చెప్పలేమనే అవగాహనని మన ముందు ఉంచింది. నిన్న, మొన్నటి వరకూ కొత్త ధనిక రైతాంగంగా కనిపిస్తూ మభ్యపెట్టిన వాళ్ళు, ఎంత కొత్త ఆధునిక పెట్టుబడిదారీ సామగ్రిని ముందు చూపినా, వాళ్ళది చాలా పాత భావజాలమని ఆచరణ ద్వారా తెలిసింది. నీడలో ఉండే పేద రైతులూ, వ్యవసాయ కూలీలలో కదలిక లేనంత కాలం, వాళ్ళ ఆచరణ పూరనంత కాలం ఆ సామగ్రి- ట్రాక్టర్ అవవచ్చు, టీ.వి. అవవచ్చు- కొత్త ఉత్పత్తి శక్తులనే భ్రమ కల్పించవచ్చును. కానీ కదలిక మొదలయిన తరు

పాత, ఆచరణలో మార్పు వచ్చిన తరువాత, ఆ వర్గం తన స్వభావాన్ని, పునాదులని చూపించకపోలేదు. అలాగే రాజ్యాధికారాన్ని ప్రజల అవసరాల కోసం ఉపయోగపడేలా చేయాలంటే ఒక పార్లమెంటరీ విధానంలో ఎమ్మెల్యే గానో, ఎమ్.పి. గానో వెళ్ళవలసిన అవసరం కూడా లేదు అని ఒక 20 ఏండ్ల ఆచరణ మీద ముందు పెట్టింది. పార్లమెంటరీ వ్యవస్థ మీద చర్చలో గ్రహించగలిగేది కాదు ఈ విషయం.

ఆచరణ అంటే ఒక సంఘర్షణ. ఒక చైతన్యవంతమైన సంఘర్షణ. అది ఏ ఆచరణ అయినా సంఘర్షణే, సాంఘిక సంబంధాల ఆచరణ అయినా, ప్రకృతిమీద అయినా. ఆచరణద్వారా, దాదాపుగా ఉండే జ్ఞానం ఇంకొంచెం మెరుగుపడుతుంది. జ్ఞానంలో ఉండే తప్పులను సరిదిద్దుకుంటాం; అందుచేత ఆచరణ ప్రశ్నలని మారుస్తుంది. ప్రమాణాలని మారుస్తుంది. కొత్త ప్రశ్నలను వేస్తుంది. ప్రశ్నలను నిశితం చేస్తుంది. ఇదే ఉద్దేశంతో బాలగోపాల్ పుస్తకానికి ముందు మాట వ్రాయమంటే—

"పోరాటాలు కొత్త సమాచారాన్ని రూపొందిస్తాయి, పాత సమాచారాన్ని కొత్తగా అంచనా కడతాయి. ఎందువల్లనంటే, పోరాటం సమాజంలో ఉన్న వైరుధ్యాలలో వ్యతిరేక అంశాన్ని ముందుకు తెస్తుంది. అన్ని సమాజాలలోనూ వైరుధ్యాలు ఉన్నప్పటికీ, పోరాట సమయంలో మాత్రమే, వైరుధ్యంలోని వ్యతిరేక అంశం ముందుకువచ్చి, ఐక్యతను తోసివేస్తుంది. వైరుధ్యాన్ని అణచివేయబడిన పక్షపు ప్రాపంచిక దృక్పథం వైపునుంచి పరిష్కరించే దిశగా పోరాటం పయనిస్తుంది. అందువల్ల కొత్త సమాచారం రూపొందుతుంది. ఉన్న సమాచారానికి కొత్త అంచనా జరుగుతుంది".

అని వ్రాయటం జరిగింది. ఇది గ్రహించకపోతే పెట్టుబడి పెట్టే మాయాజాలం లోంచి బయటపడటం చాలా కష్టం. ఏ మాయాజాలమైన ఏమి చేస్తుందంటే మానవశ్రమని కేంద్రంనుంచి తీసేసి శ్రమద్వారా వచ్చిన వస్తువులను - అవి ఒక దేముడవవచ్చు, ఒక సరుకు అవవచ్చు, సరుకుద్వారా వచ్చే డబ్బు, తద్వారా వచ్చిన పెట్టుబడిని, ఇత్యాది వస్తువులను - కేంద్రంగా చేస్తుంది. ఆ చెయ్యడంలో ప్రశ్నలు మార్చివేస్తుంది. ఆచరణని గుర్తించకపోతే, ఈ ఆచరణ ద్వారా జరిగే సాంఘిక విశ్లేషణ మనకు కన్పించదు. అవి యేవో ఇతరత్రాలాగా కనిపిస్తుంది.

ఈ వ్యాసంలో హీరాకుడ్, భోపాల్, కారంచేడు, విజయవాడలను ప్రస్తావిస్తూ —

"దేనికదే స్వతంత్రమైనదిగా కనిపించే ఈ ఘటనలలో ఏది అభివృద్ధి, ఏది కాదు, ఏది అభివృద్ధి ఫలితం, ఏది కాదు, ఏది వెలుగు, ఏది నీడ"

అనే ప్రశ్నలు లేవనెత్తితే, సృజన సమీక్ష ఆ ప్రశ్నలను మార్చివేసింది.

"ఇవి అన్నీ అభివృద్ధి క్రమంనుంచి వచ్చినవే. ఏమిటి ఈ అభివృద్ధి క్రమం అన్న ప్రశ్నకు జవాబు చెప్పుకోవాలంటే వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో '47 తరువాత పరిణామాలను స్థూలంగానైనా అర్థం చేసుకుంటే జవాబు దొరుకుతుంది" అని "మనకి కావలసినదల్లా ఏమిటంటే వ్యవసాయ రంగంలోనూ పారిశ్రామిక రంగంలోనూ ఈ పెరుగుదల ఎట్లా సాధించారు ? ఈ పెరుగుదల, అభివృద్ధికి స్వభావం ఏమిటి ? వీటి ఫలితాలు ఏ వర్గాల ప్రజలకి అందాయి ?" ఇత్యాది ప్రశ్నలు వేసారు.

వ్యాసం '47 ముందుకాని '47 తరువాత కాని జరిగిన మార్పులను భారత సాంఘిక వ్యవస్థలో అభివృద్ధిగా పరిగణించలేదు. దాన్ని వాపుగానే గ్రహించింది కాని బలంగా గ్రహించలేదు. సమీక్ష మాత్రం మార్పులను అభివృద్ధిగా తీసుకుని స్వక్రమాన్ని విశ్లేషించాల్సిన అవసరాన్ని ముందు ఉంచుతోంది. అటువంటి విశ్లేషణ తెలుగులో జరుగలేదనీ, "ఈ ధోరణులకి భిన్నంగా ప్రభుత్వ జోక్యంలోనూ, ఇతరత్రానూ వస్తున్న మార్పుల గురించి రాజకీయార్థిక విశ్లేషణ నివ్వటం తెలుగులో ఇటీవలే ప్రారంభమైంది." అన్నారు. నాకు తెలిసినంతవరకూ ఇవన్నీ '70లకు ముందు వచ్చిన ప్రశ్నలు. ఆ ప్రశ్నలకి సమాధానం వచ్చిందా అంటే ఉరమరగా వచ్చిందనే చెప్పాలి. సమాజాన్ని అర్ధవలస, అర్ధ భూస్వామ్యంగా తీసుకున్న విశ్లేషణలో ఆ ప్రశ్నలకి దాదాపు సమాధానాలు ఉన్నాయి. (సైద్ధాంతికంగా అంతకంటె విశ్లేషణ రాదు. ఎందుకంటె ఏ క్రమమైనా గతితార్కిక క్రమం కాబట్టి.) తరువాత చర్చ ఆచరణమీద ఉంటుంది. అందువలననే మనకు ఫ్యూడలిజమ్ ఎక్కడ ఉంది అన్నప్రశ్న ప్రస్తుతం తరుచు వినబడదు. మన గ్రామంలో ఉన్న భూస్వాములెవరు అని చూస్తారు. దళారీ బూర్జువా ఉందా లేదా అని అడగరు. ఎవరు ఎంతడబ్బు తీసుకుని ఏ బహుళజాతి సంస్థల్ని దేశంలోకి

ప్రవేశం కల్పిస్తున్నారూ అని అడుగుతారు. ఏ ప్రాతిపాదికమీద ఈ సమీకరణ జరుగుతుంది అని అడుగుతారు.

అభివృద్ధిమీద సృజన సమీక్ష ప్రశ్నలని మార్చలేదు. పాత ప్రశ్నలే వేసింది. అది కొంచెం నిస్పృహని కలిగించింది. మారుతున్న ప్రమాణాలు, ప్రశ్నలను కేంద్రంగా తీసుకుని అభివృద్ధిని కొత్తగా అర్థం చేసుకోవటం కోసం వ్రాసింది ఆ వ్యాసం.

× × ×

ఇక ప్రమాణాలెందుకు మారాలి, మారవలసిన అగత్యం గురించి, సందర్భం గురించి, చరిత్రలో పెట్టుబడి ఒక విప్లవం తీసుకుని వచ్చి కొత్త ప్రమాణాలు ఏర్పరచింది. రాజకీయంగా సమానత్వం స్వేచ్ఛ సౌభ్రాతృత్వం ప్రతిపాదించింది. ఆర్థికంగా సరుకుని ప్రవేశపెట్టింది. సాంస్కృతికంగా వ్యక్తి భావాన్ని ముందుకు తీసుకుని వచ్చింది. ఆర్థిక రంగానికి సంబంధించి సాంఘిక సంబంధాలని మార్చుతూ తనికి 2 లేక 3 వందల యేండ్లకాలంలో ప్రమాణాలను అలా మారుస్తూపోయింది. అందులో ముఖ్యంగా మూడు మార్పులను మూడు దశలలో చేసింది. అవి ప్రధానంగా ఉత్పత్తిని సరుకుల రూపంలో చేయటం, అలా చేయటం ద్వారా శ్రమశక్తిని ఒక సరుకుగా తయారుచేయటం రెండవది మనిమట్టుని ఒక యంత్రంగా మార్చి శ్రమశక్తికి ఉండే నైపుణ్యతని యంత్రంలో ఇమడ్చటం. ఇంక మూడవ దశ సరుకుల జాబితాని మార్చటం. ఈ మార్పులనే ప్రమాణాలుగా పెడుతుంది. పెట్టుబడి ఆయా దశలలో, అందుకే పెట్టుబడిని కొలిచే ప్రమాణాలు అభివృద్ధి ప్రమాణాలుగా కనిపిస్తాయి. అలా ప్రచారం కూడ చేయబడుతుంది. మూడవదశలో పెట్టుబడి వ్యూహంలోకి చేరుకున్న మనలాంటి దేశాలు సరుకుల జాబితాని గురించి చాలావరకూ చర్చిస్తాయి. ఇన్ని వేల టన్నుల ధాన్యం. ఇన్ని వేల మెగావాట్ల పవరూ ఇన్ని వేల కార్లు, ఇన్ని వేల కంప్యూటర్లు, ఇవి మనకి ప్రతిరోజూ వార్తా పత్రికలోనూ కనిపిస్తాయి, రేడియోలోనూ వినిపిస్తాయి ప్రకటనల ద్వారా. ఇకపోతే దినపత్రికల్లో ఉండే వ్యాసాలు కొంచెం సీరియస్‌గా ఎన్ని ఫాక్టరీలు వచ్చాయి, ఇంకా ఎన్ని కావాలి, ఎంత ఆధునీకరణ జరుగుతోంది అని ఒక కన్

పేపర్ బెల్టు గురించి, ఒక కంప్యూటర్ గురించి, అది మనదేశంలో ఎక్కడ ఎలాంటి అద్భుతం చేస్తోంది అని. ఇంకొంచెం సీరియస్ జరిగే చర్చ శ్రమశక్తి సరుకైనా లేదా, ఎంతమంది శ్రామికులు ఉన్నారు ? వారి సంఖ్య పెరుగుతోందా లేదా అనే విషయాలమీద.

ఇలా చూడటంలో పెట్టుబడి ప్రమాణాలతోనే చూడటం అవుతుంది కాని పెట్టుబడికి ప్రమాణం దొరకదు. పెట్టుబడి ఒక చారిత్రిక దశ, మానవ చరిత్ర పెట్టుబడిని దాటి ముందుకు వెడుతుంది అన్నపుడే పెట్టుబడికి ప్రమాణాలు వెతుకుతాం. పెట్టుబడికి ప్రమాణంగా వ్యాసం ప్రాపంచిక దృక్పథాన్ని ప్రతిపాదించింది. అలా చూడటంలో పెట్టుబడికి చారిత్రికంగా గల పురోభివృద్ధి అంశాన్ని వేరు చేయడం, అభివృద్ధిని అభివృద్ధి పథకాల నుండి పెట్టుబడి రూపాల నుండి వేరుచేసి చూడాలన్న విషయం వ్యాసం ప్రతిపాదించింది.

మన దేశంలో అభివృద్ధి క్రింద చలామణి అవుతున్న క్రమం సామ్రాజ్యవాద అధ్వర్యంలో పెట్టుబడిదారీ క్రమంలో జరిగే మార్పు. ఈ మార్పులో పెట్టుబడి కనిపిస్తుంది. పెట్టుబడికి సామ్రాజ్యవాద దశలో ఉండే లక్షణాలు కనిపిస్తాయి. కాని దాని పూర్వదశలో ఉండే లక్షణాలు కనిపించవు. అందులో ముఖ్యమైనది భూస్వామ్య వ్యతిరేకత. ఈ వ్యతిరేకత కారణంగా సమాజాన్ని తిరగతోడే పునర్ నిర్మాణం జరుగుతుంది. అదే ఒక విప్లవం. అంతవరకూ వ్యవసాయరంగం అధిపత్యంలో ఉన్న వ్యక్తులు చేనేత, కమ్మరులు, వడ్రంగులు, కుమ్మరులు (మనం ఏవైతే ఒ.బి.సి అంటామో అవి) స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించి వ్యవసాయం కంటే పెద్దవిగా సమాజ నిర్మాణంలో భాగం అయ్యాయి ఈ క్రమంలో శ్రమ విభజనతోపాటు, శ్రమ మీద గౌరవం, శ్రమ సమాజానికి పునాది అనే అంశాన్ని అస్పష్టంగానయినా ముందుకు తెచ్చింది. (చెప్పులు కుట్టడం, చెప్పుల పాలిష్ చెయ్యటం ఒక గౌరవమైన స్థితి అన్నమాట.) అలా తీసుకు రావటంలో సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే భావన ముందుకు వస్తుంది. ఈ పూర్వరంగంలో వచ్చినవే ఫ్రాన్స్, ఇంగ్లండు విప్లవాలు. ఈ దశని మార్క్స్ శ్రమశక్తిలో విప్లవం అంటాడు. ఈ దశలో మనకు భావజాలంలో సరుకుల పూజ కనిపిస్తుంది. సరుకుల ద్వారా విలువలని కొలుచుకునే సమాజంలో, సరుకులే విలువలని అనుకుని, సంపదలనుకుని, వాటినే

ఆరాధించే స్థితి. ఒక వికృత రూపంలో 'యజ్ఞం' కథలో అప్పల్రాముడు వర్ణించిన స్థితి అది. వికృత పరిస్థితి అని ఎందుకన్నామంటే సరుకుల మాయలో భ్రాములు పోగొట్టుకున్న అప్పల్రాముడిని కాని, అతని కొడుకుని కాని, మనుమడిని కాని ఇంగ్లండులో లాగా కొట్టో, దెబ్బలాడో, జైల్లో పెట్టో ఒక పారిశ్రామిక కార్మికుడిగా మన దేశంలో మన దేశపు పారిశ్రామిక వేత్తలు మార్చి అధిక విలువలని సంపాదించలేకపోయారు. ఒక కంబారి లాగానో, నిరుద్యోగిగానో ఉంచగలదు ఈ సమాజం. అదే వికృతం.

ఇంక రెండో దశ ఉత్పత్తి సాధనాలలో మార్పుతో కొనసాగుతుంది. మార్క్స్ దీన్ని ఉత్పత్తి సాధనాల్లో విప్లవం అంటాడు. ఈ దశలో శ్రామికుడికి ఉండే పనితనం అంతా మారిన ఉత్పత్తి సాధనాల్లో చేర్చబడుతుంది. ఒక కమ్మరి పని చూసి ఒక స్టీల్ ఫ్యాక్టరీ చూస్తే తెలుస్తుంది కమ్మరికుండే పనితనమంతా యంత్రాలలో ఎలా పొదగబడిందీ అని. ఫ్యాక్టరీలో శ్రామికుడు ఒక అంగంగానూ, యంత్రానికి ఒక అనుబంధంగానూ ఉంటాడు. ఈ దశలో ప్రవేశించిన దేశాలు - ముఖ్యంగా జర్మనీ, జపాను లాంటి దేశాలు టెక్నికల్‌గా చాలా ముందు ఉంటాయి. కాని ప్రథమ దశలో ఉన్నటువంటి బూర్జువా సామాజిక విలువలు కొంత కొరవ అవుతాయి. తత్ఫలితంగా అప్పుడప్పుడు కనిపించే ఫాసిస్ట్ కళలు ఇక్కడ ఎక్కువగా ఉంటాయి. భావజాలంలో సరుకుల మాయలే కాకుండా పెట్టుబడి మాయకూడా ఉంటుంది. యంత్రమే అంతాను, ఆ యంత్రం యజమానే అంతాను అనే భావన ముందుకు వచ్చి శ్రమ, శ్రామికుడు అనే అంశాలు వెనుకకు పోతాయి. యంత్రాన్ని నడపగలిగితే తను మనిషి, లేకపోతే కాదు. యంత్రం తన మూలాన్ని మరుగు పరచి, తన వలనే శ్రమకి విలువ వస్తుంది అనే భావజాలాన్ని తెస్తుంది. ఉత్పత్తి, ఉత్పాదక శక్తి మనిషి నుండి యంత్రానికి చేరుతాయి. అందుచేతే ఈ భావజాలంలో భాగంగానే ట్రాక్టర్, పంప్‌సెట్ పెడితేనే ఉత్పత్తి పెరుగుతుందని, ఆ ట్రాక్టర్‌కి, పంప్‌సెట్‌కి పూజ చేస్తారు. అక్కినేని కుటుంబరావు వ్రాసిన 'కార్మికగీతం' నవలలో ఈ విషయం బాగానే గుర్తించాడు. మనదేశపు వికృతాలలో ఉండే విషయమేమిటంటే ఏ జ్ఞానం మీద ఆధారపడి యంత్రాలు తయారు చెయ్యవచ్చో అటువంటి సాంకేతిక విజ్ఞానం ఉన్న శాస్త్రవేత్తలు వేలమందిలో నిరుద్యోగులుగానూ మన పెట్టుబడి ఉంచుతుంది. అంతవరకూ అప్పల్రాముడి పరిస్థితే దానిది. లేకపోతే అమెరికాకో,

ఇంగ్లాండుకో పంపి అక్కడ యంత్రాలు తయారుచేసే కార్మికులుగా తయారుచేస్తుంది కాని తనే వాళ్ళని శ్రామికులుగా ఉపయోగించుకుని ఎక్కువ మిగులుని సంపాదించి తన స్వంత యంత్రాలని తయారు చేసుకోలేదు.

ఇంక మూడవ దశ. దీన్ని సామ్రాజ్యవాద దశ అని అందరూ గుర్తిస్తారు. ఇందులో ప్రస్తుతం మనకి ముఖ్యమైనది పెట్టుబడి సరుకుగా మారిపోవటం. పెట్టుబడి సరుకు రూపం తీసుకుంది అంటే దానిని డబ్బుగానే చూస్తాం. ఈ దశలో పెట్టుబడికి ఉత్పత్తి రూపం కంటె చలామణి రూపానికి ప్రాధాన్యం వస్తుంది. (ఈ మధ్య చిన్న పట్టణాల వరకూ వ్యాపించిన వార్త ధీరూభాయ్ అంబానీ అమ్మిన రిలయన్స్ షేర్లు, రిలయన్స్ ఏయే సరుకు ఉత్పత్తి చేస్తుంది, ఎలా ఉత్పత్తి చేస్తోంది, ఎంతమందికి ఉద్యోగం ఇస్తుంది, ఏ దేశపు టెక్నాలజీ పెట్టి ఉత్పత్తి చేస్తోంది అనే సమాచారం కాని జ్ఞానం కాని ఆ షేర్లు కొనటానికి ముఖ్యం కాదు. అంబానీకి ప్రభుత్వంతో సంబంధం ఉందనీ, ఆ సంబంధంతో ఎక్కువగా లాభాలు సంపాదిస్తాడనీ, డివిడెండ్లు (లాభాలు) ఎక్కువ ఇస్తాడనీ, 100 రూ॥ ఒక సంవత్సరంలో 200 రూ॥లు అయిపోతుందని ఎగబడి ఆ షేర్లు కొనడం మొదలు పెట్టారు) చలామణి సాధనాలయిన బ్యాంకుల ప్రాముఖ్యం పెరుగుతుంది. డబ్బు దానంతటదే పెరుగుతుందన్న భావన కలుగుతుంది. ఈ భావననే వడ్డీ మాయా అని మార్క్స్ అంటాడు. ఇక్కడ గమనించాల్సిన విషయం మనలాంటి దేశాలకి ఉపయోగపడేది ఒకటుంది. ఎందుకంటె మనలాంటి దేశాలు పెట్టుబడికి ఈ దశలోనే చేరాయి. భూస్వామ్య వ్యవస్థలో కూడా వడ్డీ వ్యాపారులుంటారు. వాళ్ళు ఉత్పత్తికి సంబంధం లేకుండానే వ్యాపారం చేసి డబ్బులు సంపాదిస్తారు. వాళ్ళ ప్రామిసరీ నోట్లు - ఏ నోట్లు పెట్టుబడిదారీ వ్యవస్థలో బ్యాంకు నోట్లు (కరెన్సీ) గా మారిపోయాయో - వాటి మీద, వాటితోటి వ్యాపారం చేస్తారు ఈ వడ్డీ వ్యాపారులు భూస్వామ్య రాజ్యాంగానికి దగ్గరగా కూడా ఉంటారు. మన దేశంలో పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలుగా మనబడుతున్న పారిశ్రామిక వేత్తలంతా ఇలా వ్యాపారం, వడ్డీ వ్యాపారం నుంచి తిన్నగా పారిశ్రామిక వేత్తలయిన వాళ్ళే. వాళ్ళకి, పెట్టుబడిని సరుకుగా అమ్మేవాళ్ళకి ఒక స్థాయిలో సారూప్యత ఉంది, ఒక ఐక్యత ఉంది. పెట్టుబడిని సరుకుగా కొనటానికి ఈ వడ్డీ వ్యాపారస్తులకు, జమీందారులకు, మహారాజులకు సంఘర్షణ మౌలికంగా ఏమీ లేదు. కొంత డబ్బు కావాలంతే. ఆ సరుకుల తయారీ ఎలా అయింది, ఎలా

చెయ్యగలం అనే సంఘర్షణ అనవసరం. వాళ్ళుకొనే మిగిలిన సరుకుల జాబితాలో పెట్టుబడి కూడా చేరవచ్చు. (ఈ మధ్య పత్రికలలో గల్ఫ్ దేశాల నుంచి వచ్చే షేకులు బొంబాయి వచ్చి సరుకులు కొనుక్కుపోతున్నారని వాళ్ళ మీద చాలా జోకులు కూడా చదువుతూ ఉంటాం. కాని మన పారిశ్రామిక వేత్తలు, మంత్రులు అమెరికా యాత్రలు, జపాను యాత్రలు చేసినపుడు అక్కడ పేపర్లు ఎలా నవ్వుకుంటాయో మన పేపర్లు చెప్పవు.) ఇటువంటి పెట్టుబడిదారునే మనం దళారీ బూర్జువా అంటాం. పెట్టుబడిని ఒక ఉత్పత్తి శక్తిగా కాక, ఒక సాంఘిక సంబంధంగా కాక, ఒక వస్తువుగా ఒక సరుకుగా చూసి కొనుగోలు చేసే పెట్టుబడిదారు, పెట్టుబడిని ఉత్పత్తి చేయడం అనే అంశాన్ని, తద్వారా వచ్చే సాంఘిక కార్యక్రమాన్ని చేపట్టవలసిన అవసరం లేదు. కాని సరుకుగా వచ్చిన పెట్టుబడికి ఉపయోగపు విలువ, మారకపు విలువ ఉండాలి కదా! పెట్టుబడికి ఉపయోగపు విలువ అంటే అది అదనపు విలువని ఉత్పత్తి చేయటం. ఆ చేయటానికి శ్రమ శక్తిని ఉపయోగించవలసిన అవసరం ఉంది. ఆ శ్రమ శక్తి కోసం శ్రామికుడిని తయారు చేయవలసిన అవసరం ఉంది. అందుకే దళారీ బూర్జువా కోరుకున్నా లేకపోయినా, శ్రామికులు కావలసి వస్తారు. ఉత్పత్తిని సరుకుగా అమ్మవలసిన అవసరం ఉంది. అమ్మకపోతే సరుకుగా ఉన్న పెట్టుబడికి మారకపు విలువ ఉండదు. ఆ మారకపు విలువలో కొంత భాగాన్ని తిరిగి పెట్టుబడిని అమ్మే సరుకుదారునకు, సరుకుదారు బాంకుకు, సరుకుదారు దేశానికి తరలించటం జరగటం మీద ఆధారపడుతుంది. ఆ తరలించటం మీద జరిగే హామీమీద హామీకిగల రాజకీయ మద్దతుమీద ఆధారపడుతుంది. అంటే సరుకుగా పెట్టుబడిని చూసే మన దళారీ పెట్టుబడిదారు రాజకీయ మద్దతు కూడా కల్పించాల్సిన అవసరం ఉంది. పెట్టుబడిని ఉత్పత్తి శక్తిగా చూడని పెట్టుబడిదారు ప్రజలే ఉత్పత్తి శక్తులని గ్రహించటం జరుగదు. శ్రమశక్తే విలువలకి మూలమని, శ్రమశక్తే యంత్రాలని తయారు చేస్తుందని, అలా జరుగటానికి కావలసిన రాజ్యాంగాన్ని, ఉపరితలాన్ని తయారు చేయవలసినదని గ్రహించటం జరుగదు. ఉన్నంత లోపల పాత ఉపరితలాన్ని ఉపయోగించుకోవటం జరుగుతుంది. ఇది సామ్రాజ్యవాదానికి, భూస్వామ్యానికి ఐక్యతని ఇంకొంచెం బలపరుస్తుంది. పెట్టుబడి ఎంత పెరిగితే భూస్వామ్య భావజాలం అంత కావలసి వస్తుంది.

ఈ చట్రంలో పెట్టుబడి కనిపిస్తుంది. సరుకులు కనిపిస్తాయి. శ్రమ శక్తి

సరుకుగా కనిపిస్తుంది. పునరుత్పత్తిగా కనిపించే పెట్టుబడి పెరుగుదల కూడ కన్పిస్తుంది. సరుకుల జాబితా అలా పెరిగిపోతూ ఉంటుంది. అవే ప్రమాణాలుగా కనిపిస్తాయి అభివృద్ధికి. కాని ఉత్పత్తి శక్తుల పెరుగుదల పెట్టుబడి ఆధ్వర్యంలో కనిపించదు. అందుకే ఒక స్టీల్ ఫ్యాక్టరీ ఉన్నా మరో స్టీల్ ఫ్యాక్టరీ కోసం రష్యాకో, మరెక్కడికో వెళ్ళాల్సి వస్తుంది. ఒక కారుల ఫ్యాక్టరీ ఉన్నా మరో కారుల ఫ్యాక్టరీకి మరోచోటికి వెళ్ళాల్సి వస్తుంది. ఒక స్కూటర్ ఫ్యాక్టరీ ఉన్నా మరో స్కూటర్ ఫ్యాక్టరీ కోసం ఇంకో దేశానికి వెళ్ళాల్సి వస్తుంది. ఇది పెట్టుబడిని సరుకుగా చూడటం వలన వచ్చే పరిస్థితి.

సృజనలో సమీక్ష ఈ విషయాన్ని సరిగ్గా ముందుకు తీసుకుని రాలేదు. కొంచెం తప్పుదారి పట్టించిందేమో కూడా. సమీక్షలో "అభివృద్ధి" రెండు రకాల చిత్రాలని చిత్రించటం జరిగిందని అన్నారు. ఒకవైపు చిత్రం మార్కెట్టులో 30 రకాల ద్విచక్ర వాహనాలు, 50 రకాల టీ.వీ.లు, ప్రతి పట్టణంలోనూ అత్యాధునిక ఆసుపత్రులు, ఇంక రెండోవేపు చిత్రం గ్రామాలలో రోడ్లు, రవాణా సౌకర్యాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు లేకపోవటం గురించి, మధ్యతరహా నీటి ప్రాజెక్టులు కట్టడానికి ఉక్కు, సిమెంటు లేకపోవటం. ఈ వైరుధ్యం సరుకులో ఉండే వైరుధ్యం. సరుకుల ప్రపంచంలో ఉండే వైరుధ్యం. ఇటువంటి వైరుధ్యం పెట్టుబడిదారీ దేశాలుగా పేరెక్కిన అమెరికా, ఇంగ్లాండు, జపాను వంటి దేశాలలో కూడా ఉంటుంది. అది సరుకుల సమస్య. అది పెట్టుబడిదారీ అభివృద్ధిలో భాగమే కాని మనం మన అభివృద్ధిని విశ్లేషించినపుడు పెట్టుబడిని సరుకుగాకాక ఉత్పత్తి శక్తిగా చూడవలసిన అవసరం గురించి పైన చెప్పడం అయినది. ఉత్పత్తి శక్తిగా చూసినపుడు ప్రశ్నలు ఒక ద్విచక్ర వాహనం ఉత్పత్తి చేయగల ఫ్యాక్టరీ ఉన్నపుడు ఇంకొక 30 ద్విచక్ర వాహనాలు తయారుచేసే ఫ్యాక్టరీల కోసం ఇటలీ, జపానులకు వెళ్ళవలసిన అవసరం ఏమిటి? ఒక టీవీ తయారుచేయగల నైపుణ్యంగల శ్రామిక శక్తి ఉన్నపుడు ఇంకొక 50 రకాల టీవీలు తయారు చేయటానికి విదేశాలకి వెళ్ళే అవసరం ఎందుకు కలుగుతోంది అనే ప్రశ్నలు వస్తాయి. "అభివృద్ధి"ని ఉత్పత్తి శక్తుల కేంద్రంగా చూడవలసిన పరిస్థితిని వ్యాసం ప్రతిపాదించింది.

ప్రజలే ఉత్పత్తి శక్తులు అని గ్రహించలేక పోవటం వలన ఉత్పత్తి శక్తుల ప్రతీక అయిన టెక్నాలజీ కోసం విదేశాలకు వెళ్ళవలసి వస్తుంది. ఎన్నో వేలమంది

ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు ఉంటున్న భారతదేశంలో దళారీ బూర్జువా వర్గం తన సొంత భారతీయ టెక్నాలజీ అనేది ఇంతవరకూ తయారు చేయలేకపోయింది. శ్రమ శక్తిని సరుకుగా, సరుకుని సంపదకు మూలం అని గ్రహించని స్థితిలోనే శ్రమశక్తి దారుడికి దారుణమైన నిరుద్యోగం గ్రామాల్లో, పట్టణాల్లో. ఈ పరిస్థితిలో బ్రిటిష్ వారి కాలం నుంచి ఇప్పటివరకూ జరిగిన ఒక్కొక్క మార్పు- అది భూకమతాల నిర్ధారణ అవవచ్చు, అటవీ చట్టాలు అవవచ్చు, వ్యాపారీకరణ అవవచ్చు, బట్టల మిల్లులు అవవచ్చు, ఆనకట్టలు కట్టడం అవవచ్చు, ఫ్యాక్టరీలు కట్టడం అవవచ్చు- ఒక రకంగా సరుకుల జాబితాని పెంచి వెలుగులా కనిపించినా, మరొకవైపు గ్రామాలలో పేద రైతులు, రైతు కూలీలు అసంఖ్యాకంగా పెరిగిపోయారు. అదే ఈ క్రమం తీసుకుని వచ్చిన చీకటి. డాముల నుంచి, ఫ్యాక్టరీల నుంచి చూస్తే వాళ్ళు ఎందుకూ పనికిరాని వాళ్ళు. అనాగరికులైన, నిరక్షరాస్యులైన ప్రజలు. చరిత్రలో ఒక భాగంగా చూస్తే అటు భూస్వామ్యం, దాని భావజాలం ద్వారా దోపిడి చేయబడిన వాళ్ళు, ఇటు పెట్టుబడిదారీ క్రమం నుండి బయటకి తరిమివేయబడ్డ వాళ్ళు. ఆ చీకటిలో వెలుగువస్తే, ఆ చీకటిలో అలజడి లేస్తే, ఆ చీకటిలో భూస్వామ్య వ్యతిరేకత సంఘర్షిస్తే ప్రశ్నలు ఎన్నో కొత్తవి వస్తాయి. డాము అంటే అభివృద్ధా, అభివృద్ధి ప్రతీకా, ఫ్యాక్టరీ అంటే అభివృద్ధా అభివృద్ధికి ప్రతీకా అనే ప్రశ్నలు ముందుకు వస్తాయి. ఈ ప్రశ్నలకి సమాధానం వెతుక్కోవలసి వస్తుంది ఆచరణలో. అదే అభివృద్ధి. పెట్టుబడి వేసే ప్రశ్నల నుంచి పెట్టుబడికి వేసే ప్రశ్నలు, పెట్టుబడి చెయ్యలేని పనుల మీద ప్రశ్నలూ, పెట్టుబడి గొడుగులో తల దాచుకుంటున్న భూస్వామ్యం మీద ప్రశ్నలు, పెట్టుబడికి, భూస్వామ్యానికి ఉన్న అక్రమ సంబంధం మీద ప్రశ్నలు. ఇలా కొత్త ప్రశ్నలు రావటం ఒక కొత్త ప్రాపంచిక దృక్పథానికి నాందీ సూచకాలు. వ్యాసం ఈ విషయాన్ని ప్రస్తావించింది. సమీక్షకులు చాలా వరకు ఈ విషయాన్ని గుర్తించలేదు. ఇది వ్యాసంలోని పెద్ద కొరత.

× × ×

'సింగరేణి బతుకులు' సమీక్ష :

అతని కథలకు చావులేదు

పి. లీలావతి

చెన్నారెడ్డి ప్రభుత్వం గత సంవత్సరం అధికారంలోకి వచ్చిన తరువాత విప్లవోద్యమపు ప్రతిఘటనకో తట్టుకోలేక, తాత్కాలిక సర్దుబాటుకోసం, తనను తాను కూడ తీసుకోవడం కోసం-నక్సలైట్లు చట్టబద్ధ కార్యకలాపాలు సాగించుకోవచ్చు-అని ప్రకటించింది.

ప్రజలు పోరాడి సాధించుకున్న పాక్షికమైన స్వేచ్ఛ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలు అంతో ఇంతో అనుభవించగలిగినా సింగరేణిలో అటువంటి పరిస్థితులను ప్రభుత్వమూ, పోలీసులూ సహించడంలేదు. బహిరంగ సభే కాదు, సింగరేణి కార్మికోద్యమ నిర్మాణంలో అమరులైన కామ్రేడ్స్‌కోసం స్మారక స్థూపం కట్టుకోవడానికి కూడా గోదావరి ఖని వంటి పట్టణాలలో అనుమతించడం లేదు.

అంతటి నిర్బంధం కార్మికులపై కార్మికవాడలపై కొనసాగుతుండగానే సెప్టెంబర్ 5, 1990 సాయంత్రం గోదావరిఖనిలో అన్ని యూనియన్లను ఒకే వేదికపైకి తెచ్చి-కార్మికులకు సంబంధించిన తొమ్మిది ప్రధానమైన డిమాండ్లతో-ఇరవై వేలమంది కార్మికులు బ్రహ్మాండమైన ఊరేగింపు తీశారు. జనరల్ మేనేజర్ కార్యాలయంముందు కొన్ని గంటలపాటు ధర్నా చేశారు. వందలాది మంది సాయుధ పోలీసులు ఆ ఊరేగింపును అప్రమత్తులై అనుసరించారని, విలేఖరుల సమావేశాల్లో పోలీసులు కార్మికుల ఫొటోలు తీసుకోబోగా పట్టుబడ్డారనీ మరుసటి రోజు పత్రికల్లోని వార్తలు తెలిపాయి. అయినా కార్మికులు నిర్భయంగా ఆ ఊరేగింపులో పాల్గొన్నారని పత్రికలు రాశాయి. ఇంతకూ అన్ని యూనియన్ల ఐక్య సంఘటనకు నాయకత్వం వహించింది 'సింగరేణి కార్మిక సమాఖ్య' (సికాస) కావడమే కారణం. యాజమాన్యం స్పష్టమైన హామీలు ఇచ్చేంతవరకూ పనుల్లోకి వెళ్ళేది లేదని మొత్తం గోదావరి ఖని డివిజన్‌లోని ముప్పైవేలమంది బొగ్గుగని కార్మికులు సమ్మెలోకి దిగారు. అంతకుముందు రోజునుంచే తట్టల విషయంలో ప్రారంభమైన సమ్మె మరుసటిరోజు ఊరేగింపు ధర్నాలతో తీవ్రరూపం తీసుకుని నూతన డిమాండ్లను యాజమాన్యం ముందు పెట్టింది.

అట్లా సెప్టెంబర్ 4, 1990 ప్రారంభమైన సమ్మె ఈ సమీక్ష రాస్తున్న సమయానికి ఇంకా కొనసాగుతోంది. (29-9-1990)

భారతదేశ కార్మికోద్యమ చరిత్రలోనే ఒక గుణాత్మకమైన మలుపు అనదగ్గ సెప్టెంబర్ 5, నాటి ఈ రేగింపును—సికాస రహస్యంగా ఉంటూనే నిర్వహించగలిగింది.

సింగరేణి కార్మికోద్యమం నిర్మాణంలో సికాసను నిలబెట్టడానికి తమ విలువైన ప్రాణాలకు ధారపోసిన వాళ్ళలో కామ్రేడ్ మూల శంకర్ ఒకరు. ఆయన తన ఆచరణలో భాగంగా రాసిన పుస్తకమే ఈ 'సింగరేణి బతుకులు' అనే కథల పుస్తకం.

గని కార్మికులపై కర్రపెత్తనం చేస్తూ-సుఖప్రదమైన జీవితం గడపడానికి అవకాశంగల ఓవర్‌మ్యాన్ ఉద్యోగం వచ్చినా వదులుకున్నవాడు శంకర్. నవనవోన్మేషమైన తన యవ్వన జీవితాన్ని బొట్లు బొట్లుగా ధారపోసి సింగరేణి కార్మికోద్యమ నిర్మాణంలో తనవంతు పాత్ర నిర్వహించాడు. నిర్మాణ క్రమంలో ఉపకరించే మూడు కథల్ని కూడా అందించాడు.

నిజానికివి చాలా చిన్న కథలు. భాషాపటాటోపం, శైలీ శిల్పాలూ జిమ్మిక్కులూ లేని సాదాసీదా కథలు. అతి సామాన్యమైన కథలు. ఇవాళ మనందరికి సామాన్యంగా కనిపించే ఈ కథల్లోని విషయాలు నిజం చేసుకోవడానికి సింగరేణి బొగ్గుగని కార్మికులు ఎన్నెన్ని సంవత్సరాలు పెనుగులాడారో తెలుసుకుంటే తప్ప ఈ కథల ప్రాధాన్యం అర్థంకాదు.

సింగరేణి కార్మికోద్యమ నిర్మాణంలోని మూడు మలుపుల్ని చూపించే ఈ కథల్ని అర్థం చేసుకోవాలంటే ఈ కథల పూర్వరంగం కొద్దిగా విపరించవలసి ఉంటుంది.

సుమారు వంద సంవత్సరాలకు పైబడి సింగరేణి కార్మికుల చరిత్ర (1886-1986) ముఖ్యంగా నైజాం పరిపాలనా చివరికాలంలో తెలంగాణా ప్రాంత భూమి లేని వ్యవసాయకూలీలు బొగ్గు గనుల్లోకి వలస రావడం ప్రారంభించారు. వారంతా గ్రామాల్లో పటేల్, పట్వారీల, దొరల దేశ్‌ముఖ్‌ల దోపిడీ పీడనలనుంచి తప్పించు

కుని వచ్చినవారే! అటువంటి వారికి సింగరేణి బొగ్గుగనుల్లో కూడా గ్రామాల్లోని పరిస్థితులకంటె అన్ని రకాలుగా దుర్భరమైన పరిస్థితులే ఎదురుపడ్డాయి. దొరలను, దేశ్‌ముఖ్‌లను తలదన్నే లేబరు కాంట్రాక్టర్లు, సింగరేణి అధికార్లూ-మరోవైపు గనుల్లో నిత్యం కుప్పలు కుప్పలుగా ప్రమాదాల్లో చనిపోయే కార్మికులూ, అట్లా ఆ నరకకూపాలైన గనుల్లో పని చేయలేకా, ఆ కాంట్రాక్టర్లనీ, అధికార్లనీ ఎదిరించ లేకా, కొందరు తిరిగి గ్రామాల్లోకి వస్తే అట్లా రావడం ఇష్టంలేని మరికొందరు రైల్వేలలోకి పోయారు. అయినా **1900-1940** మధ్య కాలంలో వ్యవసాయకూలీల వలస సింగరేణిలోకి ఉధృతంగానే సాగింది. కష్టనిష్ఠూరాల మధ్య-దిన దినగండం నూరేండ్ల ఆయుష్షు తీరుగా బ్రతుకుల్ని వెళ్ళమారుస్తూ బతికారు కార్మికులు.

తెలంగాణా సాయుధపోరాట కాలంలో అమరుడు కామ్రేడ్ శేషగిరిరావు నాయకత్వంలో సింగరేణి కార్మికులు అనేక వీరోచిత పోరాటాలు చేశారు. సింగరేణి కార్మికవర్గ పోరాటాలకు అది ఆరంభం. కామ్రేడ్ శేషగిరిరావు పోరాటంలో అమరు డైనాడు.

అటు తరువాత కమ్యూనిస్టు పార్టీ సాయుధపోరాట విరమణ-అసెంబ్లీ-పార్ల మెంటుల్లోకి పరుగులూ ఇక అప్పటికి కొత్తగూడెం ప్రాంత కార్మికులకు శేషగిరి రావు జ్ఞాపకాలే మిగిలాయి. పరిస్థితులు మళ్ళీ మొదటికే వచ్చాయి. పైగా అందాకా లేని కొత్త దోపిడీ వర్గం ఒకటి తయారు అయి కార్మికుల నెత్తిన కూర్చున్నది. అది ఎర్రజెండాను అడ్డం పెట్టుకున్న యూనియన్ దోపిడి!

కామ్రేడ్ శేషగిరి తదితరులు చేసిపోయిన త్యాగం ఉన్న యూనియన్ నాయ కులకు పెట్టుబడి అయింది. బొగ్గు గనిపై డెలిగేట్లు మొదలుకొని యూనియన్ పై. నాయకత్వం దాకా ఫక్తు పైరవీకార్లుగా మారి, హింసా దౌర్జన్యాలతో లక్షలాది రూపా యల్ని కార్మికుల జీతాల్లోంచి చందాల పేర గుంజుకునేవారు. ఎదురుతిరిగిన కార్మికు లను హత్యచేసేదాకా యూనియన్ భ్రష్టుపట్టిపోయింది. అట్లా సుమారు ఇరవై-ఇరవై అయిదు సంవత్సరాల చీకటి కాలాన్ని తండ్లాడుతూ వెళ్ళబోశాడు సింగ రేణి కార్మికుడు.

మళ్ళీ తెలంగాణా పల్లెలల్లో సంచలనం మొదలైంది. పల్లెల్లోంచి దొరలు పట్నాలకు పరుగులు తీశారు. పోలీసులు హుటాహుటిన పల్లెల్లోకి దిగారు. పల్లెపల్లెను

చెదరగొట్టారు. ప్రతి మనిషినీ బెదరగొట్టారు. అట్లా అక్కడ నిలువలేని యువకు లంతా సింగరేణి గనుల్లోకి వచ్చి చేరారు. వారితో పాటుగా వారి నూతన చైతన్యమూ వచ్చి చేరింది.

అప్పటికే గనులపై ఎమర్జెన్సీ నీలినీడలు తారట్లాడుతూనే ఉన్నాయి. గనులకు దగ్గర్లో నివాసాలు లేకా-యాజమాన్యం కల్పించకా-మైళ్ళ కొద్దీ దూరం నడిచి, సైకిళ్ళు తొక్కుతూ, నిమిషం ఆలస్యంగా డ్యూటీకి వచ్చినా కార్మికుల్ని పనుల్లోకి తీసుకొనేవారు కాదు. అధికార్లు ఇండ్లలో చేయించుకునే వెట్టి పనులేకాదు గనులపై అనేక రకాల వెట్టి పనులు చేయించుకునేవారు. గుటుకలు మోయించుకోవడం, బంకరుకింద బొగ్గు ఎత్తి పోయించుకోవడం—గనుల్లో గోడలకోసం వాడే రాళ్ళను మోయించుకోవడం-వగైరా పనులు ఊరికే చేయించుకునేవారు. తీరా ఆ వెట్టి పను లన్నీ అయిపోయినాక ఈ షిఫ్టుకు పనిలేదు మరో షిఫ్టుకు రమ్మంటే రావాలి. మరో షిఫ్టుకు పనిలేదంటే మారుమాట్లాడకుండా ఇండ్లకు పోవాలి. అట్లా నెలకు నాలుగు రోజులైనా కార్మికులకు పని కల్పించలేకపోవడం. తత్పర్యవసానంగా అప్పులు.

సాధారణమైన కార్మికులందరికి ఉండటానికి ఇల్లు లేదు. త్రాగడానికి నీరూ లేదు. అటు బావుల్లో (గనుల్లో) చూస్తే-అంతూపొంతూలేని లోతుకుపోయిన బావులు లోపల గాలి ఉండదు. భరించరాని వేడి. పొగ దుమ్ము ధూళి-తీవ్రమైన త్రాగునీటి కొరత-బరువైన పనులూ-అలసిపోవడం-నాగాలు చేయడం-నాగాలు చేశారని డిస్మిస్‌లు చేయడం-ఆఖరుకు ఆరపూట లీవుకోసం అధికార్ల చుట్టు నానా అగచాట్లుపడే పరి స్థితులు. మరోవైపు యూనియన్ నాయకులు 'గుర్తింపు' పేర యాజమాన్యంతో అంటకాగడం పైరవీలు—ఆస్తులు కూడబెట్టుకోవడం-కార్మికులపై కక్ష సాధించడం ఇవీ అనాటికి వారు చేస్తున్న నిర్వాకాలు.

అటువంటి దుర్భర పరిస్థితుల్లో 1981లో చారిత్రాత్మకమైన 56 రోజుల సమ్మె జరిగింది. బెల్లంపల్లి మందమర్రి ప్రాంతాల్లో మొదలై గోదావరి ఖనిదాక వ్యాపించింది. దక్షిణ భారతం యావత్తూ చీకట్లో మునిగిపోయింది ఆ సమ్మెతో! మొదటిసారిగా సింగరేణి కార్మికుడు తన శక్తియుక్తులేమిటో తెలుసుకున్న సమ్మె అది. 'ఒకరోజు సమ్మె చేస్తే వారంరోజుల జీతం కోత' అనే బ్రిటిషు కాలపునాటి చట్టాన్ని రద్దు చేయమని కార్మికులు ఆ సమ్మెతో డిమాండ్ చేశారు.

గ్రామాల్లోంచి వచ్చిన నూతన చైతన్యం ఆ 56 రోజుల సమ్మెతో సంఘటిత రూపం తీసుకుంది. విజయవంతమైన ఆ సమ్మె పోరాటంలోంచే 'సింగరేణి కార్మిక సమాఖ్య' ఆవిర్భవించింది.

అదిగో ఆ నేపథ్యంలోంచి వచ్చిన వాడే ఈ మూటశంకర్ ! కా॥ శేషగిరి చేతుల్లోంచి ఒరిగిపోయిన జండానీ, ఆయుధాన్నీ అందిపుచ్చుకున్నవాడే శంకర్ ! (వి. యస్., సృష్టి., సాగర్)

రివిజనిజం బలంగా వేళ్లూనుకున్న కొత్తగూడెం ప్రాంత కార్మికులను సంఘటిత పర్చడంలో ఎదురైన ఇబ్బందులూ - వాటిని అధిగమించిన తీరూ - కార్మికుల తోనూ, తోటి కామ్రేడ్స్‌తోనూ కలసి చర్చించి చెప్పుకున్న విషయాలే ఈ 'సింగరేణి బతుకులు' అనే మూడు చిన్నకథలు.

56 రోజుల సమ్మె తరువాత తమకోసం పనిచేయని దగుల్బాజీ యూనియన్లకు ఇంత చందాలు మాత్రం ఎందుకు కట్టాలి ? అని కార్మికులు ఎదురు తిరిగి చందాలు కట్టకపోవడం - తమకోసం పోరాడే యూనియన్‌కే ఇవ్వాలనుకోవడం - ఇది 'ఐక్యత - ఘర్షణ' అనే మొదటికథ. ఇది రివిజనిజం యొక్క ఆర్థిక పుష్టిపై మొట్టమొదటి బలమైన దెబ్బ.

చందాలు వసూలుచేసే డెలిగేట్ల స్థానంలో ఓవర్‌మ్యాన్స్ (కింది స్థాయినుంచి పైకి మూడో అధికారి. పనివాళ్ళను పంచడం - పని విభజనచేయడం. పనిస్థలాలు కేటాయించడం. దాదాపుగా ఒక షిఫ్ట్ కార్మికులందరిపై అధికారిగా పనిచేస్తుంటాడు) యూనియన్ ప్రతినిధులుగ నియమించడం ఆ అధికార్లది కాదు తప్పు ? యూనియన్ స్వభావానికి మచ్చుతునక. చాలా గనులపై యూనియన్ ప్రతినిధులుగా పిట్‌లెవెల్ నాయకులుగా కార్మికులపై కర్రపెత్తనం చేసే అధికార్లే ఉండటం కేవలం అసంకల్పితంగా జరిగింది కాదు. అలా కావాలనే అధికార్లను యూనియన్ ప్రతినిధులుగా ఎంపికచేసి నియమించడంలో యూనియన్‌కు కలిగే అనేకానేక లాభాల్లోకెల్లా పెద్ద లాభం చందాలు వసూలు చేయడం! డెలిగేటే కాదు, అతను తనపై అధికారి కూడా. కనుక ఆయనమాట వినకపోతే రేపు ఏదైనా చేస్తాడేమోననే భయంవల్ల కార్మికులు మారు మాట్లాడకుండా చందాలు ఇచ్చిపోయేవారు.

కథలో ఒకచోట ఇట్లా వస్తుంది - బోనస్ తీసుకునిపోయే కార్మికుల్నిచందాలు

కట్టమని బలవంతం చేస్తుంటాడు - అందులో చాటుగా తప్పించుకునిపోతున్న లింగయ్య అనే కార్మికుణ్ని ఉద్దేశించి ఓవర్‌మ్యాన్ వీరపల్లు "లింగయ్యా ! చందా కట్టకుంటనే పోవద్దిని" అంటాడు. ఆ పిలుపుతో లింగయ్య గతుక్కుమంటాడు. ఒంట్లో సత్తువచచ్చిన తనకు కంపెని సర్ఫేసుపని ఇయ్యమంటె ఇవ్వవాయె ! పదో పరకో చేతులబెడితె సర్ఫేస్ పని ఇచ్చే ఓవర్‌మ్యాన్ (ఫోర్‌మ్యాన్ స్థాయి) మాట లకు ఎదురు చెప్పలేకపోయిండు లింగయ్య. పైగా ఇట్లా అనుకుంటాడు. "వీనితో తంటయితె పనికి అయిదు నిమిషాలు ఆలిశంగవచ్చినా తీసుకోడు. వీడు కష గట్టిం డంటె రోజూ బాయిలకే (గనిలోకి) దిగాలె !" అనుకున్న లింగయ్య చందా కట్టుకుని పోతాడు.

ఎర్రజెండా నీడలోనే అన్ని రకాల ఉపాయాలతో, నిర్బంధాలతో బెదిరింపు లతో కార్మికుల్నుంచి దశాబ్దాలుగా వేలాది లక్షలాది రూపాయల్ని పీల్చి పిప్పి చేశారు కనుకనే తరువాతకాలంలో సింగరేణి కార్మికుడు. "ఎర్రజెండా వేడబెడితివిరో ఓ రివిజ నిష్టూ - నమ్మినోల్లా నేమి జేస్తివిరో దొంగ కమ్యూనిష్టూ"—అంటూ పాడాల్సి వచ్చింది.

రెండోకథ 'గుణపాఠం' ఒక గనిపై కార్మికులు విధిలేక సమ్మె చేయడం - ఎన్నిరోజులు సమ్మె చేసినా యాజమాన్యం సమస్యను పరిష్కరించలేకపోవడం - చివరకు కార్మికులంతా కలిసి ఆలోచించి - సమ్మెను మిగతా బావులకు విస్తరింప చేయ డం - ఆ తరువాత సమస్యను పరిష్కరించుకోవడం ఇతి వృత్తంగా సాగుతుంది.

కార్మికులు సమ్మెచేయ సమకట్టినప్పుడు మేనేజరు ఫోన్‌కాల్ మీద లీడరును పిలిపిస్తాడు. ఆయన కారేసుకుని వచ్చి ముందు మేనేజరు గదిలోకిపోయి - కార్మికుల వ్యాఖ్యానంలో చెప్పాలంటె - గుసగుసలాడి వస్తాడు. బయటకువచ్చి కార్మికులతో - బావి మనదే అయితే, మనం ఎట్లా నడ్డుకుపోయేవాళ్ళం ? నాలుగురోజులు ఓపిక పట్టండని - అంటాడు - కార్మిలు "ఓపిక పట్టీ పట్టీ ఈడికొచ్చి వచ్చినం" అంటారు. అప్పుడు లీడరుసాబు "కార్మికులారా ! మనం చీటికి మాటికి సమ్మెలు చేస్తే కంపెని నష్టపోద్ది....అసలేదేశం అల్లకల్లోలంగా వుంది.... ప్రతీదానికి సమ్మె చెయ్యొద్దు. చర్చలద్వారా సమస్యను పరిష్కరించుకోవాలె...." అని చెప్పచూస్తాడు. ఇట్లా చెప్పాపెట్టకుండ సమ్మెలు చేస్తే అవి చట్టవిరుద్ధ సమ్మెలు అవుతాయని బెదిరించ చూస్తాడు.

ఇరవై - ఇరవై అయిదేండ్లుగా సింగరేణి కార్మికుల సమస్యలను, చర్చల ద్వారా ఎన్ని టన్నులకొద్దీ, ఎన్ని టబ్బులకొద్దీ పరిష్కరించాలో కార్మికులంతా నిండా అనుభవించే వున్నారు కదా ! అటువంటి చిలుక పలుకుల్ని నమ్మడానికి వారింకా సిద్ధంగా లేరు. వాళ్ళు పాత కార్మికులు కాదు.

సింగరేణిలో ఎంత చిత్రమైన పరిస్థితి అంటె - ఒప్పందాల అమలుకోసం కూడా తిరిగి సమ్మెలు చేయాల్సి రావడం - అటువంటి పరిస్థితుల్లో అవి చట్టవిరుద్ధ సమ్మెలని కార్మికులని నిందించడం - అందునా యూనియన్ నిందించడం - నిజానికి ఆపాటి చట్టాలనైనా తుంగలో తొక్కుతున్నదెవరు ? చట్టప్రకారమే సమకూర్చాల్సిన సౌకర్యాలను కార్మికులకు ఎక్కడ సమకూర్చారు ? సింగరేణిలో చట్టం అనేది ఒకటి ఉందా ? ఉంటె ఆ చట్టాలను సగం అమలు చేసినా సింగరేణిలో సగం సమ్మెలు జరిగేవి కావు !

'చట్టాన్ని పాటించని వాడితో కూడా చట్టబద్ధంగానే వ్యవహరించాలి' అని యూనియన్ చెబుతోందంటే దాని రివిజనిస్టు స్వభావం ఎందాక భ్రష్టుపట్టిపోయిందో మనం సులభంగానే తెలుసుకోవచ్చు ! అటువంటి పరిస్థితిలోంచి కార్మికులు బయట పడి ఎక్కడికక్కడ తమ తమ సమస్యలకోసం సమ్మెలు కడతారు. అయితే ఒక గనిలో ప్రారంభమైన సమ్మెవల్ల సమస్య పరిష్కరించలేరని (యాజమాన్యం) అన్ని గనులకు విస్తరించడంవల్ల ఫలితం ఉంటుందన్న ఆలోచనతో ఈ కథ ముగుస్తుంది. విడివిడిగా కాకుండా మొత్తం కార్మికుల్ని సంఘటితపర్చడం అనే ఆలోచనా దాని ఆచరణా మనకు ఈ కథలో కనిపిస్తుంది.

ఇక మూడో కథ 'జీతం లాభం'. నిజానికి బొగ్గుగని కార్మికుల్లో నూటికి యనభై శాతం చదువురానివారే ! వారికి ఈ జీతనాదాల లెక్కలు డొక్కలు సరిగా తెలిసిచావవు. గ్రామంలో కరణమే అంటే బాయిమీద క్లైటర్లు (గుమస్తాలు) వారి గజిబిజిలెక్కలు !

గ్రామంలోని భూస్వామి పొలంలో పాలేరు కష్టపడతాడు. అందులోంచి ఫల సాయం ఎంత వచ్చిందీ, దానికి ఎంత ఖర్చు అయిందీ, దానికి మార్కెట్లో ఎంత ధర వచ్చిందీ ఇత్యాది లెక్కలు చూచాయగానైనా పాలేరు తెలుసుకోగలుగుతాడు. ఇక్కడ కార్మికునికి ఉత్పత్తియొక్క కొసా మొదలూ అర్థం కావు.

కార్మికులు జీతాలు పెరగాలని గొడవ చేసినప్పుడల్లా 'కంపెని నష్టాల్లో వుండి జీతాలు పెంచడం కుదరదు' అంటుంది ప్రభుత్వం. నిరంతరం రెక్కలు బొక్కలు తెల్లబడగా ఇంత బొగ్గు పైకి తీస్తుంటే నష్టాలు ఎందుకు వస్తున్నాయో అని కార్మికుడు వాపోతాడు.

అవినీతి తదితర స్వల్ప సంగతులను అటు పక్కనుంచితే నిజానికి ఉత్పత్తి ఖర్చుకంటె తక్కువధరకే బొగ్గును పరిశ్రమలకు అమ్మటంవల్లే ఈ నష్టం వస్తోందన్న సంగతిని బయటకు పొక్కనివ్వరు. పరిశ్రమాధిపతులకు ఊడిగం చేసే పారిశ్రామిక విధానపు (ప్రణాళికా) రూపకల్పనలోనే ఈ మోసం దాగివుంది. (నెహ్రూగారి సోషలిస్టు పంథా) అంతేకాని, అది కార్మికులకు జీతాలు పెంచడంవల్ల వచ్చిన నష్టంకాదు, అది కార్మికులు సమ్మెలు చెయ్యటంవల్ల వచ్చిందీ కాదు, పని ఎగవేతలోంచి వచ్చిందీ కాదు.

అందువల్ల, ఈ సంగతులన్నీ దీనివెనుక ఇన్నిన్ని కారణాలు ఉంటాయనీ, శంకర్ ఈ కథలో లారీడ్రైవర్ల మధ్య ఒక బావమరిదిలాగ కూర్చుంది వారి జీతనాదాల గురించీ - లాభనష్టాల గురించీ వివరిస్తాడు.

మొత్తంగా చూస్తే,

చందాలు వసూలు చేయడమే తప్ప కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా తెగబలిసిపోయిన యూనియన్లను ఆర్థికంగా బలహీనపర్చడం 'ఐక్యత ఘర్షణ'లోను యాజమాన్యపు దోపిడీ దౌర్జన్యాలను ఎదిరించడంలో అనేకరకాలుగా విడిపోయిన కార్మికులను ఏకంచేసి సంఘటిత పర్చడం 'గుణపాఠం'లోనూ, కార్మికుల జీతాల వెనుకనున్న దోపిడి ఆర్థిక విషయాలను శాస్త్రీయంగా అర్థం చేయించడానికి ప్రయత్నించడం 'జీతం - లాభం' కథలోనూ మనం చూడొచ్చు.

ముఖ్యంగా కొత్తగూడెం ప్రాంతంలో సికాస నిర్మాణంలోని భాగంగా ఈ మూడు కథలను అర్థం చేసుకోవాలి !

ఇవాళ సింగరేణి కార్మికోద్యమం ప్రధానమైన మలుపు తీసుకుంటున్న తరుణంలో కామ్రేడ్ మూటశంకర్ కథలు రావడం యాదృచ్ఛికం కాదు. మూట

'పెన్నేటి కతలు' సమీక్ష :

రాయలసీమ జనజీవన కన్నీటి కతలు

అరుణ్

"ఇదే పెన్న, యిదే పెన్న నిదానించి నడూ" అంటూ రాయలసీమ ప్రజల కడగండ్లను కనుల ముందుంచిన విద్వాన్ విశ్వం "పెన్నేటి పాట" కాలం నాటి నుండి వత్సరాలు గడిచినా, ప్రభుత్వాలు మారినా, వ్యవస్థ మారనిదే ప్రజల బతుకులు మారదనే వాస్తవాన్ని మన కళ్ళ ముందుంచుతుంది నేటి పి. రామకృష్ణారెడ్డి గారి "పెన్నేటి కతలు".

రాయలసీమ రైతుల కన్నీటి బతుకుల కద్దంపట్టే కథలే "పెన్నేటి కతలు". రాయలసీమలో కృష్ణా, తుంగభద్రా, పెన్నా నదులున్నా ప్రజలు మాత్రం త్రాగునీటికి తహతహలాడాల్సిందే. ప్రకృతి వనరులెన్ని వున్నా, సాంకేతిక విజ్ఞానం యెంత అభివృద్ధి చెందినా, అవి ప్రజల పరం గానపుడు, ప్రకృతి వరాలు ప్రజల పాలిట శాపాలే. చేలల్లో విత్తనాలు యేసిన నాటి నుండి మళ్ళీ పంట కోతకొచ్చేదాక పాలకుల నెరవేరని వాగ్దానాల్లాంటి కురియని మబ్బులపై ఆశలు పెంచుకోవాల్సిందే రాయలసీమ రైతాంగం. 'ఎర్రి పెన్నేరు' యిక్కడి రైతులకు ఎండిన స్తన్యమే. "ఎండిపోయిన ఏర్నా సూస్తా వుంటే, రోజూ యింట్లో అమ్మను సూసినట్టుంటాది" (పే 9). నిజమే, ఎదురుగా కన్నతల్లి వున్నా కడుపాకలి తీరని కన్నబిడ్డల్లాగ,

---

శంకర్ తదితర కామ్రేడ్స్ చేసిన త్యాగం వృధా పోలేదు. అది గోదావరి ఖని వీధుల్లో వేలాది కార్మికుల ఊరేగింపుపై సాగుతోంది.

భూమిపై ఈ యుద్ధం సాగినంతకాలం కామ్రేడ్ మూటశంకర్ - అతని కథలూ చిరస్మణీయం

('సింగరేణి బతుకులు' కథల సంపుటి - రచన, వి. యస్. మూటశంకర్) - పేజీలు 40 - వెల - 4 రు - ప్రచురణ కొత్తగూడెం బుక్ ట్రస్ట్.

ప్రతులకు : 1) పీస్. బుక్ సెంటర్. 1-1-79/9 భాగ్యనగర్ బిల్డర్స్ కాంప్లెక్స్. ఆర్. టీ. సి. క్రాస్ రోడ్స్. హైద్రాబాద్. 20.

2) కొత్తగూడెం బుక్‌ట్రస్ట్. యస్. జె. వగర్. ఖమ్మం. 507 120)

ఎన్ని ఏర్లున్నా త్రాగే నీటికే కరువైన సీమ యిది. అయితే ఎండిన ఏర్లనూ, ఎండి ఎముకలు తేలిన కన్నతల్లుల దీనస్థితికి కారణమెవరంటే ప్రకృతి వైపరీత్యాలంటుంది పాలకవర్గం. కాదు పాలక ప్రభువుల నిర్లక్ష్యం, నిరాదరణ, ఈ దోపిడీ వ్యవస్థ లంటుంది గతితర్కం. ఎన్నికల ముందు పాలకుల వాగ్దానాల్లాగా, పెన్న కూడా అప్పుడప్పుడూ నిండుగా ప్రవహిస్తుంది. అయితే పైరుల దాహం తీర్చడానికి గాదు. గ్రామ గ్రామాల్నే ముంచడానికి. అందుకే యిక్కడి రైతులు "ఏరు పారడమూ సూసిందే. పైరు ఎండడమూ సూసిందే. రెండిట్నీ ఒక్కసారి సూడ్డమే సెప్పలేని బాధ" (పే 17). ఈ వైరుధ్య పరిష్కారంలోనే రాయలసీమ ప్రజల భవిష్యత్తుం దనేది మాత్రం వాస్తవం. ప్రకృతిపై మానవుడెన్ని విజయాలు సాధించినా, అవి సమాజపరం గానపుడు వాటివల్ల సామాన్య ప్రజలకు దక్కే ఫలితం శూన్యం. వర్గాల కతీతంగా యేదీ, సాంకేతిక విజ్ఞానమూ వుండదనేదందుకే.

"పెన్నేటి కతల్లో" రామకృష్ణారెడ్డి జీవితాన్ని అతి నిశితంగా పరిశీలించాడు. దాన్ని చాలా బలంగా వ్యక్తీకరించాడు కూడా. అందుకే ప్రతి కత పాఠక హృదయాల్ని ద్రవింప జేస్తుంది. రాయలసీమ జన జీవితాన్ని దూరంగా వుండి పరిశీలించిన వానికి యింత ఆర్ద్రత కల్గించేటట్టు వ్రాయడం సాధ్యం కాదు. తాను ఆ సీమ ప్రజల్లో ఒకనిగా వుంటూ, వారి వెతలకు స్పందించాడు కాబట్టే రచయిత జనజీవితాన్ని తన స్వంత అనుభవంగా వ్రాయగలిగాడు. వర్షాన్నే నమ్ముకున్న రైతు ప్రకృతి మార్పులకు యెలా స్పందిస్తాడో రచయిత మనకు కళ్ళకు గట్టినట్టుగా చూపుతాడు. రైతుల మొకాల్లోకి చూచి పంటలెలా వున్నాయో చెప్పవచ్చంటాడు. "పైరు ఎట్ల వాడిపోబట్టెనో అట్లనే వాళ్ళ మొకాలు గూడా వాడిపోబట్టే. అందుకే, సేలల్లో పైరెట్టుందో తెల్సుకోవాలంటే ఊళ్ళో మనుసుల మొకాలు సూడాలనేది" (పే 17). జీవనాధారమైన చేలెండితే జీవితాలు యెండినట్టే కదా. రాయలసీమలో రైతులు ఎక్కువగా వేసే పంట (ముఖ్యంగా అనంతపురం, కడప జిల్లాలలో) వేరు శనక్కాయలు. విత్తనాల కాలంలో, అధిక వడ్డీకి తెచ్చిన డబ్బులతో విత్తనాలను కొని జూదంలాంటి వ్యవసాయంలో పోసి తీరా పంట పండాక రైతుకు "ఇటు కొనే తప్పుడు నిప్పులయితే, పండినాక అమ్మేతప్పుడు బొగ్గులు" (పే 16). కర్నూల్ జిల్లా పరిభాషలో 'కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి' 'ఏటికేతంబెత్తి ఎయిపుట్లు

పండించి గంజిలో మెతుకెరగనన్నా' అన్నట్టుగా అష్టకష్టాలు పడి పంట పండించాక తీరా రైతుకు దక్కేది శూన్యం. వడ్డీ వ్యాపారులు, మధ్య దళారీల మధ్య నలుగుతున్న బ్రతుకతనిది. భూమినే నమ్ముకొని బతకలేక, దాన్ని విడిస్తే మరో బతుకు తెరువు లేక అప్పుల ఊబిలోపడి, అర్థాకలితో కొడిగట్టిన దీపంలా కొట్టు మిట్టాడుతున్న జీవితాలు రాయలసీమ రైతులవి. అందుకే రచయిత రాయలసీమలో వ్యవసాయాన్ని "సిత్తాట"తో పోలుస్తాడు. "సిత్తాట ఆడేవాడు ఓడిపోతావున్నా యీసారి గెల్చితానేమో అనుకుంటా వుంటాడు గదా" (పే 20). రామకృష్ణారెడ్డి సిత్తాట వ్యవసాయంకన్నా మేలంటాడు. నిజమే సిత్తాట ఓటమి గెలుపుల్లో ఆడేవాని పాత్ర వుంటుంది. మరి వ్యవసాయంలో రైతుకు ఆ తృప్తీ లేదు. "అస్సలకు యెవసాయం చేయడం సిత్తాట ఆడడంకన్నా కట్టం, సిత్తాట ఆడేవాడు ఓడిపోయినా గెల్చినా వాని సేతులారా ఆడతాండాడు" (పే 20). రాయలసీమ రైతు వ్యవసాయంలో ఆ తృప్తీ పొందడు. అందుకే రచయిత చెప్పినట్టు "ఇదింగోరకం సిత్తాట, సిత్తయిపోయే ఆట" (పే 20). వ్యవసాయమే జూదమైతే, ఫలితాలు ప్రకృతి కరుణపై ఆధారపడ్తాయి. కనీసం పంట చేతికొచ్చాకైనా రైతు తన శ్రమకు తగ్గ ఫలితాన్ని అనుభవిస్తాడా అంటే అదీ లేదు. పండించేవాడు ధరలు నిర్ణయించడు. "కొనేతప్పుడు అంతా, అమ్మేటప్పుడు ఇంతా వుండే ధరల సేతుల్లో, ధరలను పెట్టే పెద్దోళ్ళ సేతిలో" (పే 20). రైతుల జీవితాలు నిర్ణయించబడుతాయి. మరి ఆ పెద్దోళ్ళెవరో రచయితే చెప్తాడు. "ఊర్ల ముందే ఏర్లు పారిపోతున్నా పైర్లకు నీళ్ళు పెట్టుకోడానికి ల్యాకుండా జేస్తాండే వాళ్ళ సేతిలో.... ఎక్కడెక్కన్నో వుండి ఏం సమ్మందంలేని వాళ్ళందరి సేతుల్లో వుండిగానీ, సెమటా నెత్తురూ కార్సి యెల్లకాలం కనిపెట్టుకోని కట్టం పేసేవాడి సేతులో లేదు యెవసాయం" (పే 20). శ్రమ పరాయికరణ గురించి, రైతుల కడగండ్లను గురించి యింతకన్నా సూటిగా ఎవరు చెప్పగలరు.

వ్యవసాయంలో రైతుల బతుకులు అట్లా చితికిపోతున్నాయి. కాబట్టే ఆ పనుల్లో యెంత నైపుణ్యం వున్నా, యెంత శ్రమ చేసినా శ్రమకు తగ్గ ఫలితం రాక, గుర్తింపూ లేక బ్రతుకుతెరువుకై కొందరు మరోవృత్తి చూసుకోవాల్సి వస్తుంది. నర్సిమ్మారెడ్డి మేటి రైతు ("సేద్యం కన్నా పద్యెం గొప్పదా"). "నర్సిమ్మారెడ్డి సేద్యం సేస్తావుంటే నలుగురూ నిలబడి సూసేవాళ్ళంట.... పట్టుబట్టి మేడి బిగబడ్తే

పిటపిట లాడిపోయి కొమ్ములు కాడికేసి కొట్టుకుంటూ ఎద్దులు నిల్చిపోవాల్సిందేనంట. సూసేవాళ్ళు అచ్చెరపోయి 'యాడుండాదబ్బా నీకింత బలం?' అనడిగితే పిల్లోనాల నగేవాడంట. నగి 'బలం కాదురా అబ్బీ పనితనం, సేతి వొడుపు' అని సెప్పే వాడంట" (పే 12). నర్సిమ్మారెడ్డి అట్లుంటి పనివాడైతే ఆయనెంట జడిగెం పట్టె మంగలి ఎంగట్రాముడు తక్కువ వాడేం కాదు. "ఒకరు గొర్రూ, ఒకరు వొడీ పట్టి నర్సిమ్మారెడ్డీ, ఎంగట్రాముడూ ఇత్తనం యేడంసూస్తే.... కురుచ్చేత్రంలో కిష్నుడూ, అర్జునుడూ యిట్టనే యుద్దం సేసినారేమో అనిపిచ్చేదంట" (పే 13). కాని అట్లాంటి నర్సిమ్మారెడ్డే సేద్యంతో బ్రతకలేక పద్యాలు వ్రాసి పేరు తెచ్చుకోబట్టె. ఎంగట్రా ముని లాంటి వాళ్ళకు "అంత గొప్ప సేద్యం సేస్తే రాని గౌరవం ఆరోన్ని పద్యాలు రాసినందుకు రాడమే సిత్రం" (పే 14) గా కన్పడుతుంది. పద్యాలు రాయాలన్నా, పాటాలు చెప్పాలన్నా కావల్సిన తీరిక, అవకాశం యిచ్చేది సేద్యం చేసే పనివాళ్ళేననేది 'మెరిట్' గురించి ఆక్రోశించే బుద్ధి జీవులెప్పుడు తెల్సుకుం టారు? అంతవరకు శారీరక శ్రమకు గుర్తింపు వుండదు. అందుకే వాములేసే "ఏటుకాడు" ఏసోబును పనుల కాలంలో బ్రహ్మరథం పట్టే రైతులే, ఆ తర్వాత చీదరించుకుంటారు. "ఒకరకంగా సెప్పాలంటే ఏసోబు ఏడాదంతా బ్రతికినట్టు కాదు, సావును మోసుకుంటూ బ్రతికినట్టే. ఈ వాములు ఏసినన్ని రోజులు మాత్రం బతికినట్టు. ఈ గ్యాపకమే ఏడాది బతుక్కు బలం". ఏసోబుకు వాములేసే కాలంలో యిచ్చే గౌరవం, పీర్లు పీర్ల పండగనాడు మాత్రమే పొందే గౌరవం లాంటిది- ఆ తర్వాత ఏసోబునూ, పీర్లనూ మరల సంవత్సరం వరకు యెవరూ పట్టించుకోరు. వామేపించుకున్న ఎంగటసామి కొడుకూ ఏసోబు తన ఎనుముకు కొంచెం మేత తీసుకపోవడం సహించడు. కరివేపాకు బ్రతుకు ఏసోబిది. మనుషుల్లో కుల, స్థాయి అంతరాలున్నట్టే వాళ్ళు పూజించే దేముళ్ళ మధ్యా ఆ అంతరం వుంటుంది. ఎంతైనా మనుషులు సృష్టించిన వాళ్ళే గదా దేముళ్ళు. వర్గాలకతీతంగా దేముడూ వుండడు. "వూర్లో సాయిబులు బీదోళ్ళయినట్టే వాళ్ళ పీర్లూ బీదయే, పీర్ల సాయిడీ బీద్దే" (పీర్లు పే 74). పీర్ల పండగ సంబరంలో హిందూ ముస్లిం లందరూ పాల్గొన్న "పండగప్పుడు గానీ, మామూలప్పుడుగానీ లేనోడు లేనోడే, వున్నోడు వున్నోడే.... అందుకే రెడ్డీ, పెసిడెంటు పీర్లు ముందుగా వూరేగుతే, ఎనకాల ఎర్రిపీర్లు వూరేగుతాయి" (పే 75). అంతేగాదు, రెడ్డి, ప్రెశిడెంట్ల మధ్య

ఘర్షణ వచ్చినా సామాన్య ప్రజలు తలలా పగులుతాయి. మన వూళ్ళో అస్పృశ్యత ఉన్నట్టే దేముళ్ళలోకూడా అస్పృశ్యులుండటం మనం జూస్తూనే వున్నాం కదా. ఈ పండగ సంబరం ఒక రోజే. ఆ తర్వాత పీర్ల చావడిలోనే, పేదలు కడుపు కట్టుకొని పనుల్లోకి పోక తప్పదు.

పాలన్నీ మార్కెట్‌లో అమ్ముకొని మజ్జిగ నీళ్ళతో తృప్తిపడే పేదల్లాగా, పండిన మేలురకం పండ్లను జీవితావసరాలకోసం మార్కెట్‌లో అమ్మి పనికిమాలిన పండ్లను తాము తినే పేదరైతుల బతుకుల వెతలే "కర్బూజ తోట". ప్రతివేసవిలో రాయలసీమలోని అన్ని ఏర్లలో మనకు కన్పడుతాయి కర్బూజ తోటలు. ఈ పండ్లను పేదవాని శీతల పానీయాలంటారు. మండే వేసవిలో, మలమల మాడుతున్న యిసుక పర్రెల్లో, నీళ్ళ గట్టి పంటను పండించిన రైతులు మేలురకం పండ్లను (యింగన్, బత్తసాల రకాలు) తినడానికి నోచుకోరు. వాటిపై డబ్బున్న ఆసాములకు కాయిషీ (యిష్టం) యెక్కువ కాబట్టి ఎంతైనా అమ్మి, తక్కువ రకం కాయల్ని (కూజా) రైతుకుటుంబం తింటుంది. మేలురకం పండ్లను తినాలని ఆరాటపడే తన పిల్లలకు ఆ పేదరైతు "మనది యింగన్ బత్తసాల బతుకు కాదురా నాయినా, కూజా కాయ బతుకురా" (పే 22) అంటూ వాపోతూ నచ్చ చెప్తాడు. అంతేగాదు కష్టం తనదైతే ఫలితం వేరొకరు అనుభవిస్తారనే జీవిత వాస్తవం అతనికి తెల్సు. "తోట కోసం ఏ కష్టం సేయనోళ్ళు వచ్చి యిష్టమెచ్చిన కాయలు తినీ, పారేసి, నగుకుంటూ మూతి తుడ్సుకొని పోతారు" (పే 24). ఈ అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థలో బతుకు తెరువులేక ఎండబారిన బతుకులు పేదరైతు కూలీలవే కాదు, చేతిపనుల వారివి, వృత్తి కళాకారులవీ కూడా పారిశ్రామిక విప్లవం జరుగక, గుండుపిన్ను నుండి కలర్ ట్యూబుల దాక విదేశిగుత్త పెట్టుబడి దారి సంస్థలపై ఆధారపడుతున్న అస్వతంత్ర భారతంలో జీవనం జరుగక చేతి పనులవారూ, వృత్తి కళాకారులు రైతుకూలీలుగా మారక తప్పదు. సామ్రాజ్యవాద సంస్కృతి ప్రవేశంతో, సాంకేతికాభివృద్ధివల్లనూ సినిమాలూ, టి.వి.ల రంగ ప్రవేశంతో నాటకాల వాళ్ళ జీవితాలు తెరదించేయబడ్డాయి. వారి దీనస్థితికి అద్దం పట్టే కతలే "తూర్పునాటి కూళోళ్ళు" (పే 24) మరియు "అంకట్ల" (పే 71) వర్షాధార పంటలపై ఆధారపడ్డ రాయలసీమ బీడాదిక్కి జనం, పనులు లేక కడుపు పట్టుకొని కూలీ పనులకోసం అటు బళ్ళారి ప్రాంతానికో, యిటు కోస్తా జిల్లాలకో వెళ్ళడం అనవాయితీగా మారింది. వారిలో అంతా యింతో నైపుణ్యం

వున్న చేతిపనుల వారు అరబ్ దేశాలకెళ్ళి నవాబులకు సేవకులుగనో, పరిచారకులుగనో, యిక స్త్రీలైతే ఉంపుడుగత్తెలుగనో మారి, తమ శ్రమ శక్తితోపాటు, శరీరాన్నీ అమ్మాల్సిన స్థితికి దిగజారడం, ఒక్కొక్కసారి హైదరాబాద్, బొంబాయి బ్రోతల్స్‌లో అంగడి సరుకుగా మారడం కద్దు. ఆ చావలేని ప్రజలు తమ జిల్లాల్లోనే నీటి పారుదల గల ప్రాంతాలకు కోతలకాలంలో రెన్నెళ్ళో వెళ్ళి కూలి గడించుకొని వస్తారు. ఇలా వలసవెళ్ళిన రోజుల్లో వారు తమ భుక్తికోసం ఆ గ్రామాల భూస్వాములపై ఆధారపడాల్సిందే. వాళ్ళు పెట్టే సంగటి తిని, అంబలి తాగి తమకిచ్చే కూలీగింజల్ని పనులులేని కాలం కోసం జాగ్రత్త పరుచుకోవాల్సిందే. జీవిత అభద్రత, ఆకలి వాళ్ళని యెంత దైన్య స్థితికి దిగజారుస్తుందో రామకృష్ణారెడ్డి మాటల్లోనే వినాలి. "తలా ఒక ముద్ద సంగటి పెడ్తా వుంటే, ఆ ముద్దను వాళ్ళు ఎంతో ఆకలితో రెండు చేతుల్లో అందుకోడమూ, అందుకోని ఒక్కొక్క రవ్వే తుంచుకోని కూరాకుతోనో, కారెంలోనో అద్దుకోని, అప్పుడే అయిపోతుందేమోనని తింటూ వుండటం....అజ్జాపినోళ్ళు, బ్రతికినంతకాలం మర్చిపోలేరు. ఆ ముద్ద సంగట్లోకే మూడుమాట్లు పప్పో, కారమో యే యిచ్చుకుంటారు....దోసెడుబట్టి, సెంబెడు సెంబెడు నీళ్ళు తాగుతారు. ఆ సలికాలం అన్ని నీళ్ళు తాగేది దప్పికైకాదు, ఆకలి తగ్గిచ్చుకోని ఆ ముద్ద సరిపెట్టుకోవాలని" (పే 26). అర్ధాకలితో కడుపు మాడ్చుకుంటున్న వీళ్ళంతా యెవరు? సల్లో, ఎండలో, సగం నిండిన కడుపుల్తోవుండిన బాల్నాగమ్మలా, బాలసెంద్రులు" (పే 26). కాని మాయలపకీర్లాంటి పాలక ప్రభువుల మోసాలకు గురయ్యే బాల్నాగమ్మలుగానే వారింకా మిగల్లేదు. దోపిడీ వ్యవస్థను కాచేవే స్వర్ణక్కలుగా కూడా పరిణితి చెందుతున్నారు. "అంకట్ట" (పే 77) గ్రామాల్లోని చేతివృత్తుల వారి చితికిన బ్రతుకుల వెతల తెల్పుతుంది. వృత్తి కళాకారుల్లాగా వీళ్ళ అభివృద్ధి నీడలో దోచబడ్తున్నవారే, బ్రతుకు తెరువును కోల్పోయిన వారే. మార్కెట్‌లో ప్లాస్టిక్, స్టీలు సామాన్ల ప్రవేశంతో గ్రామాల్లోని కుమ్మర్ల బ్రతుకులు పగిలిన కుండల తెరవయ్యింది. కుండలు కొనేవాళ్ళు లేక, జీవితం గడవక వున్న రెండెకరాలు అమ్ముకున్న సుబ్బయ్యతాత తన బాధలకు ఎవర్ని నిందిస్తాడు? 'పేదవాని కోపం పెదవికి చేటన్నట్టు', కుమ్మరికోపం కుండలకొచ్చే, అంకట్టమీద తిరిగే యిరుసులాగా సుబ్బయ్యతాత జీవితం ముందుకు కదలదు. ఉపాధి కోల్పోయిన జీవితాలు తమ కష్టాలకు కారణం తెలియక కృంగి కృశించాల్సిందే.

అందుకే "అంకట్ట దగ్గర కూకోని....పుల్లతో కుల్లగిస్తే....లోతుకు పోను పోనూ యింగానల్లగా, మెత్తగా, తడిగా....సుబ్బయ్యతాత గుండెకాయను పొడిస్తే నెత్తర కక్కతా వున్నేట్టుంది" (పే 78) చితికిన బతుకులపట్ల యెంతో సానుభూతి, జాలి వుంటే తప్ప అ జీవితాన్ని మన కళ్ళ చెమ్మగిల్లేలా రచయిత చిత్రించలేడు.

నీటిపారుదలా వసతుల్లేక, పాలకవర్గ హామీలు తెలుగుగంగ మాదిరి ఎండ మావులు కాగా, సీమరైతులు వానకాలంలో మోరయెత్తిన ఎద్దులా అకాశంవైపుచూస్తూ వుండాల్సిందే. వర్షమొచ్చినా అది రైతులకే గాదు ఊరంతా పండుగే. సీమ ప్రజల జీవితాలకు, వానకుగల లింకె యెలాంటిదో "వానొచ్చె" (పే 28) మనముందుంచు తుంది. మోడాలు పట్టగానే ప్రజల ఆశలమోసులు చిగిరిస్తాయి. తొలిచినుకుల 'టప్' శబ్దాల వెంట, ప్రజల గుండెలు 'లబ్‌డబ్' అంటూ తాళం వేస్తాయి. ఊరుఊరంతా మిద్దెలెక్కి, వాములెక్కి ఆశతో ఆకాశం వైపు జూస్తారు. "మిద్దె మీద నిలబడు కోని మోడం దిక్కు సూస్తావుండేది నాగిరెడ్డొక్కడే అనుకుంటెవా....ఓయమ్మ! అట్ట సూడుమల్ల, మిద్దెలమీద ఎంతమంది నిలబడుకోని ఎగజూస్తావుండారో! (పే 28-29). ఒకవైపు వర్షమొస్తుందనే ఆనందం, మరొకవైపు పాలకవర్గ హామీల్లా మోడాలు చినుకులు రాల్చవేమోననే ఆందోళన....అది నాగిరెడ్డిలాంటి భూమువున్న వాళ్ళకే గాదు ఆ ఊరిలోని ఆడ, మగ, పిల్లపీచుల అందరి మనస్సులోని భావాలు. మోడాలు వర్షించినా, వర్షించకపోయినా, బూటకపు ఎన్నికల్లో యేదో ఒక దోపిడీ దారుని యెన్నుకోకతప్పని స్థితిగా, రాయలసీమ ప్రజలు మోడాల నమ్ముకోక తప్పదు. సాంకేతికంగా యెంత అభివృద్ధి చెందినా, వ్యవస్థ సమాజాభివృద్ధికి యెలా అడ్డు వడ్తాందో రాయలసీమకు నీటి పంపిణీ విషయంలో నెరవేర్చని పాలకవర్గ హామీలూ, మొదలేపెట్టని నీటిపారుదలా ప్రాజెక్టులూ మనకు తెలియజేస్తాయి.

రామకృష్ణారెడ్డి 'పెన్నేటి కతల'లో గ్రామసీమల్లోని రైతుల జీవితాలేగాక, మానవ సంబంధాలు, గ్రామీణ వాతావరణం ఉట్టిపడ్తాయి. "ఊరిపిల్లోడు", "అడవి పావురేను", 'జీరంగి' గ్రామాల్లోని బాల్యమే తెలియని అమాయకపు బాలల జీవితాన్ని విశ్లేషిస్తాయి. పండుగకు యిస్తామన్న పాత చొక్కాకు ఆశపడి అలవిగాని శ్రమచేసి తీరా పండగొచ్చేసరికి పాత చొక్కాయే దక్కుతే ఆ పసివాని హృదయం యెంత రోదిస్తుందో? తన అయ్య "బతకల్యాక బాకీలు సేసుకొని, తీర్చల్యాక పిల్లోళ్ళను జీతాలకు పెడ్తారని వానికింకా తెల్దు" -అపునుమరి. వెట్టిచాకిరీ రద్దుచేస్తా

మంటూనే, మేధావులతోనే వెట్టిచాకిరీ చేయించుకుంటున్న దోపిడీ వ్యవస్థలో, యిక పేదరికంలో అజ్ఞానంలో మునిగిన గ్రామీణ ప్రజల సంగతి చెప్పాల్నా. భూస్వామ్య వ్యవస్థలో ఒకే యింటికీ, యజమానికి కట్టుబడిన అర్థబానిస జీతగాడు. తనూ, పని చేసే పశువుతో సమానమని వానికి తెలియదు. తాను పనిచేసే పొలం, ఎద్దులా తన స్వంతంగా భ్రమిస్తూ వాటిపై మమకారం పెంచుకుంటాడు. కానీ, తీరా యజమాని తననొక ఉత్పత్తి పరికరంగానే భావిస్తే వాని మనసు కకావికలవుతుంది. ఈ భూస్వామ్య సంబంధానికి అద్దం పట్టింది "సేనుగల్లోడు" (పే 45) "కాపోడూ, కూలోడూ" (పే 48). "రేయ్, సేలు నీయికాదు, ఎద్దులూ నీయికాదురోయ్" (పే 47) అని యజమాని తెలియజేసేసరికి, జీతగానికి యింతకాలం పనిచేస్తున్న తనకు ఎద్దులపై అధికారమెలా వుండదో అర్థంకాదు, మొదట్లో అయితే యజమాని ఆధిపత్యానికి కారణం అతని చేతిలో భూమి వుండటమే అని క్రమంగా అర్థమవుతుంది. "ఎర్రన్నకు ఏం తెలియకపోయినా సేనుండాది. అదుంటే ఎద్దుంటాది, ఎద్దెనెకాల ఎద్దాలపోయే సేద్యగాడు వుంటాడు" (పే 47). నిజమే భూమి ఎవరిదో రాజ్యం వాళ్ళదే. పతనమవుతున్న భూస్వామ్య వ్యవస్థలో గతంలో వున్న రైతు - సేద్యగాళ్లమధ్యనున్న కనీస మానవ సంబంధాలు మాసిపోయి మరింత అభివృద్ధికరమైన సంబంధాలు రాకపోగా జీతగాన్ని కేవలం ఒక ఉత్పత్తి పరికరంగా, జూసే సామ్రాజ్యవాద సంస్కృతి సంబంధాలు చోటుచేసుకున్నాయి. పల్లెలలో యేండ్ల తరబడి ఒకే యజమాని దగ్గర పనిచేస్తున్న జీతగాళ్ళకు, ఆ యింటిలో తమకై తామే ఆపాదించుకున్న కొన్ని హక్కులు ? వుండేవి. మధ్యతరగతి రైతులు శ్రమలోనూ, తినే ఆహారంలోనూ తమ జీతగాళ్ళతో తేడా లేకుండా భాగస్వాములయ్యేవారు. కట్టం జేసే తప్పుడు యీడు కాపాడు, యీడు సేద్యెగాడు, యిదో యీడు కూలోడు అంట తేడాలుండేయిగావు. సేద్యెగానితో పాటు తనూ (రైతు) కాడికి పోతానే వుండేవాడు (పే 50) అయితే ఈ అనుభవాలు గతానుగతం. ఇప్పుడు రైతు "కూలోళ్ళు పని ఎగ్గొట్టారని కాయిలి కొస్తాన్నెప్టేవుంటాది గాని, కాపోడు సేలో పనిసేస్తాన్నెంటుడదు", రైతులో వచ్చిన ఈ మార్పే కూలోనిలో గూడ ఆలోచనల రేకెత్తిస్తూంది. "ఎప్పటికీ కూలోడు కూలోడుగానే, సేనోడు సేనోడుగానే వుండాల్నా ?" (పే 51) అనే ప్రశ్నతో ప్రారంభమయి కూలోడే సేనోడుగా మారే ప్రయత్నానికి దారితీస్తుంది. తీవ్రతరమైతున్న వైరుధ్యాలు యెక్కడో అక్కడ బద్ద

లయి ఉత్పత్తి సంబంధాల్లో మౌలికమైన మార్పుకు దోహదం చేయక తప్పదు. అందుకే అందర్నీ అదుపు చేసేందుకు పోలీసు, న్యాయవ్యవస్థ తమ గుప్పిటనుండి జారనీయరు పాలక ప్రభువులు. భూమున్న వానికి రాజకీయాధికారం వుంటే, ఆ అధికారం తిమ్మిని బమ్మిచేసి అదే న్యాయంగా అమలుచేస్తూంది. ఆర్నెల్ల కిందట తప్పిపోయిన ఎనుము పొట్లదుర్తికాడే కన్పడిందంటే పాపం సుంకమ్మకు సంతోషం కల్గదా అంటే ఎందుకు కల్గదు? "మూన్నెల్లు కాలిక్కాలికి కొట్టుకుంటూ కన్న వూళ్ళన్నీ తిరిగినా కనపడకపోయె. యాడ అడిగినా దానిపోబడే సెప్పినోళ్ళులాక పోయింది. "సుంకమ్మ ఎనుము" (పే 66-67) అందుకే పొట్లదుర్తికాడ ఎనుము కన్పడిందంటే సుంకమ్మ అగమేఘాలపైన అడికి పురుకెత్తుతుంది. తీరా ఆ ఎనుము తనది కాదని ఈ సరయ్యనాయుడదని, నాయుడు జీతగాడు చెప్తే ఎనుము పంచాయితీ పెట్టిస్తూంది. రెండూర్ల నడుమ ఎనుమును వదిల్తే అది ఎవరింటికి చేరితే వాళ్ళదని ఈ సరయ్యనాయుడు, తదితర పెద్దలూ చెబితే పాపం సుంకమ్మ ఒప్పుకోక తప్పదు. తన ఎనుము ఈ సరయ్యనాయుడింటికెళ్ళినంత మాత్రాన తనదికాకుండా ఎట్లయితుందో సుంకమ్మకు అర్థంకాదు. తీరా ఎనుమును వదిల్తే అదీ ఈ సరయ్య నాయుడింటికే చేరె. ఇక జరిగిన అన్యాయం సుంకమ్మ ఎవరికి చెప్పుకోవాలి? బాగా మేపు పెడ్తున్నంత మాత్రాన ఎనుము స్వంత యజమాన్ని వదలి పరాయి పంచనజేరడం యేం న్యాయం?

పై కథలన్నీ రామకృష్ణారెడ్డి తను పెరిగి పెద్దదైన గ్రామ జీవితాన్ని ప్రేమించి, అనుభవాల్లో పాలుపంచుకొని వ్రాసినవైతే, నేటికీ పరిస్థితుల్లో మార్పు లేదని యిప్పటి అనుభవాలు చెప్తాయి. కాని రామకృష్ణారెడ్డి గారి అనుభవాలకు, నేటి పరిస్థితులకు మధ్య పూర్తిగా తేడా కల్పించే కథలే "అయ్యవారంటే అయినే", "అకలి గురువులు". రామకృష్ణారెడ్డి బాల్యం నాటి దైన్యస్థితిలో నేటి అయ్యవార్లు లేరు. నేడు వారు బ్రతకలేక బడిపంతుళ్ళు గారు, నాటి లాగా విద్యార్థుల జీవితాల్ని శాసించలేరు. అయితే గతంలో గ్రామాల్లో అయ్యవార్లకున్న గౌరవం నేడు లేదంటే దానికి కారణం మారుతున్న రాజకీయ పరిస్థితులూ, సామాన్య ప్రజల నుండి దూర మవుతున్న పంతుళ్ళ స్వభావాలు. ఆర్థికంగా నేడు ఉపాధ్యాయులు మెరుగైన స్థితిలో వున్నా, ప్రజలకు దూరంగా వున్నందువల్ల, సామాజిక గౌరవం మాత్రం కోల్పోయా రని చెప్పవచ్చు.

'పెన్నేటి కథలు'ను మూడు భాగాలుగా విడదీయవచ్చు. రాయలసీమ రైతుల కడగండ్లు వర్ణించేవి కొన్నైతే, గ్రామాల్లోని మానవ సంబంధాలను వివరించేవి మరికొన్ని. ఇవేకాక రచయిత తన బాల్యాన్ని గుర్తు చేసుకొని ఆనాటి అనుభూతులు నెమరేసుకున్నవి కొన్ని. ఇంతవరకు రాయలసీమ జనజీవితాన్ని సింగమనేని నారాయణ, స్వామి, దేవపుత్ర, నామిని లాంటివాళ్ళు తమ రచనల్లో ప్రతిబింబించినా రామకృష్ణారెడ్డి గారి రచనలోని గాఢత, ఆర్ద్రత అందులో మనం పొందలేము. దీనికి బహుశా రామకృష్ణారెడ్డి కథల్లోని నేటివిటీ ఒక కారణం కావొచ్చు. యే ప్రాంత ప్రజల జీవితాన్ని ఆ ప్రాంత ప్రజల మాండలికంలో వ్రాయడం వల్ల సహజంగా రచయిత మరింత బలంగా వ్యక్తీకరించగలడు. అంతేగాక రచయిత మాండలికంతోనే తృప్తి చెందక కడప జిల్లా యాసను పట్టుకోవాలనే ప్రయత్నం చేశాడు. ఈ కథలు మిగతా ప్రాంతాల పాఠకులపై యెలాంటి ప్రభావం చూపుతాయోగాని రాయలసీమ పాఠకులు మాత్రం. ముఖ్యంగా గ్రామాల్లో జీవించినవారు 'పెన్నేటి కథలు' తమ ఊరిని గురించే వ్రాశాడనుకోక మానరు. అలాంటి గాఢానుభూతి కల్గిస్తాయి ఈ కథలు. అయితే వీటిని ఒంటరిగా చదువుకునేకన్నా, రచ్చబండపై కూర్చొని పదిమందితో చదువుతూ పంచుకునే అనుభూతి మరెంతో గొప్పగా వుంటుంది. కాని గొప్ప అనుభూతిని కల్గించడమే గొప్ప రచన లక్ష్యమా? రచయిత తన లక్ష్యాన్ని కేవలం జీవితాన్ని చిత్రించడంగా చెప్పుకున్నారు. "జీవిత సమస్యల్ని చిత్రించడానికి, ఆ సమస్యల్ని పరిష్కరించే సూచనలివ్వడానికి ముందు జీవితాన్ని చిత్రించుకోవడమే" (పే 5). చేయాల్సిందన్నట్టుగా రామకృష్ణారెడ్డి వ్రాసుకున్నారు. జీవితానికి, జీవిత సమస్యలకు భేదం చెప్తాడు. జీవితం చిత్రించడమంటే జీవిత సమస్యల్ని చిత్రించడమే గదా. 'పెన్నేటి కథలు' జీవితాన్ని చిత్రించి జీవిత సమస్యల్ని చిత్రించలేదా? అదేమీ కాదు. జీవిత చిత్రణ వెంట, జీవిత సమస్యలు అందులో వున్నాయి.

రాయలసీమ వెనుకబాటుతనానికి, ఆ ప్రాంతపు వనరుల లేమి, ప్రజల సోమరితనం, ప్రకృతి చిన్నచూపు కారణాలు కానేకావు. సామ్రాజ్యవాద యుగంలో వలస పాలకులు తమ దోపిడీకై, తక్కువ పెట్టుబడితో యెక్కువ లాభాల్ని తెచ్చి

పెట్టగలిగే ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారు. దాంతో మిగతా ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవుతాయి. ప్రజలు తమ దైన్యస్థితికి నిజమైన కారణమెవరో తెలుసుకోకుండా చేయడానికి, ప్రాంతీయ విభేధాలు సృష్టిస్తాయి పాలకవర్గాలు. అధికార పార్టీలోని ముఠాతత్వం, ప్రతిపక్షాల అధికార కాంక్ష ప్రజల అసంతృప్తిని ఆసరా చేసుకొని తమ స్వప్రయోజనాలకై ఉద్యమాలు లేవదీస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా అప్పుడప్పుడూ చెలరేగినా రాయలసీమ ఉద్యమాలన్నీ పాలకవర్గ రాజకీయాల కుట్రలే. ప్రజల్ని పక్కదారి తప్పించేవి మాత్రమే. అటు రమణారెడ్డి, రాజశేఖర, మైసూర రెడ్లు అందల మెక్కడానికో, యిటు చంద్రబాబు, ముద్దుకృష్ణమ నాయుళ్ళకి అధికార మివ్వడానికో రాయలసీమ ప్రజల ఆకాంక్షలు బలిపెట్టబడ్డాయి. అయితే ఉద్యమాన్ని యే లక్ష్యంతో మొదలెట్టినా ప్రజలు కొంతైనా చైతన్యం పొందక మానరు. ఉద్యమ నాయకుల వర్గ స్వభావాన్ని పీడితులలో కొందరైనా గ్రహించక మానరు. మరి పునాదిలో జరుగుతున్న ఈ పోరాటాల్ని విశ్లేషించి, తనదైన దృక్పథంలో తెలియచెప్పగల రచయిత కేవలం జీవిత చిత్రణే తన లక్ష్యం అంటే యెలా? జనజీవితాన్ని యింత బలంగా చిత్రీకరించగల రచయిత, జీవితాన్ని విశ్లేషించి, జీవిత సమస్యలకు అంతర్లీనంగానైనా పరిష్కారం చూయించి వుంటే 'పెన్నేటి కతలు' మరింత ప్రయోజనకరంగా వుండేవి. భవిష్యత్తులో రామకృష్ణారెడ్డి గారి నుండి అలాంటి రచనలు ఆశించడం దురాశ మాత్రం కాదని సమీక్షకుని ప్రగాఢ విశ్వాసం.

'పెన్నేటి కతలు'
పి. రామకృష్ణారెడ్డి
వెల 8 రూ.

ప్రతులకు : పి. సురేంద్ర
12-11-1129, బౌద్ధనగర్,
వారాసిగూడ, సికింద్రాబాద్-500 361.

చర్చ :

'ఆధునిక' కవిత్వ ధోరణులు

[విరసం సాహిత్య పాఠశాల (1991 జనవరి) లో ఆధునిక కవిత్వ ధోరణులపై చేయనున్న ప్రసంగం కోసం కె. వి. ఆర్. "ఆధునిక కవిత్వం గురించి సమగ్రమైన అవగాహన కలిగేట్టుగా 'ఆధునిక' కవులనూ/కవయిత్రులనూ లేఖల ద్వారా సమీపించి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకోవాలని" ఈ ప్రశ్నావళి తయారు చేశారు. ఈ ప్రశ్నావళి ప్రాముఖ్యత దృష్ట్యా ప్రచురిస్తున్నాము]

1) మీ అభిప్రాయం ప్రకారం, 'ఆధునికత' అంటే ఏమిటి? రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో యూరపియన్ కళాసాహిత్యాలలో ప్రవేశించిన ఫ్యూచరిజం, సింబాలిజం, సర్రియలిజం వగైరా ధోరణులా, లేక హేతువాదం, మానవతావాదం, శాస్త్ర విజ్ఞానవాదం - ఈ రెండింటిలో, మన దేశ, కాల పరిస్థితులకు సంబంధించి ఏది 'ఆధునికత'?

2) మనుషుల భావావేశాల మీద కవిత్వం ప్రభావం వుంటుందా? ఉంటే, వాటిని ఎటువైపు మళ్ళించవలసి వుంది?

3) విడిబాటుతనం (Loneliness) ఎంతవరకు, కవుల విషయంలో అభిలషణీయం? తోటి మనుషులతో సంపర్క సాంగత్యాలవల్ల మనిషిలో మార్పు వస్తుందా, లేక వైయక్తిక ఆలోచనా ఫలితంగా వస్తుందా?

4) వ్యక్తి సంస్కారానికీ సత్ప్రవర్తనకీ గీటురాయి ఏమిటి?

5) ఏ కవిగానీ తన కోసమే తాను రాసుకుంటాడా, లేక తన పాఠకులను ఉద్దేశించి రాస్తాడా?

6) 'చైతన్య స్రవంతి' [Stream of Consciousness] మనోగతమైనదా, లేక సామాజికమైనదా? చైతన్యానికి మూలం కేవలం వ్యక్తి మనస్సా, లేక సమష్టి జీవితమా?

7) కవులు జనసామాన్యం కంటే అధికులమని భావించడం సరైందా, కాదా? ["అందరిలోనూ కవిత్వం ఉంది. కవులు మాత్రం కవిత్వం రాస్తారు. ప్రతి ఒక్కడూ కవిత్వం రాయలేకపోవచ్చును గాని, ప్రతి ఒక్కరిలోనూ కవిత్వం

ఉంటుంది" అన్నాడు శ్రీశ్రీ.] అయినప్పుడు, కవిత్వం ఎవరో కొద్దిమందికి మాత్రమే చెందినది భావించడం సవ్యమేనా ?

కవిత్వంలో 'అంతర్ముఖత్వం' ఎప్పటినుంచి, ఎందుమూలంగా ప్రవేశించింది?

8) పురిపండా 'సౌదామిని' ఆంగ్లానువాదానికి Preface రాస్తూ, శ్రీశ్రీ I am the desultory leader of Surrealism అన్నాడు. యూరప్‌లో ఆరగోఁడ, దక్షిణ అమెరికాలో పాబ్లోనెరూడా వంటి సర్రియలిస్టు కవులు ప్రయత్న పూర్వకంగా సర్రియలిస్టు ధోరణిని వదిలివేసినట్టు, మన శ్రీశ్రీ సైతం వదిలివేశాడు గదా, ఇప్పటి తరం కవుల అనేకులు, వెనకటి తరం కవుల ఒకరిద్దరు సర్రియలిజంను ఆశ్రయించడానికి కారణాలు ఏమిటంటారు ? సర్రియలిస్టు ఇమేజరీని వదిలి వెయ్యకుండానే సేతుబుద్ధి విరుద్ధమైన Surrealism ను ఒక కళాధోరణిగా వదులుకోవడం సాధ్యం కాదా ?

వ్యక్తీకరణ రీతులను Surrealist Imagery కొంత దోహదం చెయ్యవచ్చు గాని, కవిత్వ వస్తువునే మింగివెయ్య వచ్చా ? అభివ్యక్తి ముఖ్యమా, అభివ్యక్తి రీతి ముఖ్యమా ?

9) మన చుట్టూ సాగుతూన్న అన్యాయాలు, అక్రమాలు గురించి మీరు కవులుగా స్పందిస్తున్నారా, లేక ఉదాసీనంగానో, తటస్థంగానో ఉంటున్నారా ?

10) నేటి తరం కవుల్లో కొందరు ప్రజలపట్ల తేలిక భావంతో ఉంటున్నారన్నది ఏ మేరకు నిజం ? తాము 'విశిష్ట' వ్యక్తులమని భావించడం సరైందేనా ?

11) కవిత్వంలో 'సంక్లిష్టత' అనివార్యమా ? మన దేశానికి ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతానికి మహానగరాలేవీ (Megapolis) లేనప్పుడు, యంత్రీకరణ (Machanisation), పారిశ్రామికీకరణ (Industrialisation) ల సరసన్నే భూస్వామ్య అవశేషాలు సహజీవితం సాగిస్తున్న పరిస్థితిలో, కవులు 'పరాయీకరణ' (alienation) పొందడం గానీ, నగర జీవితం సంక్లిష్టమైంది కనకనే కవిత్వం కూడా సంక్లిష్టమైపోక తప్పదనీ వాదించడం ఎంతవరకు సబబు ?

యూరప్ పరిస్థితుల్లోనైతే Relevant అయిన అస్తిత్వవాదం (Existentialism) తాలూకు ఆర్తి (Angst) ని మన కవులు స్వారోపణ చేసుకోవడం ఎంతవరకు సముచితం ? ఇది తెచ్చి పెట్టుకొన్నదా, లేక నిజంగానే genuine అయిందా ?

(4 వ పేజీ తరువాయి)

వున్నారు పోలీసుల దౌర్జన్యాన్ని గురించిన నినాదాలు ఇస్తూ వున్నారు. నిజానికి వాళ్ళనక్కడికి ఎవరు తీసుకొచ్చారు. ఉన్న ఒక్క నాయకుడు అరెస్టయి పోలీసుల స్వాధీనంలోనే వున్నాడు. ప్రజలు తమంత తాముగా కదలివచ్చారు. వాళ్ళమీద పోలీసులు కాల్పులు ఎందుకు జరిపినట్టు. నక్సలైట్ల స్వాధీనంలో ఒక హెడ్ కానిస్టేబుల్‌తో సహా పదిమందిదాకా ఉద్యోగులు, రాజకీయ నాయకులు వున్నారని తెలిసికూడ ఎందుకు కాల్పులు జరిపినట్లు-'నక్సలైట్లకు పాఠం చెప్పడానికి' నవంబర్ ఆఖరువారంలో జరిగిన శాంతిభద్రతల సమీక్ష సభలో వరంగల్ మంత్రి, నిజామాబాద్ ఎస్పీ ప్రతిపాదించిన కఠినవైఖరిని ప్రదర్శించడానికి, పాలకవర్గాలు తమ అధికారంకోసం పోలీసుల్ని, చిరుద్యోగుల్ని పావులుగా బలిపెట్టగలవు. ప్రజల్ని పిట్టల్లాగ కాల్చివేయగలనని మరొకసారి హెచ్చరించడానికి. అయితే మదనపల్లి, తిప్పాపూర్ 'ఎన్‌కౌంటర్' అయినా, నర్మెట పోలీసు కాల్పులయినా (దీనినీ 'ఎన్‌కౌంటర్' అనే పోలీసులు మభ్యపెట్ట జూసారు పత్రికలు రాశాయి. పోలీసులమీద కాల్పులే జరుప దలచుకుంటే నేలాదిమందిని తరలించుకొనిపోతామా అన్నారు విప్లవకారులు) ప్రజల్ని భయపెట్టలేదు. నిర్భయంగా జరిగిందేదో చెప్పడానికి వాళ్లు ముందుకొస్తున్నారు. ప్రదర్శనలు చేస్తున్నారు. ధర్నాలు, ఘెరావ్‌లు చేస్తున్నారు. రాస్తారోకోలు చేస్తున్నారు.

పోలీసులు నిర్విచక్షణగా కాల్పులు జరిపినపుడు అందులో ముగ్గురో పదముగ్గురో (పదమూడు, పదిహేనేళ్ళ పసిపిల్లలతో సహా) మరణించినపుడు మనం ప్రశ్నించాల్సింది కిడ్నాపుల వివేక అవివేకాలనా-పోలీసుల మారణకాండనా అన్నది మళ్ళీ ఇవ్వాళ మనముందుకు వచ్చి నిలిచిన ప్రశ్న-ముఖ్యంగా చట్టం, రాజ్యాంగం, రూల్ అఫ్ లా గురించి మాట్లాడే ఉదారవాద ప్రజాస్వామ్య వాదులు వేసుకోవాల్సిన ప్రశ్న. కిడ్నాప్ చేస్తే ప్రజల్ని ప్రేక్షకుల్ని చేసే ఒంటరి సాహసాలంటిరి. ప్రజలు వేల సంఖ్యలో ప్రదర్శన చేస్తే? ప్రజల్ని అసహాయంగా ఆయుధాలకు ఎదురునిలబెట్టారంటారా? ఎవరు నిలబెట్టారు-ప్రజలు వాళ్ళంతా వాళ్ళే తమ నాయకుణ్ని విడిపించుకోడానికి వచ్చారు ధర్నాలు, ఘెరావోలు, రాస్తారోకోలు, ప్రదర్శనలు అందులో వందల వేలసంఖ్యల్లో ప్రజలు మిలిటెంటుగా పాల్గొనడం—ఈ చైతన్యాన్ని ఏమంటారు? ఒక గాడిద-తల్లీ తండ్రీ కొడుకు సామెతవలె-విప్లవకారులు, వాళ్ళ నాయకత్వంలో ప్రజలు ఏం చేసినా-మీరేమైనా అనడమే పనిగా పెట్టుకున్నారా? అయితే సరే-ఆ ముగ్గురు మూర్ఖులు ఆ ప్రయాణం చేసే తీరుతారు. గమ్యం చేరే తీరుతారు.

16-12-90 — సంపాదకుడు

లేఖ :

చలసాని ప్రసాదరావుగారి 'తీర్పు'

కె. వి. ఆర్.

'సృజన సంపాదకులకు -

'రా. రా. లేఖలు' గ్రంథ సమీక్షలో శ్రీ చలసాని ప్రసాదరావు నా ప్రసక్తి తెచ్చారు. రా. రా. కూ నాకూ ఉండిన పరస్పర గౌరవాభిమానాల గురించి సమీక్షకునికి పూర్తిగా తెలియకనైనా పోవాలి, లేదా రా.రా.ను దుడ్డుకర్రగాచేసి నన్ను చితక బాదించే ఉద్దేశమైనా కావాలి. నా పట్ల చ. ప్ర. కు కొన్ని ప్రిజుడిసెస్ వున్నాయి. 'అరుణతార' 100వ సంచికలో గూడా అవి బయటపడ్డాయి. వీటికి నిజంగానే నేను బాధ్యుణ్ణి కాను.

విషయానికి వస్తే -

రా. రా. కు నేను రాసిన లేఖలైతే లేవుగాని ఆయన నాకు రాసినవి మాత్రం వున్నాయి, ఇప్పుడు అచ్చయి వచ్చాయి. ఆ రెండింటినీ చూడందే ఒక నిర్ణయానికి వచ్చి 'తీర్పు' చెప్పడం అన్యాయం, అక్రమం. మన రాష్ట్రంలో శ్రీకాకుళ పోరాటం తర్వాత మార్క్సిస్టు - లెనినిస్టు గ్రూపుల కార్యకలాపాల గురించీ, అంతకంటె ముఖ్యంగా 1970లో వి.ర.సం. ఏర్పాటు తర్వాత సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విప్లవ రచయితల కృషినీ గురించీ రా. రా. కు రాస్తూ, వచ్చానుగాని, రష్యాలో స్టాలినిస్టు "భూతం" గురించిగానీ, బ్యూరాక్రసీ గురించిగానీ, 'సోషల్ సామ్రాజ్యవాద' ధోరణుల గురించిగానీ రాయలేను. ఒకవేళ రాసినా, కేవలం ప్రస్తావవశంగానే తప్ప ఒక ప్రతికూల విమర్శగా మాత్రం రాయలేదు. నేను తెలుగులో రాసిందికూడా రష్యాలో 'సెన్సార్' కాగలదని నేను ఊహించలేదు. అనువాదశాఖలో ఉద్యోగిగా ఇవి రా.రా.కు సంకటం కలిగించగలదని నేను అనుకోలేదు. నిజానికి, నా రాజకీయమూ నా సాహిత్య సంఘానుబంధమూ రా. రా. కు నచ్చలేదు. గనకనే ఆయన నాకలా రాశారని గట్టిగా నమ్ముతున్నాను. మరి, చలసాని ప్రసాదరావు విప్లవాభిమానానికి నాలాంటి అల్పుల, దురసుమోతుల నివేదనలు అక్షరాలా కూడా చెవికెక్కుతాయన్న నమ్మకం నాకైతే లేదు. విమర్శలో వస్తుపరత్వం (Odjectivity) నాలాంటి పాక్షికులకు [Partisans] ఉండదని అనుకోవచ్చుగాని, ప్రసాదరావు లాంటి నిష్పాక్షికులకూ తటస్థులకూ ఉండవలెననుకోవడం సముచితమే కదా !

లేఖ :

అక్టోబర్/నవంబర్ సృజన అందింది. అందులో — నాటిక 'ఒక వీరుడు మరణిస్తే' చదవగానే నాకు కల్గిన భావాన్ని రాయాల్సిన అవసరం వుందనిపించి రాస్తున్నాను.

దేశ కాల పరిస్థితిలో వచ్చిన వస్తున్న మార్పులికి అనువుగా నాటిక నాటకం వంటి సజీవ కళాసాధనాలు పెట్టుబడి నుంచి పూర్తిగా విముక్తమైతే గాని ప్రజల మధ్య సంచారం చెయ్యలేవు. దీన్ని గుర్తించలేని లేదా గుర్తించ నిరాకరిస్తున్న సురభి, వ్యాపార, ఔత్సాహిక, కళాకారులు అలవాటయిన వైర్‌వర్క్, ట్రిక్కులు, రంగురంగుల తెరలు, సెట్టులు, కలర్ ఫోకసింగుల్ని వదిలేస్తే అది నాటకం కాదన్న ఆలోచనలికి 'కండిషన్డ్' అయిపోయారు. పై పెచ్చు అ అనవసర ఆడంబరాలతో సహా నాటకాన్ని గుర్తించి ఆదరించడం లేదని ప్రజల్ని తప్పుబడుతున్నారు.

ప్రజలకు సన్నిహితమై వారి స్పందనా ప్రతిస్పందనల్నించి తాను చెప్పదల్చుకున్న విషయాన్ని అభివృద్ధి చేసుకుంటూ పోగల శక్తి ఒక్క నాటిక నాటకం లాంటి సజీవ (దృశ్య) కళారూపాలికే వుంది. సినిమా, వీడియో, టి.వి. లాంటి యాంత్రిక (ప్రధానమైన) కళాసాధనాలు ఆ అభివృద్ధిని 'రికార్డు' చేసి జాగ్రత్త పర్చగలుగుతాయేగాని వాటిని అభివృద్ధి పర్చలేవు. ఈ మౌలికమైన తేడాని గుర్తించక పోవడం వల్లే నాటికా నాటకాల్ని - అలాంటి దృశ్య రూపకాల్ని - యాంత్రిక (ప్రధానమైన) కళాసాధనాలుగా మార్చి, వాటి నిర్మాణానికి పెట్టుబడి బరువుని పెంచుకుని, ఆ బరువుని ప్రజల మీద టిక్కెట్ల రూపంలో పడేసి, వారు మొయ్యలేక రాకపోయే సరికి ఆదరించడం లేదని గగ్గోలు పెడుతున్నారు.

వెనకటి 'ప్రజానాట్యమండలి' దళాలు నాటికా నాటకాల్ని వీలైనంత వరకూ యీ యంత్ర పరికరాల మీద ఆధారపడకుండా సజీవత్వంతో నడిపే ప్రయత్నం చేశాయి. ఈ విషయం "మా భూమి", "ముందడుగు" ప్రదర్శనలికి వారు తీసుకున్న ముందు జాగ్రత్తలు చూస్తే తెలుస్తుంది. ఆ అనుభవాల్ని అక్షరబద్ధం చేసి ఆ నాటకాల ముందు ప్రదర్శకులికి ప్రదర్శనా సూచనలుగా యిచ్చారు. అప్పటికది జరగడం గొప్ప విషయం. వారు వేసిన దారిని నాటక సంస్థలు (ముఖ్యంగా గ్రామీణ నాటక సంస్థలు) ఆనాడు అనుసరించి నాటకాన్ని ప్రజల మధ్యకి తీసుకు పోయాయి.

ఇప్పుడు అదే విధంగా, నేటి చారిత్రక అగత్యాన్ని గుర్తించి 'జననాట్య

మండలి' దళాలు నాటికా నాటకం లాంటి దృశ్య కళారూపాల్ని పూర్తిగా పెట్టుబడి (యంత్ర పరికరాల మీద ఆధారపడే పరిస్థితి) నుంచి విముక్తం చేస్తూ జనం మధ్యకి తీసుకుపోవాలి. వెనకటిలాగే వీరు నడిచిన దారిని ఆ తరువాత అనేక మంది నడిచి వాటిని ప్రజల మధ్యకి విరివిగా తీసుకెడతారు. అవి చైతన్యవంతమౌతూ ప్రజల్ని చైతన్యవంతం చేసే క్రమం మొదలవుతుంది.

ఆ క్రమానికి అంకురార్పణ చేయడానికి 'ఒక వీరుడు మరణిస్తే' లాంటి నాటికలు గొప్పగా దోహదం చేస్తాయి. ఈ విషయాన్ని రాష్ట్రంలోని జె.ఎన్.ఎమ్. సభ్యులందరూ గుర్తించాలి. ఆచరణకి నడుంకట్టాలి.

ఇక్కడో చిన్న వివరణ.

స్క్రిప్ట్ లేకుండా ఎక్స్‌టెంపోర్‌గా-ప్రదర్శించడం మౌఖిక సాంప్రదాయంలో కొస్తుంది. స్క్రిప్ట్ సిద్ధం చేసుకుని ప్రదర్శించడం లిఖిత సాంప్రదాయంలో కొస్తుంది. సజీవ కళాసాధనాల అభివృద్ధికి యీ రెండూ అవసరమే కారణం మనిషికి మరుపు సహజం. వయస్సు మీదపడే కొద్దీ ఆ శక్తి సన్నగిల్లుతుందికూడా. అందుకని జె.ఎన్.ఎమ్. దళాలు యిలాంటి నాటికల్ని తీసుకుని రచయితే సూచించినట్టు యీ అస్థిపంజరానికి అవసరమైన రక్తమాంసాల్ని పెంచే లక్ష్యంతో ఎక్స్‌టెంపోర్‌గా ప్రదర్శించాలి. ఆ ప్రయత్నాల్లో ఆ యా దళాలికి గుణాంశాలుగా అనిపించిన విషయాల్ని రాసుకోవాలి. రచయితకి పంపాలి. వాటిని గ్రహించి రచయిత ఆ రచనని మెరుగుపెట్టుకుంటూ పోవాలి. ఇదే పద్ధతిని ఆ తరువాత నాటకానికైనా మరే సజీవ కళారూపానికైనా వర్తించవచ్చును.

ఇది సజీవ కళాసాధనం. ప్రజల ప్రతిస్పందనల్ని బట్టి అభివృద్ధి చెందుతూ తన సజీవత్వాన్ని పెంచుకునేందుకున్న క్రమాల్లో ఓ క్రమం. నాడి ప్రజల వుద్యమం అన్న గురజాడ కలం నుంచి 'కన్యాశుల్కం' తొలి ప్రతి నుంచీ యీ క్రమంలో-దరిదాపు పడి పదిహేనేళ్ళపాటు - దిద్దుబాట్లు చేసుకుని యెలా అభివృద్ధి చెంది సజీవత్వాన్ని పెంచుకుందో మనకి తెల్సు. ఇలాంటి ప్రయత్నం ప్రజా ఉద్యమాల్లోనే సాధ్యం. సాధ్యమైన దాన్ని సాధనలో పెట్టకుండానే వెనకటి ప్రజానాట్యమండలి ప్రభుత్వ అంక్షలూ అణచివేతల వల్ల "మా భూమి" ని చారిత్రకావసరం తీర్చిన మహత్తర నాటకంగా మిగిల్చింది గాని, దాని సజీవత్వాన్నింకా పెంచవల్సినంతగా

స్వీకారం

కంజిర - పొయిట్రీ బులెటిన్ 1, నవంబర్ 1990 - 16 పేజీలు, ఒక రూపాయి. ప్రతులకు, కంజిర, 46-16-23, దానవాయి పేట, రాజమండ్రి -533 103

గడ్డి పరకతో విప్లవం - ప్రకృతి వ్యవసాయ పరిచయం - మసనోబు పుకుఓకా, టింబక్టు - కలెక్టివ్ ప్రచురణ, 200+xiv పేజీలు, సాదాప్రతి రు. 30/- మేలుప్రతి రు. 50/- ప్రతులకు : టింబక్టు కలెక్టివ్, చెన్నేకొత్తపల్లి పోస్ట్, మండల్ అనంతపురం. 515 101

కఠోర షడ్జమాలు - (1987-1990) - వసంత కన్నబిరాన్. పర్‌స్పెక్టివ్స్ హైదరాబాద్ ప్రచురణ, 172+xii పేజీలు, 20 రూపాయలు, ప్రతులకు ప్రగతి బుక్‌హౌస్, గాంధీ కో ఆపరేటివ్ బ్యాంకి ఎదురుగా, మ్యూజియం రోడ్డు, గవర్నర్ పేట, విజయవాడ.

చైతన్య కవిత - 10 ప్రమోద శరత్తు - సంపాదకులు : తంగిరాల సుబ్బారావు ఆర్వీ యస్ సుందరం, చైతన్య కవితా వేదిక, బెంగుళూరు ప్రచురణ, 58+viii పేజీలు. రు. 10 00, ప్రతులకు ప్రొ. టి. వి. సుబ్బారావు, హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు, బెంగుళూరు యూనివర్శిటీ, జ్ఞాన భారతి, బెంగుళూరు - 560 056.

పెంచలేక పోయింది. ఈ అనుభవాల్ని లెక్కలోకి తీసుకుని జె.ఎన్.ఎమ్. సభ్యులు క్రమశిక్షణతో యీ క్రమానికి అంకురార్పణ చేయాలి. అందుకు పి. శశిధర్ రాసిన "ఒక వీరుడు మరణిస్తే" ఒక నమూనా. ఒక నాయకుడు మరణిస్తే, ఆ 'ఘర్షణ' నుంచే మరో నాయకుడు యెలా ఉద్భవిస్తాడో సూటిగా సూక్ష్మంగా చెప్పిందీ నాటిక. ఇలాంటివి కొన్ని తాను రాసినట్టు 'గద్దర్' నాతో చెప్పారు. ఇలాగే వాటినీ యిలా రాసే వాటిని సృజన, అరుణతారల్లో ప్రచురించాలి. జె.ఎన్.ఎమ్. దళాలు ప్రదర్శించాలి. అచ్చు అభివృద్ధిని రికార్డు చేసే ఒక యాంత్రిక ప్రయత్నం. కనుక అనేక ప్రదర్శనల ద్వారా దిద్దుబాట్లు చేసుకున్న ఫైనల్ ప్రతినే అచ్చువేయించాలిగాని, ఏదో రాసి చుట్టూవున్న పదిమందిచేత అవుననిపించుకుని అచ్చుకిచ్చే పద్ధతిని ఉద్యమాల్తో పేగుముడేసుకున్న రచయితలైనా ముందు వొదులుకోవాలి. లేకపోతే రాసిందే గొప్ప, ఒక్కసారి వేసిందే గొప్ప అని అచ్చుకోసం ఆరాటపడే ఔత్సాహిక రచయితలికి ఉద్యమ రచయితలకి తేడా వుండదు. అంచేత వర్తమాన చారిత్రక అగత్యాన్ని గుర్తించి జె.ఎన్.ఎమ్. అలాంటి విప్లవ సాంస్కృతిక సంస్థలూ యీ క్రమానికి అంకురార్పణ చేయాలని చేస్తారని ఆశిస్తున్నాను. ఈ నాటిక రాసిన పి. శశిధర్ గారికి ప్రచురించిన 'సృజన'కి నా అభినందనలు. —కాకరాల

SRJANA Telugu Monthly December 1990

Regd. No. with the Registrar of Newspapers for India 10953/67

సృజనకు ఆర్థిక, హార్దిక సహకారాన్ని అందించండి!

1990 జనవరిలో మళ్ళీ ప్రారంభమైన 'సృజన' ఈ పదకొండు నెలలుగా తీవ్రమైన ఆర్థిక సమస్యలను, రచనల కొరతను ఎదుర్కొంటున్నది. సృజన పట్ల పాఠకులలో, విప్లవోద్యమ సానుభూతిపరులలో కనబడుతున్న విస్తృత ఆదరణ ఆర్థిక రూపంలోకి పరిణమించడం లేదు. సృజన చందాదారుల సంఖ్య, ఏజెంట్లసంఖ్య గణనీయంగా పెరగడం లేదు. సృజన మీ పత్రిక. సృజన ప్రజల పత్రిక. సృజనను గతంలో కూడ ప్రజలే తమ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. మళ్ళీ ఒకసారి హెచ్చు సంఖ్యలో చందాలు చేర్పించడం ద్వారా, విరాళాలు సేకరించడం ద్వారా, కొత్త ప్రాంతాలలో ఏజెంట్లను కుదిర్చిపెట్టడం ద్వారా, ఏజెంట్లు సక్రమంగా బకాయిలు చెల్లిస్తున్నారో లేదో కనుక్కోవడం ద్వారా ప్రజలే సృజన జీవనానికి బాసటగా నిలవవలసి ఉన్నది. సృజనను రక్షించుకునే బాధ్యతను విప్లవ సాహిత్యోద్యమ సానుభూతిపరులు స్వచ్ఛందంగా స్వీకరించవలసి ఉన్నది.

సృజన సంవత్సర చందా రు. 40. విడి ప్రతి రు. 4.

* సృజనకు విరివిగా చందాలు సేకరించండి!
* సృజనను పదికాలాలపాటు నిలిపి ఉంచేందుకు మీ వంతు కర్తవ్యం నిర్వహించండి!

SRJANA Rs. 4/-

Flat 11, Block 2,

MIG II, Baghlingampalli,

Hyderabad-500 044.